బుధవారం
10•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
• సంపుటి 9 • సంచిక 15
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD






మంగళవారం మాంచెస్టర్‌లో భారత్, న్యూజిలాండ్ సెమీఫైనల్ మ్యాచ్‌ను వరుణుడు అడ్డుకోవడంతో మైదానం నుంచి నిరాశగా వెనుదిరిగిన భారత జట్టు కెప్టెన్ కోహ్లీ.

# నీరుగారిన ఉత్సాహం!

**వరల్డ్‌కప్ సెమీస్ మ్యాచ్ వర్షంతో నేటికి వాయిదా • భారత బౌలర్ల సమిష్టి ప్రదర్శన • న్యూజిలాండ్ 211/5**

**వరల్డ్‌కప్** టోర్నీలో భారత్, న్యూజిలాండ్‌ను వరుణుడు నీడలా వెంటాడుతూనే ఉన్నాడు. లీగ్ దశ తరహాలోనే కీలక సెమీఫైనల్లోనూ వర్షం అంతరాయం కల్గించింది. ఫలితంగా ఎన్నో ఆశలు, అంచనాల మధ్య మొదలైన సెమీస్ మ్యాచ్ కాస్తా నీరు గారిపోయింది. ఎడతెరిపిలేని వర్షంతో మైదానం చిత్తడిగా మారిపోయింది. పలుమార్లు పరిశీలించిన అంపైర్లు ఆటకు అనువుగా లేదని తేల్చడంతో మ్యాచ్‌ను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అప్పటివరకు ఓపికతో ఎదురుచూసిన వేలమంది అభిమానులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఐసీసీ నిబంధనల ప్రకారం వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఉన్న ఇన్నింగ్స్‌ను మరుసటిరోజు తిరిగి కొనసాగించనున్నారు. అయితే బుధవారం కూడా భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ఒక వేళ మ్యాచ్ పూర్తిగా రద్దయితే.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన భారత్ నేరుగా ఫైనల్లోకి దూసుకెళుతుంది. లేకపోతే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఓవర్లు కుదించి మ్యాచ్‌ను కొనసాగించే ప్రయత్నం చేయవచ్చు. మంగళవారం టాస్ గెలిచిన న్యూజిలాండ్.. కెప్టెన్ విలియమ్సన్ (67), రాస్ టేలర్ (67 నాటౌట్) అర్ధసెంచరీలతో 46.1 ఓవర్లలో 211/5 స్కోరు చేసింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ బుమ్రా, భువనేశ్వర్ నిప్పులు చెరిగే బంతులతో కివీస్ బ్యాట్స్‌మెన్‌ను వణికించారు. స్వింగ్‌తో అదరగొడుతూ పరుగులను నియంత్రించారు. విలియమ్సన్, టేలర్ మినహా ఎవరూ క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేయకపోవడం మన బౌలింగ్ సత్తాను చాటింది. సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకున్న టీమ్‌ఇండియా బౌలర్లు ఒక్కో వికెట్‌ను తమ ఖాతాలో వేసుకున్నారు.

వివరాలు ఆటలో



# హైదరాబాద్‌లో రియల్ ధమాకా

**ఆఫీస్ స్పేస్ గిరాకీ అదరహో!**

- దేశంలోనే అత్యుత్తమ వృద్ధి
- 2018తో పోల్చితే 129% పెరుగుదల
- కొత్త నివాస సముదాయాలదీ అదేజోరు
- 47% పెరిగిన కొత్త యూనిట్ల ప్రారంభం
- నైట్‌ఫ్రాంక్ అర్ధసంవత్సర రిపోర్టులో వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

స్థిరమైన ప్రభుత్వం, మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం గల యువత, వ్యాపార అనుకూల ప్రభుత్వం.. ఈ సానుకూల అంశాలన్నీ కలిసి హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌రంగాన్ని అత్యున్నతస్థాయిలో నిలబెడుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాలు సైతం రియల్‌ఎస్టేట్ రంగంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నప్పటికీ హైదరాబాద్ మాత్రం దూసుకుపోతున్నది. తాజాగా ప్రముఖ స్వతంత్ర గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెన్సీ నైట్‌ఫ్రాంక్ మంగళవారం హోటల్ తాజ్‌బంజారాలో విడుదలచేసిన 11వ ప్రతిష్ఠాత్మక అర్ధసంవత్సర నివేదికలో

మిగతా 5వ పేజీలో

# పంచసూత్ర గోదారి

**గోదావరి మథనంలో ఐదు ప్రతిపాదనలు • తెలంగాణ తరపున రెండు.. ఏపీ తరపున మూడు**

**గోదావరి జలాలను ఇరు రాష్ట్రాలు వాడుకోవాల్సిందే**

- నీటి అవసరాలు, లభ్యతపై చర్చించాం
- మరోసారి భేటీతో ప్రాథమిక నివేదికకు రూపు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీల వెల్లడి
- ప్రతిపాదనలను పరస్పరం పరిశీలించాలని నిర్ణయం
- 13 లేదా 15న భేటీలో సీఎంలకు సమర్పించే ప్రతిపాదనల ఖరారు

**తెలంగాణ ప్రతిపాదనలు**

1 ములుగు జిల్లా రాంపూర్- నాగార్జునసాగర్- శ్రీశైలం
2 పోలవరం కుడికాల్వ- నాగార్జునసాగర్- శ్రీశైలం

**ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలు**

1 తుపాకులగూడెం- శ్రీశైలం
2 దుమ్ముగూడెం- శ్రీశైలం
3 పోలవరం కుడికాల్వ- నాగార్జునసాగర్



**1300 టీఎంసీలు**
కృష్ణాబేసిన్‌లో రెండు రాష్ట్రాల అవసరాలు

**400 టీఎంసీలు** నికరంగా లభ్యత | **900 టీఎంసీలు** లోటు అంచనా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కృష్ణాబేసిన్‌కు గోదావరిజలాల తరలింపు ప్రాజెక్టుల రూపకల్పన కీలక అంకానికి చేరుతున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశంతో రంగంలోకి దిగిన రెండు రాష్ట్రాల ఇంజినీర్లు కొన్నిరోజులుగా సుదీర్ఘ కసరత్తుచేశారు. ఏయేమార్గాల్లో గోదావరిజలాలను నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలకు తరలించేందుకు అవకాశం ఉన్నదో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. తెలంగాణ ఇంజినీర్ల కమిటీ రెండు ప్రతిపాదనలు, ఆంధ్రప్రదేశ్ తరపున ఆ రాష్ట్ర ఇంజినీర్ల కమిటీ మూడు ప్రతిపాదనల్ని కొలిక్కి తీసుకువచ్చాయి. రాంపూర్ నుంచి గోదావరిజలాల్ని మళ్లించి, ఉదయసముద్రం వేదికగా ఒకవైపు నాగార్జునసాగర్‌కు, మరోవైపు శ్రీశైలం జలాశయానికి తరలించేందుకు తెలంగాణ ఇంజినీర్లు ప్రతిపాదనచేశారు. ఇందులో మార్గమధ్యంలో సాగునీరు అందించే అవకాశాన్ని పొందుపర్చారు. పోలవరం కుడికాల్వ నుంచి నాగార్జునసాగర్‌కు, ఆపై శ్రీశైలం రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు మరో ప్రతిపాదనచేశారు. ఇక ఏపీ ఇంజినీర్లు తుపాకులగూడెం నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌కు మళ్లించాలని ఒక ప్రతిపాదన, దుమ్ముగూడెం నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌కు మరో ప్రతిపాదన, మూడవదిగా పోలవరం కుడికాల్వనుంచి

మిగతా 2వ పేజీలో

# వీసీల నియామకానికి పచ్చజెండా

**తొమ్మిది వర్సిటీల్లో భర్తీకి సర్కారు చర్యలు**

**నోటిఫికేషన్ జారీచేసిన ఉన్నత విద్యామండలి**

**దరఖాస్తుల స్వీకరణకు 23 వరకు గడువు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో త్వరలో ఖాళీకానున్న వైస్‌చాన్స్‌లర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తొమ్మిది వర్సిటీల్లో వీసీ పోస్టుల భర్తీకి రాష్ట్ర ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీచేసిందని చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. వీసీల నియామకం కోసం అర్హులైనవారు.. ఈ నెల 23 వరకు విద్యాశాఖ కార్యదర్శికి చేరుకొనేలా తమ దరఖాస్తులను పంపాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్, కాకతీయ యూనివర్సిటీ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ వీసీల పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

# మోస్తరు వానలే!

**రాష్ట్రంలో 24 జిల్లాల్లో ఇప్పటివరకు 35% లోటు**

**అత్యధికంగా నల్లగొండలో 63%, ఖమ్మంలో 76% తక్కువ వర్షం**

**మందకొడిగానే రుతుపవనాలు**

**సాధారణ వర్షపాతం 175 మి.మీ.కుగాను 114 మి.మీ. మాత్రమే నమోదు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రారంభం నుంచి ఇప్పటివరకు 35 శాతం లోటు వర్షపాతం నమోదైందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇప్పటివరకు సాధారణంగా 175 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, కేవలం 114 మి.మీ. వర్షం కురిసిందని వెల్లడించింది. రాష్ట్రంలోని 24 జిల్లాల్లో లోటు వర్షపాతం

మిగతా 8వ పేజీలో



మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గం రిసాలగడ్డలో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ముస్లిం మహిళలు




# సభ్యత్వాల పండుగ

**టీఆర్ఎస్ మెంబర్‌షిప్ కోసం**

**ఆసక్తి చూపుతున్న అన్ని వర్గాల ప్రజలు**

7

# కర్ణాటక సర్కార్‌కు ఊరట

**ఎమ్మెల్యేల రాజీనామాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోని స్పీకర్**



కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్

- 14 మందిలో తొమ్మిది మంది రాజీనామాలు సక్రమంగా లేవని వెల్లడి
- నిబంధనల ప్రకారం రాజీనామా చేసిన ఐదుగురితో వ్యక్తిగతంగా భేటీ కావాలని నిర్ణయం
- శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కాంగ్రెస్ బహిష్కృత ఎమ్మెల్యే

9

# ఎదురేగిన గోదారమ్మ

**రివర్స్ పంపింగ్‌తో అన్నారం బరాజ్‌కు జలకళ**

**స్వభావానికి భిన్నంగా ఎదురొస్తున్న నదీప్రవాహం • సంభ్రమాశ్చర్యాలలో నదీ తీరప్రాంత ప్రజలు**



మంగళవారం కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌కు వస్తున్న గోదావరి నీరు. (ఇన్‌సెట్) మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, ధర్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి

- కన్నెపల్లిలో మూడు మోటర్లతో నిర్విరామంగా పంపింగ్
- ఆరు నిమిషాలపాటు నీటిని ఎత్తిపోసిన నాలుగో మోటర్
- ప్రగతిభవన్ నుంచి స్వయంగా పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్
- ఫోన్ ద్వారా ప్రాజెక్టు ఇంజినీర్లకు సూచనలు

**జయశంకర్ జిల్లా ప్రతినిధి/ మంథని, నమస్తే తెలంగాణ:**

నిర్విరామంగా పనిచేస్తున్న మూడు మోటర్లు.. సెకనుకు 60 క్యూమెక్స్‌ల చొప్పున రోజుకు 6300 క్యూసెక్కుల నీటి ఎత్తిపోత! ఏక్షణమైనా నిరంతరాయంగా నీటిని ఎత్తిపోయనున్న నాలుగో నంబర్ మోటర్! ఇదీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్ జల ప్రగతి! ప్రాణహిత వరదనీరు గోదావరిలోకి వచ్చి చేరుతున్న నేపథ్యంలో ఒక్కొక్క మోటర్‌ను ప్రారంభించిన అధికారులు.. ప్రస్తుతానికి మూడు మోటర్ల ద్వారా నిరంతరాయంగా గోదావరి జలాలను కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా ఎత్తిపోస్తున్నారు. ఈ నీరు గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌కు చేరుతున్నది. నది సహజస్వభావానికి భిన్నంగా నీటిప్రవాహం పల్లంనుంచి ఎదురెక్కుతుండటంతో ఎగువ ప్రాంత తీర గ్రామాల చెంతకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతున్నది. సాధారణంగా ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నుంచి రావాల్సిన గోదారమ్మ.. ఎదురు ప్రవాహంతో వస్తున్న దృశ్యం సమీప ప్రాంతాల గ్రామాల ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నది. రివర్స్ పంపింగ్‌తో అన్నారం బరాజ్‌లో నీటిమట్టం పెరుగుతుండటంతో పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని ఆరెంద, మల్లారం గ్రామాల దాకా నీరు కనిపిస్తున్నది. మరో 20 కిలోమీటర్ల మేర జలాలు ఎగబాకితే అన్నారం పంప్‌హౌస్‌ను చేరుకుంటాయి. మంగళవారం వరకు 0.82 టీఎంసీల నీరు

మిగతా 3వ పేజీలో

**గోదావరిలో ప్రవహిస్తున్న 25వేల క్యూసెక్కులు**

- అన్నారం బరాజ్‌లో నేడు ఒక టీఎంసీకి చేరనున్న నీరు
- వర్షాలతో సుందిల్ల బరాజ్‌లో 0.6 టీఎంసీ నిల్వ
- గేట్లు, కాంక్రీట్ టెస్టింగ్‌కు ఇంజినీర్ల ఏర్పాట్లు



# దిగొచ్చిన పసిడి ధర

ఒకేరోజు తులంపై రూ.600 తగ్గిన రేటు

11




# కుటుంబాల మధ్య రెవెన్యూ చిచ్చు

**ధర్మగంట**

- ఎనిమిది వాటాల భూమి ఇద్దరికే పట్టా
- జరిగిన తప్పుపై ఆర్డీవోకు తాసిల్దార్ నివేదిక
- సరిచేయకుండా ఏడాదిన్నరకాలంగా తాత్సారం
- నేనే రాశా.. ఏం చేసుకుంటారంటూ ఓ అధికారి బెదిరింపు

4

**ముప్పైఎనిమిదెకరాల** భూమిని ఎనిమిదివాటాలుగా పంచుకుని పదిహేను కుటుంబాలు ఏండ్లుగా సాగుచేసుకుంటున్నాయి. అందులో కొద్దిమందికి పాత పాస్‌పుస్తకాలు లేకపోయినా.. పహాణీలో పేర్లు ఉండటంతో అంతగా పట్టించుకోకుండా కలిసిమెలిసి జీవిస్తున్నారు. అయితే, ఆ భూమి అంతటికీ రెండు కుటుంబాలకే పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చి వారిమధ్య చిచ్చుపెట్టారు రెవెన్యూ అధికారులు. ఈ విషయంలో తప్పు జరిగిందంటూ ఆర్డీవోకు నివేదిక ఇచ్చినా.. దానిని సరిచేయకుండా తాసిల్దార్ ఏడాదిన్నర కాలంగా తాత్సారం చేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయిన బాధితులు నమస్తే తెలంగాణ ధర్మగంటను ఆశ్రయించారు. రెండుకుటుంబాలకే భూమి రాశా.. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ ఓ అధికారి బెదిరింపులకు పాల్పడుతున్నాడని గోడు వెళ్ళబోసుకున్నారు.



కరీంనగర్ జిల్లా కాచిరెడ్డిపల్లిలో తమ భూమి పూర్వపు పత్రాలు చూపుతున్న బాధిత రైతులు



కేరళ స్పీకర్ శ్రీరామకృష్ణన్‌ను సన్మానిస్తున్న తెలంగాణ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు హనుమంత్ షిండే, విఠల్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు ఉన్నారు.

## శాసనసభను సందర్శించిన కేరళ స్పీకర్

సన్మానించిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర శాసనసభను కేరళ శాసన సభ స్పీకర్ పీ శ్రీరామకృష్ణన్ మంగళవారం సందర్శించారు. ఆయనకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికి, శాలువా కప్పి, జ్ఞాపికను ప్రదానం చేశారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా శ్రీరామకృష్ణన్ సచివాలయాన్ని సందర్శించారు. ఇద్దరు స్పీకర్లు కొంతసేపు సమావేశమై రెండు రాష్ట్రాల సభా వ్యవహారాలు, పరిపాలనపరమైన అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు వివరించారు. ఎమ్మెల్యేలు హనుమంత్ షిండే, విఠల్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు ఆయన వెంట ఉన్నారు.

## ఓవర్‌లోడ్ వేస్తే జైలుకే!



- వాహన యజమానికి, డ్రైవర్‌కు శిక్షలు
- సరుకు అమ్మిన, కొన్నవారికి జరిమానా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** పరిమితికి మించి వాహనంలో అధికబరువు (ఓవర్‌లోడ్) తరలిస్తే ఇక నుంచి కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. కేంద్ర ఉపరితల రవాణాశాఖ ఆదేశాల ప్రకారం బుధవారం నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తున్నది. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీగా ఉన్న రాష్ట్ర పోలీసు, రవాణాశాఖ ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మోటరు వాహనాల చట్టం సెక్షన్ 3 రహదారుల చట్టం ప్రకారం వాహనంలో ఎక్కువ బరువు వేస్తే రోడ్లు దెబ్బతింటాయనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్టీ/11038/37/19 నంబరుతో ఆదేశాలు వచ్చాయి. కేంద్ర ఉపరితల రవాణాశాఖ నోటిఫికేషన్ జీఎస్‌ఆర్ 1081(ఈ) ప్రకారం శిక్షలను కూడా ఖరారు చేశారు. పరిమితికి మించి ఓవర్‌లోడ్ రవాణాచేస్తూ పట్టుబడితే వాహన డ్రైవర్‌కు కనీసం 6 నెలల జైలుశిక్షతోపాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడేండ్లపాటు రద్దుచేస్తారు. వాహన యజమానిపై కూడా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, ఓవర్‌లోడ్ చేసినందుకు లోడ్‌చేసిన వారితోపాటు కొనుగోలు చేసిన యజమానులపై భారీ జరిమానాలు విధించాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖ కార్యదర్శి సంజీవ్‌రంజన్ ఆదేశాలు జారీచేశారు.



## ఆపద్బంధు పథకానికి రూ.1.66 కోట్లు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విపత్తుల కారణంగా మరణించినవారి కుటుంబాలకు ఆపద్బంధు పథకం కింద సహాయం అందించడానికి 322 దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.66కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల ద్వారా బాధిత కుటుంబాలకు అందజేస్తారు. మరణించిన ఒక్కో వ్యక్తి కుటుంబానికి రూ.50 వేలచొప్పున సహాయం అందిస్తారు. 2011-12 నుంచి 2018-19 వరకు వివిధ విపత్తుల్లో మరణించిన 322 మంది కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందించేలా మంగళవారం రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి ఉత్తర్వులు జారీచేశారు. ఈ పథకం కింద ఆదిలాబాద్ జిల్లాకు రూ.19.5 లక్షలు, హైదరాబాద్‌కు 26, జగిత్యాలకు 10, కామారెడ్డికి 14.5, కరీంనగర్‌కు 16, మహబూబాబాద్‌కు 1.5, నిర్మల్‌కు 8, నిజామాబాద్‌కు 53, రాజన్న సిరిసిల్లకు 5, వనపర్తికి 1, వరంగల్ రూరల్‌కు 2, యాదాద్రి భువనగిరికి 9.5 లక్షల చొప్పున విడుదల చేశారు.

## నేడు ఎంసెట్ ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి జూన్ 24 నుంచి నిర్వహించిన కౌన్సెలింగ్ సోమవారం ముగిసింది. బుధవారం సీట్ల కేటాయించ నున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయడానికి ఈనెల 15 వరకు గడువు విధించే అవకాశాలు ఉన్నాయని, https://tseamcet.nic.in వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు కళాశాలలో చేరుతున్నట్టు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఎంసెట్ అడ్మిషన్ కన్వీనర్ నవీన్‌మిత్తల్ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 53,934 మంది విద్యార్థులు హాజరు కాగా.. వెబ్ ఆప్షన్ల ఎంపిక కోసం 52,629 మంది హాజరైనట్టు కన్వీనర్ తెలిపారు.

## రేపటినుంచి ఈసెట్ రెండోవిడుత కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంజినీరింగ్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ఈసెట్ రెండోవిడుత కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం నుంచి స్లాట్‌బుకింగ్, ఫీజు చెల్లింపు ప్రారంభమవుతుందని కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న ధ్రువపత్రాల పరిశీలన, 12,13 తేదీల్లో ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఉంటుందని, 15న సీట్ల కేటాయింపు చేయనున్నట్టు ఎంసెట్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

### ముహూర్తం



సూర్యోదయం: 5.52 గంటలకు



సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, నవమి, నక్షత్రం: చిత్త సాయంత్రం 4.23 వరకు, తదుపరి స్వాతి, అమృతఘడియలు: ఉదయం 10.13 నుంచి 11.49 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.22 నుంచి 1.59 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.56 నుంచి మధ్యాహ్నం 2.34 వరకు, వర్జ్యం: రాత్రి 9.52 నుంచి 11.28 వరకు.

# శ్రీశైలం వయా అక్కంపల్లి

- పంచప్రతిపాదనల్లో ప్రధాన పాయింట్ ఇదే
- రోజుకు రెండు టీఎంసీల తరలింపును ప్రతిపాదించిన తెలంగాణ
- ఏపీ అలైన్‌మెంట్లలో నాలుగు టీఎంసీల తరలింపు



రాంపూర్ నుంచి శ్రీశైలం తరలించేలా తెలంగాణ ఇంజినీర్లు చేసిన డిజైన్



పోలవరం నుంచి శ్రీశైలం తరలించేలా సూచించిన ప్రతిపాదన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌కు గోదావరిజలాల తరలింపుపై రెండురాష్ట్రాల ఇంజినీర్లు సుదీర్ఘ మథనం చేశారు. తెలంగాణ ఇంజినీర్ల కమిటీ రెండు, ఏపీ కమిటీ మూడు ప్రతిపాదనలను సిద్ధంచేశాయి. వీటిపై మంగళవారం నాటి సంయుక్త భేటీలో చర్చించారు.

### తెలంగాణ ప్రతిపాదనలు

**1. రాంపూర్-నాగార్జునసాగర్-శ్రీశైలం**

ములుగు జిల్లాలో సముద్రమట్టానికి 85 మీటర్ల ఎత్తులోఉన్న రాంపూర్ నుంచి గోదావరిజలాలను మళ్లిస్తారు. ముందుగా కాల్వ, తర్వాత సొరంగ మార్గం ద్వారా తరలించాక.. 130 మీటర్ల మేర ఎత్తిపోయడం ద్వారా లక్నవరం చెరువులోకి చేరతాయి. అక్కడినుంచి సొరంగమార్గంద్వారా తరలించి రెండోదశలో 90 మీటర్ల మేర ఎత్తిపోస్తారు. తద్వారా డీబీఎం-30 (20 వ కిలోమీటర్ వద్ద)లోకి చేరుతాయి. తర్వాత గ్రావిటీ ద్వారా కాకతీయకాల్వలోకి వెళతాయి. కాకతీయకాల్వ 248వ కిలోమీటర్ నుంచి 347వ కిలోమీటర్ (చివరి పాయింట్).. ఆపై మూసీలోకి చేరుతాయి. మూసీ నుంచి గ్రావిటీకాల్వ ద్వారా నల్లగొండ సమీపంలోని చర్లపల్లి వద్దకు తరలిస్తారు. అక్కడి నుంచి ఒకమార్గంలో గ్రావిటీ ద్వారా ఉదయసముద్రంలో పోస్తారు. అక్కడినుంచి పెద్దదేవులపల్లి చెరువుకు ఆపై సాగర్‌కు చేరుతాయి. చర్లపల్లి పాయింట్ నుంచి మరోమార్గంలో డిండిఎత్తిపోతల పథకానికి అనుసంధానిస్తూ ముందుకుతీసుకుపోతారు. ఇందులోభాగంగా కిష్టరాంపల్లి జలాశయం మీదుగా తరలించి.. మూడోదశలో 40 మీటర్ల మేర, నాలుగోదశలో 45 మీటర్లమేర ఎత్తిపోసి.. సొరంగమార్గం ద్వారా మోలచింతలపల్లి వద్ద శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్‌లో పోస్తారు. ఈ అలైన్‌మెంట్‌లో రెండునుంచి రెండున్నర టీఎంసీలను తరలించాలని ఇంజినీర్లు ప్రతిపాదించారు. మార్గమధ్యంలో దాదాపు 12 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా డిజైన్‌చేశారు. అదేవిధంగా శ్రీశైలం జలాశయానికి తరలింపుమార్గంలో డిండి ఎత్తిపోతల పథకం కింద మరో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. రాంపూర్ అలైన్‌మెంట్‌లో కాకతీయ కాల్వ వరకే దాదాపు 70 కిలోమీటర్లు.. కిష్టరాంపల్లి తర్వాత మరో 70 కిలోమీటర్ల సొరంగమార్గాన్ని నిర్మించాల్సి ఉంటుంది. ముఖ్యంగా రాంపూర్ నుంచి నీటిని మళ్లించిన తర్వాత నిర్మించే సొరంగమార్గంలో దాదాపు 20 కిలోమీటర్లు టైగర్ రిజర్వ్ ఫారెస్టు ద్వారా వెళుతున్నట్లు తెలిసింది. ఒక టీఎంసీ తరలింపునకు ఒక సొరంగమార్గాన్ని నిర్మించాల్సి ఉన్నందున.. రెండు టీఎంసీలకు జంట సొరంగాలు నిర్మించాలి. రూ.77 వేల నుంచి 80వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

**2. పోలవరం-నాగార్జునసాగర్-శ్రీశైలం**

పోలవరం కుడికాల్వ ప్రస్తుతం ఒకటిన్నర టీఎంసీల ప్రవాహ సామర్థ్యం ఉన్నందున దానిని ఇంకా లోతుకు చేయడం వల్ల భూసేకరణ లేకుండా అదనంగా మరో టీఎంసీని తరలించేందుకు వీలవుతుంది.పోలవరం కుడి ప్రధానకాల్వ ద్వారా ప్రకాశం బరాజ్‌కు నీటిని తరలించాక మొదటిదశలో వైకుంఠాపురం బరాజ్‌లోకి ఎత్తిపోయాలి. ఆ తర్వాత రెండోదశ లిఫ్టు ద్వారా పులిచింతల జలాశయానికి తరలిస్తారు. అక్కడి నుంచి మూడోదశ లిఫ్టు ద్వారా సాగర్ టెయిల్‌పాండ్‌లో పోస్తారు. అక్కడి నుంచి రివర్సబుల్ పంపింగ్ (విద్యుత్‌కు సంబంధించినవి) ద్వారా జలాశయానికి తరలిస్తారు. సాగర్ నీటి అవసరాలు తీరుస్తూనే.. శ్రీశైలం జలాశయం నుంచి అవసరమైనపుడు శ్రీశైలం టెయిల్‌పాండ్ నుంచి రివర్సబుల్ పంపింగ్ ద్వారా తిరిగి శ్రీశైలం జలాశయంలోకి గోదావరిజలాల్ని ఎత్తిపోస్తారు.

### ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలు

**1. తుపాకులగూడెం-శ్రీశైలం**

- ☞ తుపాకులగూడెం బరాజ్ నుంచి గోదావరి జలాలను మళ్లించి నేరుగా శ్రీశైలం జలాశయానికి రోజుకు నాలుగు టీఎంసీలు తరలించేలా ప్రతిపాదన. 65 కిలోమీటర్ల సొరంగమార్గంతో సహా 370 కిలోమీటర్ల మేర కాల్వ ద్వారా తరలింపు.
- ☞ తుపాకులగూడెం నుంచి నల్లగొండ జిల్లాలోని అక్కంపల్లి రిజర్వాయర్‌కు తరలించి.. ఆ తర్వాత నల్లగొండ, పాత మహబూబ్‌నగర్ జిల్లాల మీదుగా ఎర్రగుట్టవాగు (తెలంగాణ ఇంజినీర్లు రూపొందించిన రాంపూర్ అలైన్‌మెంట్‌లోని మోలచింతలపల్లి పాయింట్) వద్ద శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్‌లో పోస్తారు. ఇందుకుగాను అక్కంపల్లి రిజర్వాయర్ వరకు రెండుదశలతో కలిపి మూడుదశల్లో నీటిని లిఫ్టు చేయాల్సి ఉంటుంది.
- ☞ మధ్యలో ఎక్కడా ఆయకట్టుకు సాగునీరందించే వీలులేదు. దాదాపు రూ.80వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా.

**2. దుమ్ముగూడెం- శ్రీశైలం**

- ☞ దుమ్ముగూడెం నుంచి సాగర్ ఎడమకాల్వపై ఉన్న హాలియా వరకు తరలిస్తారు. అక్కడి నుంచి అక్కంపల్లికి.. ఎర్రగుట్టవాగు వద్ద శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్‌లో పోస్తారు. ఈ అలైన్‌మెంట్‌లోనూ సుమారు 65 కిలోమీటర్ల సొరంగమార్గం, మిగిలిన చోట్ల కాల్వద్వారా దాదాపు 375 కిలోమీటర్లు జలాల్ని తరలించాల్సి ఉంటుంది. మూడుదశల లిఫ్టును ప్రతిపాదించారు.



ఏపీ ప్రతిపాదించిన అలైన్‌మెంట్లు

**3. పోలవరం - నాగార్జునసాగర్**

- ☞ పోలవరం నుంచే లిఫ్టుద్వారా ఎత్తయిన ప్రాంతం (హై కాంటూర్)కు గోదావరి జలాలను తరలించనున్నారు. తద్వారా గ్రావిటీ ద్వారా పులిచింతలకు చేరుతాయి. పులిచింతల నుంచి లిఫ్టు ద్వారా నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్, అక్కడి నుంచి రివర్సబుల్ పంపింగ్ ద్వారా సాగర్ జలాశయంలోకి చేరుతాయి. ఈ ప్రతిపాదనలో రోజుకు రెండు టీఎంసీల మళ్లిస్తారు.


మొదటిపేజీ తరువాయి...


# పంచసూత్ర గోదారి



బుధవారం జలసౌధలో తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో సమావేశమైన రెండు రాష్ట్రాల ఇంజినీర్లు

నాగార్జునసాగర్‌కు మళ్లించేందుకు ఇంకో ప్రతిపాదనచేశారు. ఏపీ ఇంజినీర్లు రోజుకు నాలుగు టీఎంసీల తరలింపునకు రెండు ప్రతిపాదనలుచేశారు. తుపాకులగూడెం లేదా దుమ్ముగూడెంనుంచి ఈ నీటిని తరలించేలా అలైన్‌మెంట్‌లో నల్లగొండ జిల్లా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కామన్‌పాయింట్‌గా ఎంచుకున్నారు. ఈ రెండింట్లోనూ నాగార్జునసాగర్‌కు అనుసంధానించకుండా నేరుగా నాలుగు టీఎంసీలను శ్రీశైలానికి తరలించాలని ప్రతిపాదించారు. వీటిపై మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో రెండురాష్ట్రాల ఇంజినీర్లు సమావేశమయ్యారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగిన భేటీలో కృష్ణాబేసిన్‌లోని రెండు రాష్ట్రాల నీటి అవసరాలు, ఏటా సరాసరి నికర లభ్యతతోపాటు లోటు భర్తీకి గోదావరిజలాల తరలింపు కోసం చేపట్టే ప్రాజెక్టు ప్రతిపాదనలపై సుహృద్భావ వాతావరణంలో చర్చించారు. ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలు, గరిష్ఠ ప్రయోజనాలు, కష్టనష్టాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. పరస్పరం ప్రతిపాదనల్ని మార్చుకొని పరిశీలించి, ఈ నెల 13 లేదా 15న మళ్లీ సమావేశమవ్వాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల సీఎంల భేటీ 15న నిర్వహించేపక్షంలో ఈ నెల 13వ తేదీన సమావేశాన్ని నిర్వహించి.. తుది ప్రతిపాదనల్ని రూపొందించనున్నారు.

**ప్రధానంగా ఐదు ఎజెండా అంశాలు**

సమావేశంలో దాదాపు తొమ్మిది ఎజెండా అంశాల్ని ప్రతిపాదించినప్పటికీ.. ప్రధానంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి రెండు రాష్ట్రాల నీటి అవసరాలు.. ప్రస్తుతం బేసిన్‌లో నీటి లభ్యత, బచావత్ కేటాయింపులుపోను భవిష్యత్తులో నీటి లభ్యత.. గోదావరి నుంచి కృష్ణాబేసిన్‌కు ఎంత నీటిని తరలించాలి?.. తాజా ప్రతిపాదనలతో ట్రిబ్యునల్ ముందు తలెత్తే న్యాయపరమైన అంశాలు- వాటి పరిష్కారానికి చర్యలు.. ప్రాజెక్టుల ద్వారా తరలించే జలాలను రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయటం.. అనే ఐదు అంశాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు సుదీర్ఘంగా చర్చించారు. తాజా ప్రతిపాదనలపై సర్వే, ప్రాజెక్టులను చేపట్టడం.. అంచనా వ్యయం, నిర్వహణ వ్యయంలో రెండు రాష్ట్రాల వాటా.. ఈ ప్రాజెక్టులవల్ల ఎగువ రాష్ట్రాలు ట్రిబ్యునల్ ఆధారంగా వేసే ముందడుగులు, కేంద్రం ప్రతిపాదిస్తున్న గోదావరి-కావేరి అనుసంధానం వంటి అంశాల్ని ఎజెండాలుగా ప్రతిపాదించినా.. పెద్దగా చర్చించలేదని సమాచారం.

**ఆయకట్టుకు ఇస్తూనే.. జలాల తరలింపు**

మార్గమధ్యంలో ఆయకట్టుకు సాగునీరు అందిస్తూనే జలాల తరలింపు ఉండేలా తెలంగాణ ఇంజినీర్ల కమిటీ అలైన్‌మెంట్ ప్రతిపాదించడం విశేషం. తద్వారా జలాశయంలోకి గోదావరిని తరలించిన తర్వాత మళ్లీ ఆయకట్టుకు ఇవ్వడం అనే ప్రయాస లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఇంజినీర్ల కమిటీ స్పష్టంచేసింది. ఇందుకు రాంపూర్- నాగార్జునసాగర్-శ్రీశైలం అలైన్‌మెంట్‌ను ఉదహరించారు. ఈ అలైన్‌మెంట్‌లో ఎస్సారెస్పీ ఒకటి, రెండు దశలతోపాటు ఉదయసముద్రం, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. సాగర్ ఎడమకాల్వపై పెద్దదేవులపల్లి నుంచి పాలేరువరకు మధ్యలో ఉన్న ఆయకట్టుకు కూడా సాగునీరు ఇచ్చే అవకాశం కల్పించారు. దీంతో నాగార్జునసాగర్‌పై భారం గణనీయంగా తగ్గుతుంది. మరోవైపు నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద ఉన్న సుమారు రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాగూ సీతారామ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. అంటే.. ఎడమకాల్వ కింద తెలంగాణ పరిధిలో కేవలం 75 వేల ఎకరాలకు మాత్రమే (ఎడమ కాల్వపై 0-44 కిలోమీటర్ వరకు) సాగర్ ద్వారా సాగునీరు అందించాల్సి ఉంటుంది. ఇందుకు 15 టీఎంసీలు కావాల్సి ఉండగా.. హైదరాబాద్‌తోపాటు మిషన్‌భగీరథ తాగునీటి అవసరాలకు (ఏఎమ్మార్పీ ద్వారా) మరో సుమారు 20 టీఎంసీలు.. మొత్తంగా 35-40 టీఎంసీలు మాత్రమే సాగర్ జలాశయాల నుంచి నేరుగా తీసుకోవాల్సి ఉంటుందని తెలంగాణ ఇంజినీర్లు స్పష్టంచేశారు.

**వైకుంఠాపురంతో మళ్లిస్తే మేలు..**

శ్రీశైలం జలాశయం నుంచి భవిష్యత్తు నీటి అవసరాల కింద 300 టీఎంసీలు కావాల్సి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్లు అంచనా వేశారు. దీంతో తెలంగాణ ఇంజినీర్లు జోక్యం చేసుకొని.. సోమశిల, కండలేరుకు కూడా శ్రీశైలం ద్వారా నీళ్లిచ్చే బదులు పోలవరం-నాగార్జునసాగర్ గోదావరిజలాల తరలింపులో భాగంగా వైకుంఠాపురం బరాజ్ నుంచి సోమశిల, కండలేరుకు తక్కువ వ్యయంతో జలాల్ని మళ్లించే వెసులుబాటు ఉందని సూచించారని తెలిసింది. రాంపూర్- నాగార్జునసాగర్- శ్రీశైలం అలైన్‌మెంట్‌లో కూడా మార్గమధ్యంలో ఎక్కడికక్కడ సాగునీరు అందించే సూత్రాన్ని ప్రాతిపదికగా చేసుకున్నామని చెప్పారని సమాచారం. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు నేతృత్వంలో ఇంటర్‌స్టేట్ సీఈ నర్సింహారావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ నర్సింహ, మహబూబ్‌నగర్ సీఈ ఖగేందర్‌రావు, ఇంటర్‌స్టేట్ ఎస్‌ఈ మోహన్‌కుమార్‌తోపాటు విశ్రాంత ఇంజినీర్లు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకట్రామారావు, సత్తిరెడ్డి, భవానీరామ్‌శంకర్, ఏపీ జలవనరులశాఖ ఈఎన్సీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో చీఫ్ ఇంజినీర్లు సీ నారాయణరెడ్డి, కుమార్ (హైడ్రాలజీ), విశ్రాంత ఇంజినీర్లు రెహమాన్, రోశయ్య, ఆర్ ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారావుతోపాటు పలువురు ఎస్‌ఈలు పాల్గొన్నారు.

**సూత్రప్రాయంగా ఏకాభిప్రాయం**

రెండు రాష్ట్రాలు కృష్ణాబేసిన్‌కు గోదావరిజలాల్ని తరలించి వినియోగించుకోవాలనే సూత్రప్రాయ ఏకాభిప్రాయానికి వచ్చాం. రెండు రాష్ట్రాల నీటి అవసరాలు, నీటి లభ్యతను గుర్తించాం. గోదావరి నుంచి ఎంత నీటిని వాడుకోవాలో ఆలోచనచేశాం. తదుపరి సమావేశంలో అలైన్‌మెంట్లు తదితర అంశాలపై ఇంకా పరిశీలిస్తాం.

**- మురళీధర్‌రావు, తెలంగాణ ఈఎన్సీ**

**నాలుగు టీఎంసీలు మళ్లించాలి**

రెండు రాష్ట్రాల అవసరాలకు నాలుగు టీఎంసీల గోదావరిజలాల్ని కృష్ణాబేసిన్‌కు తరలించాలని నిర్ణయించాం. ఈ నీటిని తరలించే అలైన్‌మెంట్లపై లోతుగా చర్చ జరిగింది. సమస్యలు, ఇబ్బందులు, అన్నింటిపైనా తరువాతి సమావేశంలో మాట్లాడుతాం. రెండు రాష్ట్రాలు కలిసి గోదావరి నీటిని ఏవిధంగా వాడుకోవాలన్నదే మా ఆలోచన.

**-వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ**

### కృష్ణా బేసిన్‌లో 900 టీఎంసీల కొరత

కృష్ణాబేసిన్‌లో గత కొన్నేండ్లుగా వస్తున్న ఇన్‌ఫ్లోలను పరిశీలించి, నికరంగా 400 టీఎంసీల వరకు లభ్యత ఉంటున్నట్లు అంచనావేశారు. గత కొన్నేండ్లుగా ఎగువన కర్ణాటక ప్రాజెక్టులు నిండిన తర్వాత.. అందునా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో దిగువన శ్రీశైలం జలాశయానికి కృష్ణాజలాలు చేరుతున్నాయి. నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కనాకష్టంగా మారింది. దీంతో శ్రీశైలానికి వచ్చే జలాల్ని ఇరు రాష్ట్రాలు వినియోగించుకుంటూ.. లోటును భర్తీచేసేందుకు గోదావరిజలాల మళ్లింపు ప్రాజెక్టుల్ని చేపట్టాలనేదానిపై రెండువైపులా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. బేసిన్‌వ్యాప్తంగా రెండురాష్ట్రాల అవసరాలు 1300 టీఎంసీలు (తెలంగాణ-550 టీఎంసీలు, ఏపీ-750 టీఎంసీలు) కాగా.. లభ్యత 400 టీఎంసీలు ఉన్నట్టు లెక్కించారు. ఇవిపోను సుమారు 900 టీఎంసీలు లోటుగా అంచనావేశారు. గోదావరిజలాల తరలింపుతో లోటు భర్తీకి నిర్ణయించిన దరిమిలా తరలించే నీటిలో తెలంగాణ ప్రాజెక్టులకు 363 టీఎంసీలు, ఏపీ ప్రాజెక్టులకు 494 టీఎంసీలు అవసరమని తేల్చారు.

**తెలంగాణ ప్రాజెక్టులకు..:** పాలమూరు -రంగారెడ్డి :120 టీఎంసీలు, డిండి ఎత్తిపోతల :40 టీఎంసీలు, కల్వకుర్తి ఎత్తిపోతల :40 టీఎంసీలు, శ్రీశైలం ఎడమగట్టుకాల్వ :40 టీఎంసీలు, జూరాల పరిధిలోని ఆయకట్టుతోపాటు దానిపై ఆధారపడిన ప్రాజెక్టులు: 100 టీఎంసీలు, అమ్రాబాద్ ఎత్తిపోతల పథకం :15 టీఎంసీలు.

**ఏపీ ప్రాజెక్టులకు..:** ఇప్పటికే నిర్మించిన హంద్రీనీవా, గాలేరు నగరి, వెలిగొండ, తెలుగుగంగ, శ్రీశైలం కుడి గట్టు కాల్వ (ఎస్సార్బీసీ), కేసీ కెనాల్ ప్రాజెక్టులకు: 194 టీఎంసీలు.. భవిష్యత్తు నీటి అవసరాలు: 300 టీఎంసీలు.



## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

టీఆర్‌ఎస్ లోక్‌సభపక్ష నేత నామా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని టీఆర్‌ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అమలు చేస్తున్న అనేక పథకాలను స్వయంగా ప్రధానమంత్రి ప్రశంసించినా బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించలేదని తెలిపారు. మిషన్ భగీరథ పథకాన్ని మెచ్చుకున్నా కేటాయింపుల్లో మొండిచేయి చూపారని అసంతృప్తి వ్యక్తంచేశారు. దక్షిణ భారతదేశానికి చెందిన నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ఆమెకు నామా అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర బడ్జెట్‌పై తాను టీఆర్‌ఎస్ పార్టీ తరుపున మాట్లాడే అవకాశం కల్పించడంపై పార్లమెంట్ స్పీకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## తాండూరులో కంది బోర్డు ఏర్పాటుచేయాలి

కందిబోర్డును తెలంగాణ రాష్ట్రంలోని తాండూరులో ఏర్పాటుచేయాలని చేవెళ్ల టీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి కోరారు. ఆయన మంగళవారం పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. కందులు దేశవ్యాప్తంగా చాలా ముఖ్యమైన పంట అని, ఎక్కువ రాబడి ఉంటుందని తెలిపారు. తెలంగాణలో 2.25 లక్షల హెక్టార్లలో సాగవుతుందని పేర్కొన్నారు. ఇక్కడి కంది పంట ఎగుమతి చేయడానికి ఎక్కువ అవకాశం ఉందని, వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఇక్రిశాట్ సహకారంతో కంది పంటపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

### లోకం పోకడ



అటు వానల జోరుకు ముంబై, ఇటు రాజీనామాల హోరుకు కర్ణాటక ప్రభుత్వం అతలాకుతలం అవుతున్నాయి!

## ఆరోపణలు నిరూపించకపోతే రాజీనామా చేస్తావా?

- ఎంపీ కోమటిరెడ్డికి ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సవాల్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బాల్క సుమన్, వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ భూములు కబ్జాచేశానంటూ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాటిని నిరూపించేందుకు సిద్ధమా? అని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సవాల్ విసిరారు. ఆరోపణలు నిజమని నిరూపిస్తే తక్షణమే ఎమ్మెల్సీ పదవిని వదులుకుంటానని, నిరూపించకపోతే ఎంపీ పదవికి రాజీనామా చేస్తారా? అని నిలదీశారు. తప్పుడు ఆరోపణలపై క్షమాపణ చెప్పకపోతే పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. మంగళవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు బాల్కసుమన్, కేపీ వివేకానందతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సొంతూరిలో 600 గజాల్లో అన్ని అనుమతులతో ఇల్లు కట్టుకుంటే.. వేల ఎకరాల్లో ఇల్లు అని ఒక పత్రికలో వచ్చిన వార్త ఆధారంగా కోమటిరెడ్డి ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ వ్యవహారంలోకి కేటీఆర్‌ను లాగడం మంచిది కాదని చెప్పారు. 21 ఏండ్లకే ఉద్యమంలోకి వచ్చిన తాను ఏనాడూ డబ్బుపై ఆశపడలేదనిఅన్నారు. ఆత్మగౌరవంకోసం బతికానని, దానికోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని తెలిపారు. ఎమ్మెల్యే బాల్కసుమన్ మాట్లాడుతూ, ఒక పత్రికలో వచ్చిన వార్త ఆధారంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుపై ఎంపీ కోమటిరెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎంపీ కోమటిరెడ్డికి మతితప్పిందని, ఆయన పూటకోమాట మాట్లాడతారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఎద్దేవాచేశారు.

## బీజేపీని ప్రశ్నించే దమ్ములేదు

- ప్రజాసమస్యలు పట్టని కాంగ్రెస్ ఎంపీలు
- ఢిల్లీలో గల్లీ విషయాలు మాట్లాడుతున్నరు
- మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ విమర్శ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్‌పార్టీ ఎంపీలకు తెలంగాణ ప్రజల సమస్యలు పట్టడం లేదని.. ఢిల్లీకి వెళ్లినా గల్లీ ముచ్చట్లు మాట్లాడుతున్నారని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్‌రెడ్డిల మనసు ఒకపార్టీపై ఉన్నదని.. మనషులు మాత్రం మరోపార్టీలో కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పార్లమెంట్‌లో కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఓట్లువేసి గెలిపించిన ప్రజల సమస్యలను పక్కనపెట్టి.. పార్లమెంటులోనూ టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్ ఎంపీలకు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే దమ్ములేదని.. వారికి అసెంబ్లీకి, పార్లమెంటుకు తేడా తెలియడం లేదని ఎద్దేవాచేశారు. రాష్ట్రానికి రావాల్సిన అంశాలను చర్చించకుండా ఢిల్లీలో గల్లీ మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందో ముందుగా చెప్పాలని, ఆ తర్వాతే ప్రజల అభిమానం కోసం పరుగెత్తాలని అన్నారు. రాష్ట్రంలో మతసామరస్యాన్ని భంగం చేయాలని చూస్తే ప్రజలే గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ తెలంగాణతోపాటు, దేశవ్యాప్తంగా సంక్షోభంలో ఉన్నదని, దీంతో ఆ పార్టీ ఎంపీలు అయోమయంలో పడిపోయారని పేర్కొన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్ నాయకుడు క్యామమల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్య చిత్రంలో టీఆర్‌ఎస్ నేత క్యామమల్లేశ్ ఉన్నారు









## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం కన్నులపండువగా సాగింది. కల్యాణోత్సవంలో భాగంగా రెండోరోజు మంగళవారం ఉదయం ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పండుగలేవైనా గొప్పగా జరుగాలన్నదే టీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తలసాని అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లుచేసింది. కల్యాణోత్సవంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, బేతి సుభాష్‌రెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు తలసాని సాయికిరణ్‌యాదవ్, అమీర్‌పేట్ కార్పొరేటర్ శేషుకుమారి, దైవజ్ఞశర్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

– నమస్తే తెలంగాణ, హైదరాబాద్ సిటీబ్యూరో

## మోదీ సర్కార్‌పై ఎన్‌ఎఫ్‌ఐఆర్ ధ్వజం

- రైల్వే కర్మాగారాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన
- నేటినుంచి 13 వరకు దేశవ్యాప్తంగా ధర్నాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైల్వే కర్మాగారాలను, రైళ్ల నిర్వహణను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్‌ఎఫ్‌ఐఆర్) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. రైల్వే గురించి, కార్మికుల సమస్యల గురించి కేంద్ర బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించకపోవటాన్ని తప్పుపట్టింది. రైల్వే కర్మాగారాలు లాభసాటిగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటిని కార్పొరేషన్లుగా మార్చాలని చూస్తున్నదని ఎన్‌ఎఫ్‌ఐఆర్ జనరల్ సెక్రటరీ రాఘవయ్య విమర్శించారు. కేంద్ర ఉదాసీన వైఖరికి నిరసనగా జూలై 10 నుంచి 13 వరకు దేశవ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రైల్వే కర్మాగారాలు, జోనల్ హెడ్ క్వార్టర్ల వద్ద నిర్వహించే ఈ ధర్నాల్లో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని తమ గళాన్ని వినిపించాలని సూచించారు. రైల్వే కార్మికుల సమస్యలకు కేంద్రం పరిష్కారం చూపాలని రాఘవయ్య డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
నోటిఫికేషన్
ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీసెస్ (ICPS), తెలంగాణ రాష్ట్ర బాలల పరిరక్షణ విభాగం (SCPU) నందు పనిచేయుటకు ప్రోగ్రాం మేనేజర్ (Training, Advocacy & IEC), ప్రోగ్రాం మేనేజర్ (Adoption, Foster Care and Sponsorship), అకౌంటెంట్ మరియు ప్రోగ్రాం అసిస్టెంట్ (SARA) నియామకానికి సంబంధించి అర్హత కలిగిన ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు 17.07.2019 సాయంత్రం 5 గం.ల వరకు తీసుకోబడతాయి. వివరాల కోసం http://wcdsc.tg.nic.in / https://mis.tgwdcw.inను చూడగలరు.
DIPR RO.No.584 - DP/CL/Advt/1/2019-20 Dt: 09.07.2019 సం/- సంచాలకులు

తెలంగాణ ప్రభుత్వం
ఉన్నత విద్యా (UE) శాఖ
ప్రకటన
దిగువ తెలిపిన రాష్ట్ర విశ్వవిద్యాలయాల కోసం వైస్ చాన్సలర్ ఉద్యోగం కోసం తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు కోరుతోంది.
**క్ర.సం & విశ్వవిద్యాలయం పేరు :** 1) ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ 2) పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్ 3) డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ 4) జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, (JNTU), హైదరాబాద్ 5) కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ 6) మహాత్మా గాంధీ యూనివర్సిటీ, నల్గొండ 7) శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్ 8) తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్ 9) పాలమూరు యూనివర్సిటీ, మహబూబ్‌నగర్
అర్హతా ప్రమాణాలు మొ||వాటి సంబంధించిన వివరాల కోసం www.tsche.ac.in చూడండి. డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌తో పాటు నిర్దేశిత నమూనాలో బయోడేటా వివరాలతో దరఖాస్తును దిగువ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా **23-07-2019న లేదా ఆలోగా సా. 5.00 గం.వరకు** పంపవలెను.
ది సెక్రటరీ టు గవర్నమెంట్, ఉన్నత విద్యా (UE), శాఖ, రూమ్ నం. 117-A, D-బ్లాక్, గ్రౌండ్ ఫ్లోర్, తెలంగాణ సచివాలయం, హైదరాబాద్–500022. ఫోన్ నం. +91–40–23459287, టెలి/ ఫ్యాక్స్ నం. +91–40–23459297
తేది : 8-7-2019
ప్రదేశం : హైదరాబాద్
డా.బి. జనార్దన్ రెడ్డి, IAS
ప్రభుత్వ కార్యదర్శి
DIPR RO No. 576-DP/CL/Advt/1/2019-20, Dt: 09/07/2019

# ఒక్కరోజూ వృథాచేయకుండా ప్రాణహితను ఎత్తిపోయండి

- అన్నారం పంపుహౌస్ ఈఈ యాదగిరికి సీఎం ఫోన్
- క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్



**మంథని, నమస్తే తెలంగాణ:** ఒక్కరోజు, ఒక్క పూట కూడా వృథాచేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే ప్రాణహిత జలాలను ఎత్తిపోయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ నేరుగా క్షేత్రస్థాయిలోని అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో సమీక్షిస్తున్నారు. ఇందులోభాగంగా సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం అన్నారం పంపుహౌస్ ఈఈ ఎలకొండ యాదగిరితో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఈఈ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పటికిప్పుడు జలాలుపైకి అందకున్నా.. సుందిల్ల బరాజ్ వద్ద ఉన్న నీటిని అన్నారం పంపుహౌస్‌లోకి పంపి గేట్లు, కాంక్రీట్ టెస్టింగ్‌లు చేయాలని సీఎం చెప్పారు. కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా అన్నారంలోకి నీటి ఎత్తిపోతలు నడుస్తున్నాయని, ఆ నీరు అన్నారం పంపుహౌస్ చేరనున్న నేపథ్యంలో చిన్న చిన్న పనులను పూర్తిచేసుకొని ప్రతి బొట్టునూ తిరిగి సుందిల్ల బరాజ్‌లోకి పోసుకునేలా సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్‌లోకి గోదారి పరవళ్లు తొక్కుతున్నదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంథని మండలం అడవిసోమన్‌పల్లి మానేరు నది మూలమలుపు దాకా వచ్చిందని, మరి కొద్దిగంటల్లోనే అన్నారం పంపుహౌస్‌కు చేరుకోనున్న నేపథ్యంలో 2.3 కిలోమీటర్ల అప్రోచ్ చానల్ ద్వారా పంప్‌హౌస్‌లోకి నీటిని స్వీకరించేందుకు అన్ని పనులను పూర్తిచేయాలని సూచించారు. అన్నారం పంపుహౌస్‌లో బిగించిన 8 మోటర్లను వెట్‌రన్ ద్వారా ఒక్కొక్కటి ప్రారంభించుకోవాలన్నారు. ప్రతి నీటిచుక్కనూ ఒడిసి పట్టుకొని బరాజ్‌లోకి నింపుకొని ఎల్లంపల్లికి పంపడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రాణహిత నదికి 96,000 క్యూసెక్కుల వరద వస్తున్నదని వివరించారు. ఇప్పటికే అన్నారం బరాజ్‌లోకి భారీగా నీరు చేరుతున్నదని, 4.1టీఎంసీల నీరు వచ్చేప్పటికీ అన్నీ రెడీ చేసుకొని పంపింగ్‌కు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వానకాలం సీజన్లో కాళేశ్వరం ద్వారా రైతులకు చాలావరకు ఉపశమనం కలిగేలా అందరూ పనిచేయాలని సీఎం ఆదేశించినట్టు ఈఈ వెల్లడించారు.

# కాళేశ్వరంతో పండుగ

- కేసీఆర్ కృషితోనే ప్రాజెక్టు సక్సెస్
- ప్రాజెక్టు నిర్మాత, డైరెక్టర్ అన్నీ ముఖ్యమంత్రే: మంత్రి ఎర్రబెల్లి

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రారంభంతో పండుగ వాతావరణం నెలకొన్నదని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కృషే ప్రధానమని తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. తొలుత కన్నెపల్లి పంపుహౌస్‌కు చేరుకొన్న ఎర్రబెల్లి.. అక్కడ అప్రోచ్ కెనాల్, హెడ్‌రెగ్యులేటర్, ఫోర్‌బేను పరిశీలించారు. గోదావరిలో నీటి ప్రవాహం, కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటర్లు పని చేస్తున్న తీరు, గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌కు చేరుతున్న నీటివివరాలను కలెక్టర్ వెంకటేశ్వర్లు, సాగునీటిశాఖ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. పంపుహౌస్‌లోని మోటర్లు గోదావరి జలాలను గ్రావిటీ కెనాల్‌లో ఎత్తిపోస్తున్న డెలివరీ సిస్టర్న్‌ను సైతం సందర్శించారు. అక్కడ ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అని.. ప్రాజెక్టు రచన, డైరెక్షన్, నిర్మాత అన్నీ ఆయనేనని పేర్కొన్నారు. బాబ్లీ ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ ఎండిపోతుందని, తెలంగాణ ఎడారి అవుతుందని గతంలో ఆందోళన చేశానని, ఈరోజు కేసీఆర్ పుణ్యమా అని కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రివర్స్ పంపింగ్‌తో ఎస్సారెస్పీలో నీరు నింపే ఏర్పాట్లు జరగడం ఆనందంగా ఉన్నదన్నారు. తెలంగాణ ప్రజలకు తాగు, సాగునీరు ఇస్తున్న సీఎం కేసీఆర్ మహాత్ముడు అని మంత్రి ఎర్రబెల్లి అభివర్ణించారు. కాళేశ్వరంలో అసలు మోటర్లు నడవడం లేదంటున్న విపక్షాలు.. విమర్శలు మాని ఇక్కడకు వచ్చి మోటర్లు ఎత్తిపోస్తున్న గోదావరి జలాలను నెత్తిన చల్లుకొనిపోతే బాగుంటుందని హితవుపలికారు. తెలంగాణను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేంద్రం రూపాయి కూడా ఇవ్వలేదని, అక్కడి నుంచి కొంతైనా సాయంచేస్తే తెలంగాణకు మరింత ప్రయోజనం చేకూరేదని పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించారు. మంత్రివెంట ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, భూపాలపల్లి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్లు జక్కు శ్రీహర్షిణి రాకేశ్, పుట్ట మధుకర్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శోభ, మహదేవపూర్ ఎంపీపీ రాణిబాయి తదితరులు ఉన్నారు.



మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ కూడా ఉన్నారు.

J.B. INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY
(Sponsored by J.B. Educational Society)
(UGC Autonomous, Accredited by NAAC, Permanently Affiliated to JNTUH)
EAMCET Code JBIT
Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), R.R. District, Hyd - 075
Website: www.jbiet.edu.in, Ph:08413-235127, 235053 / 9989623333
ADMISSION NOTIFICATION
Applications are invited for B.Tech B-Category/ NRI Sponsored seats for the Academic Year 2019-20

| COURSE – B.Tech | CIVIL | CSE | ECE | ECM | EEE | INF | MECH | MINING |
|---|---|---|---|---|---|---|---|---|
| INTAKE | 120 | 120 | 120 | 60 | 120 | 60 | 120 | 30 |
| B-CATEGORY | 36 | 36 | 36 | 18 | 36 | 18 | 36 | 09 |

Applications are invited for admission into B.Tech courses under B-Category & NRI Sponsored seats for the Academic Year 2019-20 in the prescribed format available at website www.jbiet.edu.in. Cash/ Demand Draft for Rs.2000/- Drawn in favor of "Principal JBIET" Payable at Hyderabad towards Registration Fee (Non-Refundable) and Submit Xerox copies of relevant Certificates on or before 26-07-2019 at the College / City office. Admissions will be made as per the rules and regulations of Telangana State Government and JEE Main ranks.
Hostel Facility available at campus for both Boys & Girls
Buses from all parts of twin cities. Sd/- SECRETARY
City Office: 6-3-248/1/1/A, 4th Floor, Bhaskar Plaza, Road No.1, Banjara Hills, Hyderabad-34. Ph: 040-23391979 / 23371428 / 9246370069

# ఎదురేగిన గోదారమ్మ

మొదటిపేజీ తరువాయి...

అన్నారం బరాజ్‌కు చేరినట్లు సాగునీటిశాఖ ఇంజినీర్లు వెల్లడించారు. బుధవారంనాటికి బరాజ్‌లో నీటి నిల్వ ఒక టీఎంసీకి పెరుగుతుందని ప్రాజెక్టు ఈఈ యాదగిరి చెప్పారు. ఇదిలాఉంటే.. ఈ పంప్‌హౌస్‌లోని నాలుగో నంబర్ మోటర్‌ను మంగళవారం మధ్యాహ్నం ఆరు నిమిషాలపాటు వెట్‌రన్ చేశారు. ఈ మోటర్‌కు కొన్ని పరీక్షలు చేయాల్సి ఉన్నందున వాటిని పూర్తిచేసి ఏ సమయంలోనైనా నిరంతరాయంగా మోటర్‌ను నడిపించే పనిలో ఇంజినీర్లు ఉన్నారు. ఈ నెల 15లోపు అన్ని మోటర్ల వెట్‌రన్ ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో మరో అపురూప దృశ్యం కొన్నిరోజుల్లోనే సాక్షాత్కరించనున్నది.

**కన్నెపల్లి వద్ద 25వేల క్యూసెక్కుల ప్రవాహం**

మంగళవారం గోదావరి నదిలో కన్నెపల్లి పంపుహౌస్ వద్ద 25వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మేడిగడ్డ బరాజ్‌లో తాజాగా మరో పదకొండు గేట్లు మూసివేశారు. వీటితో కలిపి ఇప్పటివరకు మూసివేసిన గేట్ల సంఖ్య 51కి చేరింది. మధ్యలో మిగిలి ఉన్న 34 గేట్లను నదిలో నీటి ప్రవాహాన్నిబట్టి మూసివేస్తామని మేడిగడ్డ బరాజ్ ఈఈ వెంకటరమణారెడ్డి తెలిపారు. మేడిగడ్డ బరాజ్‌నుంచి పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి రిజర్వాయర్ దాకా గోదావరి దాదాపు 104 కిలోమీటర్లు ఉంటుంది. ప్రస్తుతం కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తున్న క్రమంలో ఆ నీరు 35 కిలోమీటర్ల మేర నీరు ఎగువకు ఎగబాకి, అన్నారం బరాజ్‌కు చేరుతున్నది. అన్నారం బరాజ్ నిండి, అక్కడినుంచి నీరు 13 కిలోమీటర్లు ప్రవహించి అన్నారం పంప్‌హౌస్ వైపు వస్తుంది. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని ఆరెంద, మల్లారం గోదావరి తీరాలకు చేరుకోగా, ఇంకా 20 కిలోమీటర్లు ఎగువకు ఎగబాకితే అన్నారం పంప్‌హౌస్‌కు చేరుకోనున్నది.

**నేరుగా పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్**

కన్నెపల్లి పంపుహౌస్, ఇక్కడి డెలివరీ సిస్టర్న్, మేడిగడ్డ బరాజ్ వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను సాగునీటిశాఖ ఇంజినీర్లు హైదరాబాద్‌లోని ప్రగతిభవన్, జలసౌధకు అనుసంధానం చేశారు. సీఎం కేసీఆర్ ప్రగతిభవన్ నుంచి సీసీ కెమెరాల సాయంతో కొన్నిరోజులుగా గోదావరిలో నీటి ప్రవాహాన్ని, కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటర్లకు జరుగుతున్న పరీక్షలు, వెట్‌రన్, పంపింగ్, డెలివరీ సిస్టర్న్ వద్ద గ్రావిటీ కెనాల్‌లోకి పడుతున్న గోదావరి జలాలు.. అవి అన్నారం బరాజ్‌కు ప్రవహిస్తున్న తీరు, మేడిగడ్డ బరాజ్ గేట్ల మూసివేత తదితరాలను స్వయంగా పరిశీలిస్తూ సాగునీటిశాఖ ఇంజినీర్లకు సూచనలు చేస్తున్నారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రివర్స్ పంపింగ్‌తో అన్నారం బరాజ్‌కు చేరిన నీటి వివరాలను మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ బరాజ్ ఈఈ యాదగిరితో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. గోదావరిలో నీటి ప్రవాహం, పంపింగ్ సమాచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి తెలియజేస్తున్నారు.



అన్నారం బరాజ్ వద్ద గోదావరి నీరు



కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి చేరుతున్న వరద నీరు

## తుంగభద్ర డ్యాంకు స్వల్ప ఇన్‌ఫ్లో

- తుంగ నది నుంచి 20,366 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- పూర్తిస్థాయి నీటిమట్టానికి తుంగ డ్యాం
- దిగువకు 194 క్యూసెక్కుల విడుదల
- తుంగభద్రలో 3.056 టీఎంసీల నీటినిల్వ

**అయిజ:** తుంగభద్ర జలాశయానికి వరద రాక మొదలైంది. కర్ణాటక ఎగువన కురుస్తున్న వానలతో తుంగ నది నుంచి తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో స్వల్పంగా వస్తున్నది. తుంగ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువన ఉన్న తుంగభద్ర జలాశయానికి విడుదల చేస్తున్నారు. మంగళవారం తుంగ నది నుంచి 20,366 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. సోమవారం నాటికి తుంగభద్ర జలాశయంలో 1.786 టీఎంసీలు ఉండగా, మంగళవారం సాయంత్రానికి 3.056 టీఎంసీలకు చేరుకున్నది. టీబీ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 100.855 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.056 టీఎంసీలకు చేరుకున్నట్లు డ్యామ్ సెక్షన్ అధికారి విశ్వనాథ తెలిపారు. ఎగువన వానలు ఇలాగే కురిస్తే తుంగభద్ర జలాశయానికి వరద నీరు వచ్చి చేరే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.

## సుందిల్ల బరాజ్‌లో 0.6 టీఎంసీలు

**మంథని, నమస్తే తెలంగాణ:** ఇటీవల కురుస్తున్న వర్షాలతో పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం వద్ద నిర్మించిన సుందిల్ల బరాజ్‌లో 0.6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 74 గేట్లు, 8.83 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ బరాజ్‌కు తొలిసారిగా 0.6 టీఎంసీల వరద వచ్చింది. బరాజ్ గేట్లను మూసి ఆ నీటిని నిల్వ ఉంచారు. ఆ నీటిని ఫోర్‌బే ద్వారా అన్నారం పంప్‌హౌస్‌లోకి పంపి గేట్లు, కాంక్రీట్ టెస్టింగ్‌కు కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లుచేస్తున్నారు.



నీటితో కళకళ లాడుతున్న మంథని మండలం సిరిపురంలోని సుందిల్ల బరాజ్

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(Ministry of MSME - A Government of India Society)
Balanagar, Hyderabad-500 037 (TS) INDIA.
Walk - in - Interview
Applications are invited for the following post; which is purely on consolidated payment and on contractual basis, which will be renewed yearly on performance review and need of the institute.
1. Faculty for Mechatronics (Date of Interview- 13/07/2019)
Essential Qualification: - B.E./B.Tech/M.E/M.Tech/PG in Electronics / Electrical /Mechatronics or equivalent.
Desirable Experience:- Should have expertise in imparting technical training in the field of Pneumatics, Hydraulics, PLC, Microcontroller, Electronics & Electrical Engineering subjects (both theory & practical) for at least 01 year.
Candidates with qualification of Mater Certificate Course in Mechatronics after engineering can also be considered for.
Candidates fulfilling the eligibility criteria may step-in for walk-in interview (10:00 a.m. - 12:00 p.m. registration time) with one passport size photo, original documents & one set self-attested photocopies of all certificates.
N.B.:- No applicants will be entertained after 12:00 p.m.
Contact Details Telephone No.-040-2377 1959, 9502405170, E-Mail-adminitrg@citdindia.org
Sd/-
PRINCIPAL DIRECTOR
ISO 9001 : 2015, ISO 29990:2010, ISO 14001:2004, ISO 50001:2011 Certified Institution

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(Ministry of MSME - A Government of India Society)
Balanagar, Hyderabad-500 037 (TS) INDIA.
Admission to PGDTD & CC and PDTD Courses - 2019

| S. No. | Course | Duration | Intake | Eligibility |
|---|---|---|---|---|
| 1 | Post Graduate Diploma in Tool Design & CAD/CAM (PGDTD & CC) | 1½ years (3 Semester) | 60 | B. E. /B. Tech in Mechanical Engineering/Production Engineering or Equivalent) |
| 2 | Post Diploma in Tool Design (PDTD) | 1 year (2 Semester) | 60 | Diploma in Mechanical Engineering, Tool,Die and Mould Making or Equivalent |

MODE OF APPLICATION
Detailed Notification, Application Form & Prospectus can be downloaded from our website www.citdindia.org under the link "PGDTD & CC and PDTD Admission Notification-2019" and the filled in application form can be sent to The Director (Trg.), CITD, Balanagar, Hyderabad-500 037, along with prescribed application cost.
IMPORTANT DATES
- Availability of applications : 08-07-2019 (Monday)
- Last date for receipt of filled-in application : 14-08-2019 (Wednesday)
- Date of Entrance exam (Tentative) : 18-08-2019 (Sunday)

Contact Details : Admission Desk at Room No. 102, Diploma Block, Phone No.- 9502405170, 040-2377 1959, E-Mail-adminitrg@citdindia.org.
Sd/-
PRINCIPAL DIRECTOR
ISO 9001 : 2015, ISO 29990:2010, ISO 14001:2004, ISO 50001:2011 Certified Institution



నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



## కుటుంబాల మధ్య రెవెన్యూ చిచ్చు

- ఎనిమిది వాటాల భూమి ఇద్దరికే పట్టాచేశారు
- తప్పు జరిగిందంటూ ఆర్డీవోకు తాసిల్దార్ నివేదిక
- సరిచేయకుండా ఏడాదిన్నరకాలంగా తాత్సారం
- నేనే రాశా.. ఏం చేసుకుంటారంటూ ఓ అధికారి బెదిరింపు
- న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితులు

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కాచిరెడ్డిపల్లిలో సర్వే నంబర్ 37లో 4.07ఎకరలు, 56లో 7.02, 65లో 2.06, 68లో 2.06, 69లో 3.30, 73లో 5.10, 75లో 2.00, 76లో 10.02, 170లో 0.32, 171లో 0.19 ఎకరాలు కలిపి మొత్తం 37.34 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని 15 కుటుంబాలకు చెందినవారు చాలా ఏండ్ల క్రితమే ఎనిమిదివాటాలుగా చేసి పంచుకొన్నారు. ఎవరి భూముల్లో వారు హద్దులు ఖరారు చేసుకొని వారసత్వంగా వస్తున్న భూమిపైనే ఆధారపడి బతుకుతున్నారు. 2018లో డిజిటల్ పాస్‌పుస్తకాలు ఇవ్వకముందు ఎవరి వాటాలు వారికి ఉండేవి. వీరిలో కొందరికి పాస్‌పుస్తకాలు లేకపోయినా పహాణీలో, మోఖాపై ఉన్నారు. అయితే కొత్తగా జారీచేసిన పాస్‌పుస్తకాల్లో మాత్రం వీరిలో రెండు కుంటుబాలకే అదనంగా భూమి రాసి కలిసిమెలిసి ఉంటున్న వీరి మధ్య రెవెన్యూ అధికారులు చిచ్చుపెట్టారు.

**పూర్వపు వాటాల ప్రకారం ఇలా**

డిజిటల్ పాస్‌పుస్తకాలు అందించకముందు అన్ని సర్వే నంబర్లలో కలిపి మొదటి వాటా కింద జోగు లక్ష్మికి 3.07 ఎకరాలు, జోగు మధురమ్మకు 3.07 ఎకరాలు, రెండోవాటా కింద జోగు నర్సయ్యకు 3.07 ఎకరాలు, జోగు లచ్చయ్యకు 3.07 ఎకరాలు, మూడో వాటా కింద జోగు చిన్నదుర్గయ్య, జోగు దుర్గమ్మ, జోగు నర్సమ్మకు కలిపి 4.08 ఎకరాలు, నాలుగోవాటా కింద ఆత్మకూరు భూదమ్మ, జోగు రవికి 4.08 ఎకరాలు, ఐదోవాటా కింద జోగు పోలు, జోగు ముత్తయ్యకు 4.08 ఎకరాలు, ఆరోవాటా కింద జోగు స్వామి, జోగు మిషనయ్యకు 4.08 ఎకరాలు, ఏడో వాటా కింద జోగు జలపతి, జోగు పద్మయ్యకు 4.08 ఎకరాలు, ఎనిమిదోవాటా కింద జోగు లస్మయ్య, జోగు మల్లమ్మకు 4.08 ఎకరాల భూమి ఉండాలి. వీరిలో జోగు లక్ష్మి భర్త రామయ్యకు 3.07 ఎకరాలకు, జోగు నర్సమ్మ భర్త జోగు నర్సయ్యకు 3.07 ఎకరాలకు, జోగు చిన్న దుర్గయ్యకు 1.16 ఎకరాలకు, జోగు దుర్గమ్మకు 1.16, జోగు నర్సమ్మ భర్త దుర్గయ్యకు 1.16 ఎకరాలకు అలాగే ఆత్మకూరు భూదమ్మకు 2.04 ఎకరాలకు, జోగు రవికి 2.04 ఎకరాలకు, జోగు స్వామికి 2.04 ఎకరాలకు, జోగు మిషనయ్యకు 2.04 ఎకరాలకు, జోగు జలపతికి 2.04 ఎకరాలకు, జోగు పద్మయ్యకు 2.04 ఎకరాలకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయి. మిగతా వారికి పాస్‌పుస్తకాలు లేకున్నా పహాణీలో ఉండి మోఖాపై సాగు చేసుకొంటున్నారు.

**ఆ ఇద్దరి వాటాలు ఎక్కువ రాశారు**

ఎనిమిది వాటాల్లో 15 కుటుంబాలకు ఎవరి వాటాల ప్రకారం వారికి భూమిని నమోదు చేసి డిజిటల్ పాస్‌పుస్తకాలు ఇవ్వాల్సిన అధికారులు రెండు కుటుంబాలకు అధికంగా భూమి రాశారు. జోగు రామయ్య మరణించడంతో ఆయన వాటా భార్య లక్ష్మి పేరిట అన్ని సర్వేనంబర్లలో కలిపి 3.07 ఎకరాలు మాత్రమే ఉండగా 5.07 ఎకరాలు పట్టాచేసిన అధికారులు.. వారి కుమారులైన జోగు దేవదాసు పేరిట 1.15, జోగు దయాకర్ పేరిట 4, జోగు లక్ష్మీరాజం పేరిట మరో 4.04 ఎకరాల భూమిని రాశారు. ఈ కుటుంబానికి రావాల్సిన వాటా అన్ని సర్వే నంబర్లలో కలిపి 3.07 ఎకరాలు మాత్రమే. కానీ 14.26 ఎకరాలకు పాస్‌పుస్తకాలు ఇచ్చారు. ఈ కుటుంబం వాటాపోను 11.19 ఎకరాల భూమిని అదనంగా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. గతంలో తమ వాటాల్లో జోగు రామయ్య కుమారులకు ఎలాంటి భాగాలు లేవని, తమలో నుంచి ఎవరి వాటాలు కూడా వాళ్లు కొనుగోలు చేయలేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఇదే వాటాలో ఉన్న జోగు మధురమ్మకు కూడా 3.07 ఎకరాలు మాత్రమే ఉండగా.. ఆమె పేరిట అన్ని సర్వే నంబర్లలో కలిపి 4.24 ఎకరాలు రాశారు. జోగు మల్లమ్మకు అన్ని సర్వే నంబర్లలో 2.04 ఎకరాలు మాత్రమే వాటా ఉండగా ఆమె పేరిట 2.15 ఎకరాలు నమోదు చేశారు.

### ఆర్డీవోకు నివేదించిన తాసిల్దార్

బాధిత రైతుల ఫిర్యాదుతో ఈ విషయమై గిర్దావర్‌తో విచారణ జరిపించిన గంగాధర తాసిల్దార్ 2018 అక్టోబర్ 1న కరీంనగర్ ఆర్డీవోకు నివేదిక ఇచ్చారు. ఇందులో జోగు రామయ్య, జోగు నర్సయ్య కుటుంబాలకు వారివాటాల కంటే అధిక మొత్తంలో భూమి నమోదయిందని స్పష్టంగా తెలిపారు. ఇన్‌లీగల్‌గా పహాణీకి వచ్చారనే వాఖ్యాన్ని కూడా జోడించారు. కానీ, పాస్‌పుస్తకాలను సరిచేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓ అధికారి ఉద్దేశపూర్వకంగా కావాలనేరాసి తమ కుటుంబాల మధ్య చిచ్చుపెట్టారని బాధిత రైతులు వాపోతున్నారు. 'నేను కావాలనే రాశాను.. ఏమి చేసుకుంటారో చేసుకోండి' అని సదరు అధికారి తమను బెదిరించారని ఇదివరకే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా తమకు ఎలాంటి న్యాయం జరుగలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

- టవరెక్కిన నల్లగొండ జిల్లా చందంపేట యువరైతు
- అక్రమంగా 150 ఎకరాలు పట్టాచేశారని ఆరోపణ
- ఆర్టీఐకి దరఖాస్తు చేసినా స్పందించకపోవడంతో టవరెక్కి నిరసన



చందంపేటలోని తాసిల్ కార్యాలయం వద్ద సెల్‌టవర్ ఎక్కిన రైతు శ్రీధర్

**చందంపేట:** ప్రభుత్వ భూమిని అక్రమంగా కొంతమంది వ్యక్తులకు పట్టాచేశారంటూ ఆవేదనకు గురైన ఓ యువ రైతు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. నల్లగొండ జిల్లా చందంపేట సమీపంలో ఉన్న అచ్చంపేట పట్టిలో సర్వే నంబర్ 50లో సుమారు 350 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో సుమారు 200 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ ప్రభుత్వ భూమిలో సుమారు 150 ఎకరాలను గ్రామానికి చెందిన కొంతమందికి రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టా చేశారంటూ గ్రామానికి చెందిన యువ రైతు గుడ్డేటి శ్రీధర్ ఆరోపిస్తున్నారు. మూడునెలల కింద చందంపేట తాసిల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద ఈ భూముల వివరాలు కావాలని శ్రీధర్ దరఖాస్తు చేశారు. అప్పటినుంచి శ్రీధర్ నిత్యం తాసిల్ కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. కానీ అధికారులు సమాచారం ఇవ్వకుండా రేపు మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొందరు పోలీసులతో కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదనకు గురైన శ్రీధర్ మంగళవారం తాసిల్ సమీపంలోని సెల్‌టవర్ ఎక్కారు. తాను న్యాయం కోసం పోరాడుతుంటే తనపై కుట్రతో పోలీసులకు సమాచారం ఇచ్చి మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గ్రామానికి చెందిన కొంతమంది రైతులు శ్రీధర్‌కు మద్దతుగా సెల్‌టవర్ వద్ద ధర్నాకు దిగారు. అక్రమ పట్టాలను తొలగించాలని డిమాండ్‌చేశారు. సమస్యను పరిష్కరిస్తామని సెల్‌టవర్ ఎక్కిన రైతు శ్రీధర్‌కు ఎంపీపీ నున్సావత్ పార్వతి సర్దిచెప్పారు. అక్రమ పట్టాలు పొందిన వివరాలు తాసిల్ కార్యాలయంలో సేకరించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ధర్నాను విరమించారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు ఇచ్చిన సమాచార హక్కు దరఖాస్తును పరిశీలించి వివరాలు ఇస్తామని చెప్పడంతో శ్రీధర్ సెల్‌టవర్ దిగారు.

### అక్రమ పట్టాలను పరిశీలించి రద్దుచేస్తాం

అచ్చంపేట పట్టిలో సర్వే నంబర్ 50లో అక్రమ పట్టాలు ఉంటే పరిశీలించి వాటిని రద్దుచేస్తాం. గతంలో పనిచేసిన అధికారుల వల్ల తప్పిదాలు జరిగి ఉండొచ్చు. ఈ విషయం ఇటీవలే నా దృష్టికి వచ్చింది. సర్వే నంబర్‌లో ఉన్న రైతుల భూములను పరిశీలించి పట్టాలుచేసిన వారిపై చర్యలు తీసుకొంటాం.

- రవీంద్రరాజు, చందంపేట తాసిల్దార్

## నా భూరికార్డులను సరిదిద్దండి

- యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు తాసిల్ ఎదుట రైతు ధర్నా
- రూ.50 వేలు అడిగిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**మోత్కూరు:** తన వారసత్వ భూమిని రికార్డుల నుంచి తొలగించి మరొకరి పేరిట రికార్డుల్లో నమోదుచేశారని, సరిచేయాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా కాలయాపనచేస్తున్నారని ఆరోపిస్తూ ఓ రైతు మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు తాసిల్ ఎదుట బైఠాయించారు. మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన రైతు కంచర్ల చంద్రారెడ్డికి సర్వే నంబర్ 373లో 1.01 ఎకరాలు, 373/అ లో 1.01 ఎకరాల భూమి ఉన్నది. చంద్రారెడ్డి పోలీస్‌శాఖలో పని చేసి పదవీ విరమణపొందారు.



మోత్కూరు తాసిల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతు కంచర్ల చంద్రారెడ్డి తదితరులు

గ్రామంలో తనకున్న భూమిని కొడుకు జంగారెడ్డితోపాటు ఆయన పేరిట జాయింట్‌గా పట్టా మార్పిడి చేయించుకొన్నారు. అయితే ఈ భూమిలో 1.28 ఎకరాలను అప్పట్లో వీఆర్వో చాంద్ పాషా.. కొలను మమత, కొలను భీమ్‌రాజ్ పేరిట రికార్డుల్లో తప్పుగా నమోదుచేశారు. తన అవసరం కోసం 10 మే 2018న మోత్కూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీ తీసుకోగా విషయం బయటపడింది. దీనిపై వీఆర్వో చాంద్ పాషాను కలిసి రికార్డులను సరిచేయాలని కోరగా, రూ. 50 వేలు అడిగాడని బాధితుడు వాపోయారు. లంచం ఇవ్వక పోవడంతో తప్పును సరిదిద్దలేదని తెలిపారు. రికార్డులను సరిచేయాలని ఏడాదిగా జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కలేదన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో సరిచేస్తామని అప్పటి తాసిల్దార్ హామీ ఇచ్చి పనిచేయలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రికార్డులు తారుమారై, కొత్త పాస్‌పుస్తకం అందక పెట్టుబడి సాయం పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయంచేసి, వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## మద్దిరాల వీఆర్వో సస్పెన్షన్

ఉత్తర్వులు జారీచేసిన సూర్యాపేట కలెక్టర్ అమయ్‌కుమార్

**మద్దిరాల:** సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రం వీఆర్వో నిమ్మా కర్ణాకర్‌ను సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ అమయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు తాసిల్దార్ రాంప్రసాద్ తెలిపారు. మద్దిరాలకు చెందిన ఓ రైతు భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వడానికి లంచం అడిగినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తి విచారణచేసిన అనంతరం కలెక్టర్.. వీఆర్వోను సస్పెండ్ చేసినట్టు చెప్పారు.

## వీఆర్వో నిర్లక్ష్యం.. రైతుకు శాపం

- సొంత భూమిని మరొకరికి పట్టాచేసిన అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన ఖమ్మం జిల్లా రైతు

**చింతకాని:** వీఆర్వో నిర్లక్ష్యం ఓ వృద్ధరైతుకు శాపంగా మారింది. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చినప్పటికీ.. భూమి చూపించడం లేదు. 50 ఏండ్లు సాగుచేసుకున్న భూమిని వీఆర్వో ఇతరులకు కేటాయించడంతో బాధితుడు ధర్మగంటను ఆశ్రయించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన కురుకుంట్ల చినసైదారెడ్డికి ఇదే మండలంలోని పందిళ్లపల్లి రెవెన్యూ గ్రామంలోని 65వ సర్వే నంబర్‌లో ఐదెకరాల భూమి వారసత్వంగా వచ్చింది. ఈ భూమిని సైదారెడ్డి 50 ఏండ్లుగా సాగుచేసుకొంటున్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా వీఆర్వో రైతు చినసైదారెడ్డికి 64/బీ సర్వే నంబర్‌తో పాస్‌బుక్ అందించారు. కానీ వాస్తవానికి 64/బీ సర్వే నంబర్‌లో ఎటువంటి భూమి లేదు. సైదారెడ్డి సాగుచేస్తున్న భూమి 65వ సర్వే నంబర్‌లో ఉండగా.. ఆ భూమిని వేరే రైతులకు పట్టాచేశారు. దీంతో సదరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆ భూమికి తామే యజమానులమంటూ ఇంజంక్షన్ ఆర్డర్ తెచ్చుకొని భూమిని సాగుచేసుకొంటున్నారు. దీంతో సైదారెడ్డి తనకు న్యాయం చేయాలంటూ తాసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగి చివరకు ధర్మగంటను ఆశ్రయించారు. పందిళ్లపల్లి రెవెన్యూ గ్రామంలోని భూములకు సంబంధించి గతంలోనూ వీఆర్వో అవకతవకలకు పాల్పడటంతో అతడిని ఉన్నతాధికారులు సస్పెండ్‌చేశారు.



పాస్‌పుస్తకం ప్రతిని చూపుతున్న కురుకుంట్ల చినసైదారెడ్డి

### త్వరలో సమస్యను పరిష్కరిస్తాం

చినసైదారెడ్డి పొలం సమస్య నా దృష్టికి వచ్చింది. గతంలో పనిచేసిన తాసిల్దార్ శ్రీనివాస్‌రావు వీఆర్వోల బృందంతో కలిసి భూమిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందచేశారు. నివేదిక కాపీ ప్రస్తుతం ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నది. త్వరలో బాధిత రైతుకు న్యాయం జరిగేలా చూస్తాం.



- కే సత్యనారాయణ, తాసిల్దార్, చింతకాని

## నాలుగేండ్లయినా విరాసత్ చేస్తలేరు

- కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినా పనికాలే
- ములుగు జిల్లా మంగపేట మండలం కొత్తమల్లూరువాసి జానకమ్మ ఆవేదన

**మంగపేట (ములుగు):** విరాసత్ కోసం నాలుగేండ్లుగా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ములుగు జిల్లా మంగపేట మండలంలోని కొత్తమల్లూరుకు చెందిన బాధితురాలు గుండారపు జానకమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. జానకమ్మ భర్త సోమరాజు ఐదేండ్ల కిందట మృతిచెందారు. కాగా సోమరాజు పేరిట మల్లూరు రెవెన్యూ శివారులో సర్వే నంబర్లు 348/760/బీ/1లో 1.01 ఎకరాలు, 348/758/బీలో 4 గుంటల భూమి ఉన్నది. మొత్తం 1.05 ఎకరాలను తన పేరిట విరాసత్ చేయాలని బాధితురాలు జానకమ్మ నాలుగేండ్లుగా మంగపేట తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులను కలిసినా పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోయారు. ఈ విషయంపై ఇటీవల గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు కూడా విన్నవించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. జానకమ్మ పేరిట పొలం బదిలీ కాక పోవడంతో రైతుబంధు సాయాన్ని కూడా కోల్పోయారు. తన దయనీయ స్థితిని అర్థం చేసుకొని విరాసత్ కింద తనకు పట్టాదారు పాస్‌పుస్తకం జారీచేయాలని బాధితురాలు విజ్ఞప్తి చేస్తున్నారు.



తన భర్త పేర ఉన్న 1-బీ ప్రతిని చూపుతున్న జానకమ్మ

## భూహక్కు కోసం ఆత్మహత్యాయత్నం

- కూసుమంచి తాసిల్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొన్న అక్కాచెల్లెళ్లు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



కూసుమంచి తాసిల్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొన్నవారిని వారిస్తున్న ఎస్సై

**కూసుమంచి:** వారసత్వ భూమికి హక్కులు కల్పించకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, కేశవాపురం గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు మంగళవారం తాసిల్ కార్యాలయం ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నంచేశారు. సమాచారం అందుకున్న ఎస్సై అశోక్‌రెడ్డి వెంటనే అక్కడికి చేరుకొని, అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పి, వారిని అక్కడి నుంచి పంపించారు. తాసిల్ రికార్డుల ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. కేశవాపురం గ్రామానికి చెందిన వడ్డింపుల శేషయ్యకు జీళ్లచెరువు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 450/10/1 లో 1.17 ఎకరాల భూమి ఉన్నది. శేషయ్యకు ఇద్దరు భార్యలు. ఈ భూమిని మొదటి భార్య కుమార్తె అయిన కుమ్మరికుంట్ల పద్మకు 1995లో పసుపు కుంకుమల కింద ఇచ్చారు. అనంతరం శేషయ్య మృతిచెందిన తర్వాత ఇందులో ఎకరం కుమ్మరికుంట్ల పద్మ పేరిట పట్టా కాగా, మిగిలిన 17 గుంటలు శేషయ్య రెండో భార్య వడ్డింపుల వీరమ్మ అనుభవదారుగా నమోదయ్యారు. 2018లో ధరణి వెబ్‌సైట్ వచ్చాక అధికారులు వడ్డింపుల వీరమ్మకు 1.17 ఎకరాలకు పట్టాదారు పాస్‌పుస్తకం, కుమ్మరికుంట్ల పద్మకు ఎకరం భూమికి పాస్‌పుస్తకం ఇచ్చారు. వాస్తవంగా వీరమ్మకు 17 గుంటలు మాత్రమే ఉండాల్సి ఉండగా, రెవెన్యూ అధికారులు అక్రమంగా 1.17 ఎకరాలకు పాస్‌పుస్తకం ఇచ్చారని పద్మ కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. వీరమ్మ కుమార్తెలు శారద, బేబీ ఈ భూమిపై పూర్తి హక్కులు తమవేనని, ఆ మేరకు గతంలో ఒప్పందం కుదిరిందని చెప్తున్నారు. పద్మకు హక్కులేనందునే పూర్తి భూమి 1.17 ఎకరాలు తమ తల్లిపేరిట పాస్‌పుస్తకం వచ్చిందని, పద్మ పేరిట ఉన్న పాస్‌పుస్తకాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ వారు మంగళవారం తాసిల్ కార్యాలయం ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకుయత్నించారు. అక్కడే ఉన్న పలువురు రైతులు, పోలీసులు అడ్డుకొన్నారు. అధికారులు తమ సమస్య పరిష్కరించకుండా తిప్పించుకొంటున్నారని వారు ఆరోపించారు. అంతకుముందు వారు తాసిల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. పోలీసుల జోక్యంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ జే స్వర్ణ మాట్లాడుతూ.. గతంలో పనిచేసిన అధికారులు ఒకే భూమికి బైనంబర్లు వేసి ఇద్దరికి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేశారని తెలిపారు. ఇందులో ఒకరిది రద్దు చేసి, మరొకరికి అప్పగించడం తమ పరిధిలోని పనికాదని చెప్పారు. రికార్డులన్నింటినీ పరిశీలించి, దీనిపై ఆర్డీవో కోర్టులో కేసు వేసుకోవాలని గతంలో వారికి చెప్పామన్నారు. అయినా వారు వినకుండా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని వివరించారు.

## అమ్మినవారికే మళ్లీ పట్టా

- కొన్నవారు కాస్తులో ఉన్నా పట్టించుకోని అధికారులు
- 60 ఏండ్ల కింద కొనుగోలుచేసిన 4.31 ఎకరాల్లో 3.10 ఎకరాలు మాయం
- ధర్మగంటను ఆశ్రయించిన యాదాద్రి భువనగిరి జిల్లా నిమ్మతోట రైతు

ఆరు దశాబ్దాల కింద పాలివాళ్ల వద్ద కొన్న భూమికి రెవెన్యూ అధికారుల పుణ్యమాని రెక్కలొచ్చాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన సమయంలో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. కొనుగోలుచేసి 4.31 ఎకరాల భూమిలో నేటికీ కొన్నవారే కాస్తులో ఉన్నా, అధికారులు చేసిన తప్పులతో ఆ భూమి అకస్మాత్తుగా అమ్మినవారి వారసుల పేరిట పట్టాగా మారింది. దీంతో బాధితులు ఆ భూమి కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నిసార్లు అధికారులను కలిసినా ఫలితం లేకపోవడంతో బాధిత రైతు చివరికి ధర్మగంటను ఆశ్రయించారు.



మోటకొండూర్ మండలం నిమ్మతోటలో తాము కాస్తులో ఉన్న భూమిని చూపుతున్న గూడూరు జంగారెడ్డి కుటుంబసభ్యులు. (ఇన్‌సెట్‌లో) జంగారెడ్డి కొత్త పాస్‌బుక్‌లో ఎక్కిన 1.21 ఎకరాలు

**యాదగిరిగుట్ట, నమస్తే తెలంగాణ:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని అమ్మనబోలు రెవెన్యూ గ్రామం నిమ్మతోటకు చెందిన గూడూరు రామిరెడ్డి సోదరుడైన గూడూరు సత్తిరెడ్డి వద్ద సర్వే నంబర్లు 333/ఈ, 337/ఈ, 345/ఈలో ఉన్న 4.31 ఎకరాల భూమిని 60 ఏండ్ల కింద కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. నాటి నుంచి కాస్తులో రామిరెడ్డి అతని కొడుకు సాయిరెడ్డి, సాయిరెడ్డి కొడుకు జంగారెడ్డి ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో 2015లో డాక్యుమెంట్ నంబర్ 12965/15 ద్వారా తన తాత పేరిట ఉన్న ఈ భూమిని గూడూరు జంగారెడ్డి తన పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. మరుసటి రోజు నాటి ఆలేరు తాసిల్దార్‌కు గ్రామ రికార్డుల్లో అమలు పరుచాలని దరఖాస్తు చేసుకొన్నారు. ఆ దరఖాస్తు ఆధారంగా తాసిల్దార్ రామమూర్తి ఈ భూమిని గూడూరు జంగారెడ్డి పేరిట పట్టా మార్పుచేశారు. 2015 నుంచి 16.04.2018 వరకు 1-బీ నమూనాలో కూడా గూడూరు జంగారెడ్డి పేరిటే ఈ 4.31 ఎకరాల భూమి ఉన్నది. నాటి ఆలేరు రెవెన్యూ అధికారులు జంగారెడ్డి పేరిట పట్టాదారు పాస్‌పుస్తకం సైతం ఇచ్చారు. అనంతరం భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా పంపిణీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకంలో 1.21 ఎకరాలు మాత్రమే ఉన్నదని, 3.10 ఎకరాల భూమిని ఎక్కించలేదు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే.. ఆ భూమిపై తమకు హక్కులేదని వారిస్తున్నారని బాధిత రైతు తెలిపారు. ఎన్నిసార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోగా, న్యాయపరంగా తమకు దక్కాల్సిన భూమిని 60 ఏండ్ల కిందట తమకు అమ్మిన పెద్దతాత కోడలైన గూడూరు లక్ష్మమ్మ, పెద్దతాత మరొక కుమారుడైన గూడూరు రంగారెడ్డి పేరిటే ఆ 3.10 ఎకరాల భూమిని పట్టాచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా తమ కుటుంబమే కాస్తులో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నదని, తమకు చెందాల్సిన భూమిపై చుట్టుపక్కల రైతులను విచారించి తగు న్యాయంచేయాలని బాధితుడు జంగారెడ్డి వేడుకొంటున్నారు. ఈ భూమి చుట్టుపక్కన ఉన్న రైతులు పన్నాల మల్లమ్మ, మేకల వెంకట్‌రెడ్డి, పన్నాల రామిరెడ్డి కూడా ఈ స్థలం గూడూరు రామిరెడ్డి కొనుగోలు చేశారని రామిరెడ్డి మనుమడైన జంగారెడ్డికే ఇది చెందాలని, ముమ్మాటికీ జంగారెడ్డే అసలైన హక్కుదారుడని చెప్తున్నారు.

### సత్వరమే విచారణ చేపడుతాం

గతంలో కొనుగోలుచేసి కాస్తులో ఉంటున్న రైతు గూడూరు జంగారెడ్డికి సంబంధించిన భూమి వివరాలు సేకరిస్తున్నాం. ఒకసారి పట్టాదారు పాస్‌పుస్తకం అందజేసి తిరిగి ఎందుకు మార్పుచేశారో తెలియదు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి తగిన న్యాయం చేస్తాం. మా పరిధిలో ఉంటే సత్వరమే పరిష్కరించి రైతుకు న్యాయంచేస్తాం. లేనిచో నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం.

- ఎస్ గీత, మోటకొండూర్ తాసిల్దార్



## అక్రమ భూబదలాయింపును రద్దుచేయండి

- సహకరించిన వీఆర్వోపై చర్యలు తీసుకోండి
- నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌వాసి వేడుకోలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఇద్దరు అన్నదమ్ములు వారసత్వంగా వచ్చిన భూమిని తనకు దక్కకుండా వీఆర్వో సహాయంతో అక్రమంగా వారిపేరిట పట్టాచేయించుకొన్నారని నిర్మల్ జిల్లా, ఖానాపూర్ మండలం, ఎర్వచింతల్ గ్రామానికి చెందిన చిక్యాల ప్రభాకర్‌రావు ఆరోపించారు. సర్వే నంబర్లు 96/1లో 2.23 ఎకరాలు, 138లో 38.1/2 గుంటల భూమిని వీఆర్వో అక్రమంగా డాక్యుమెంట్ నంబర్ 1630/2009, రిజిస్ట్రేషన్ నంబర్ 906/2012ను తన అన్నదమ్ముల పేరిట బదలాయించారని తెలిపారు. ఈ అక్రమ బదలాయింపు డాక్యుమెంట్లను రద్దుచేయాలని తాసిల్దార్‌కు విజ్ఞప్తిచేసినా ఫలితం లేకుండాపోయిందని పేర్కొన్నారు. భూమి తన తండ్రిపేరిట ఉండగా, ఆయన 2006లో చనిపోయారని, అనంతరం తన తల్లికి, తనకు తెలియకుండా తన ఇద్దరు అన్నదమ్ములు అక్రమంగా భూమిని వారిపేరిట రాయించుకొని పట్టా పొందారని తెలిపారు. తన తల్లి విజ్ఞప్తిమేరకు సీసీఎల్ఏ కమిషనర్ అక్రమ ఆర్వోఆర్‌లను రద్దుచేయాలని ఆదేశించినా స్థానిక తాసిల్దార్ ఖాతరుచేయడంలేదని బాధితుడు ప్రభాకర్‌రావు వివరించారు. తనకు న్యాయంచేయాలని ఉన్నతాధికారులను ధర్మగంట ద్వారా కోరుతున్నారు.




టీఆర్టీ షెడ్యూల్‌ను ప్రకటించినందుకు మంగళ వారం తెలంగాణభవన్ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీఆర్టీ అభ్యర్థులు

## ఎలక్ట్రిక్ పరికరాల్లో బంగారం స్మగ్లింగ్

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడిన స్మగ్లర్

**శంషాబాద్:** విదేశాల నుంచి బంగారం అక్రమ తరలింపునకు స్మగ్లర్లు కొత్త కొత్త పద్ధతులను ఎంచుకొంటున్నారు. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాల్లో బంగారం తరలించేందుకు విఫలయత్నం చేసిన ఒక స్మగ్లర్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డాడు. అబుదాబీ నుంచి హైదరాబాద్‌కు సోమవారం రాత్రి ఈవై-276 విమానంలో వచ్చిన ఒక ప్రయాణికుడిపై కస్టమ్స్ అధికారులకు అనుమానం రావడంతో ఆయన వస్తువులను తనిఖీ చేశారు. బ్లూటూత్ స్పీకర్, వాచ్, జూసర్లలోని చిన్న చిన్న పరికరాలకు బంగారం కోటింగ్ చేసి స్మగ్లింగ్‌కు పాల్పడినట్టు గుర్తించారు. రూ.19,63,317 విలువచేసే 574.070 గ్రాముల బంగారం తెచ్చినట్టు తేల్చిన అధికారులు.. బంగారం, పరికరాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడిన స్మగ్లర్ బంగారాన్ని తీసుకొచ్చిన జూసర్, వాచ్, బ్లూటూత్ స్పీకర్

## వైద్యవిధాన పరిషత్ కాంట్రాక్టు సిబ్బంది కొనసాగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని 2020 మార్చి 31 వరకు కొనసాగించాలని ఆదేశిస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. టీవీవీపీ దవాఖానల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, సహాయక సిబ్బంది 1,025 మంది పనిచేస్తున్నారు. ఏప్రిల్‌తో ముగిసిన వారి పనికాలాన్ని పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



# విద్యుత్ ప్రగతి పరుగులు

- నిరంతరంగా నాణ్యమైన విద్యుత్
- నాలుగేండ్లలో 409 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- రాష్ట్రంలో 1593కు చేరిన సబ్‌స్టేషన్లు
- టీఎస్‌ఎస్పీడీసీఎల్‌లో సరఫరా వ్యవస్థ పటిష్ఠం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ప్రగతి పరుగులు పెడుతున్నది. ఉమ్మడిపాలనలో కరంటు తీగల మీద ఉతికిన బట్టలు ఆరేసుకున్న ఉదంతాల నుంచి ప్రత్యేక రాష్ట్రంలో క్షణకాలం కూడా కరంటు సరఫరాకు అంతరాయం కలుగని స్థితికి చేరుకున్నది. ఈ మహత్తర విజయం వెనుక రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్‌శాఖ కృషి చెప్పలేనిది. ఉమ్మడి పాలకులు తెలంగాణ ప్రాంతంపై విద్యుత్ విషయంలో చూపిన వివక్ష అంతాఇంతా కాదు. నిత్యం కరంటు కోతలతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలేగాక భారీ పరిశ్రమలు సైతం మూతపడే దశకు చేరుకున్నాయి. చిన్నపాటి కార్ఖానాలనే నమ్ముకున్న ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఇక వ్యవసాయరంగం పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. రైతులు విద్యుత్‌కోసం రాత్రింబవళ్లు కండ్లు కాయలుకాసేలా ఎదురుచూసేవారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందోనని రాత్రంతా వ్యవసాయ మోటర్ల వద్ద జాగారాలు చేసి, పాముకాటుకు గురై మరణించిన ఉదంతాలు కోకొల్లలు. వారి గురించి ఉమ్మడి ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. వీటన్నింటినీ కండ్లారా చూసిన నాటి ఉద్యమనేత.. నేటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కరంటు విషయంలో ప్రజలు అనుభవించిన బాధలు, నిరంతర విద్యుత్ సరఫరాతో ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకుని, అనతికాలంలోనే విద్యుత్‌రంగంలో ఎవరికీ సాధ్యం కాని విజయాలను సాధించారు. అందులో



భాగంగానే దక్షిణ తెలంగాణ విద్యుత్ సరఫరా మండలి (టీఎస్‌ఎస్పీడీసీఎల్) పరిధిలో కొత్తగా 409 సబ్‌స్టేషన్లను నిర్మించారు. ఫలితంగా నాణ్యమైన విద్యుత్‌తో పారిశ్రామికీకరణతోపాటు వ్యవసాయరంగంలోనూ అద్భుత ఫలితాలెన్నో కనిపిస్తున్నాయి.

### 'ఉమ్మడి' కంటే ఎంతో ఉత్తమం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 65 ఏండ్ల పాలనలో తెలంగాణ ప్రాంతంలో కేవలం 1184 విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించారు. కానీ తెలంగాణ ఏర్పడిన నాలుగున్నరేండ్లలోనే దేశంలో ఎక్కడా లేనివిధంగా, ఎవరూ ఊహించనివిధంగా ఒక్క టీఎస్‌ఎస్పీడీసీఎల్ పరిధిలోనే 409 సబ్‌స్టేషన్లను నిర్మించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం రికార్డు సృష్టించింది. ఫలితంగా ప్రస్తుతం 2018-19 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల సంఖ్య 1593కు పెరిగింది. అంటే 39 శాతం అదనం అన్నమాట.

### 6961 మెగావాట్ల సరఫరా

టీఎస్‌ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించి సరఫరా వ్యవస్థను పటిష్ఠంచేయడంతోపాటు ఎక్కడా లేనివిధంగా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ తెలంగాణ ప్రభుత్వం రికార్డులు సృష్టించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2014-15 ఆర్థిక సంవత్సరంలో టీఎస్‌ఎస్పీడీసీఎల్ పరిధిలో 4710 మెగావాట్ల డిమాండ్ ఉండగా, 2018-19 ఆర్థిక సంవత్సరంలో 6961 మెగావాట్ల డిమాండ్ ఏర్పడింది. అంటే దాదాపు 50 శాతం డిమాండ్ అధికమయ్యిందన్నమాట. ఉమ్మడి పాలనలో 97.99 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదయితే.. ప్రస్తుత వేసవిలో రికార్డుస్థాయిలో 154.48 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదయ్యింది. దీంతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో అత్యధికంగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో 3391 మెగావాట్ల డిమాండ్‌కు అనుగుణంగా టీఎస్‌ఎస్పీడీసీఎల్ విజయవంతంగా విద్యుత్ సరఫరాచేసింది.

| ఆర్థిక సంవత్సరం | నిర్మించిన సబ్‌స్టేషన్లు |
|---|---|
| 2014 జూన్ వరకు | 1184 |
| 2014-15 | 76 |
| 2015-16 | 97 |
| 2016-17 | 70 |
| 2017-18 | 61 |
| 2018-19 | 105 |
| మొత్తం | 1593 |



వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమం

- పట్టణాల్లో డే కేర్ సెంటర్ల ఏర్పాటు
- త్వరలో సంక్షేమశాఖలో ఖాళీల భర్తీ: మంత్రి కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం ఏర్పాటుకు సీఎం కేసీఆర్ నిర్ణయించారని.. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి.. వృద్ధాశ్రమాలు లేని జిల్లాల్లో ప్రభుత్వం తరుపున వీటిని ఏర్పాటుచేస్తామని స్పష్టంచేశారు. మంగళవారం సచివాలయంలో వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వృద్ధాశ్రమాల్లో వసతి, వైద్య సదుపాయాలను మెరుగుపర్చాలని, శాశ్వత భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సూచించారు. పట్టణప్రాంతాల్లో డే కేర్ సెంటర్ల ఏర్పాటుపై నివేదిక సిద్ధంచేయాలన్నారు. వికలాంగుల, వృద్ధుల సంక్షేమశాఖలో ఖాళీపోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, సంబంధిత వివరాలను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు.

**అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన పనులపై సమీక్ష**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణ పనులను వేగవంతంచేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఆయన భారీ విగ్రహ ప్రతిష్ఠాపనపై అధికారులతో సమీక్షించారు.



సర్దార్ సర్వాయి పాపన్న కోటలో గ్రానైట్ తవ్వకం అనుమతిని రద్దుచేసిన నేపథ్యంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న గౌడ జనహక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ సంఘం నేతలు

## పాపన్నకోటను కాపాడుతాం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బహుజన యోధుడు, మొఘల్ సైన్యాన్ని ఎదురించిన సర్దార్ సర్వాయి పాపన్నకోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. మైనింగ్ మాఫియా చేతిలో ఉన్న పాపన్నకోటను మైనింగ్ నిషేధితప్రాంతంగా మార్చేందుకు చర్యలుచేపట్టిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను పలు సంఘాల నేతలు మంగళవారం ఘనంగా సన్మానించారు. చేగుంట మండలం కర్నాలలో రేణుకా ఎల్లమ్మ గుడికి తాళంవేసి, గీత కార్మికులపై దాడికి యత్నించినవారిపై చర్యలు తీసుకునేవిధంగా సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## వృద్ధ రైతులకు నూతన పింఛన్ విధానం

- 60 ఏండ్లు నిండిన రైతులకు నెలకు రూ.3 వేల పింఛన్
- రాష్ట్రాలకు కేంద్రం మార్గదర్శకాలు
- ఐదెకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు
- 18 నుంచి 40 ఏండ్ల మధ్య ఉన్న రైతుల పేర్లు నమోదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా వృద్ధ రైతులకు ఎల్‌ఐసీ సహకారంతో నూతన పింఛన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. 'ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన' పేరుతో పథకానికి రూపకల్పన చేసింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేస్తూ రాష్ట్రాలకు లేఖలను పంపింది. సొంతంగా ఐదెకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు, 18 ఏండ్ల నుంచి 40 ఏండ్లలోపు వయసున్నవారు ఈ పథకానికి అర్హులుగా ప్రకటించింది. పథకంలో పేర్లు నమోదు చేసుకున్న రైతు 60 సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత నెలకు రూ.3 వేల చొప్పున పింఛన్ పొందుతారని స్పష్టం చేసింది. లబ్ధిదారులు వారి అర్హత డిక్లరేషన్‌ను కూడా సమర్పించాలి. ఒకవేళ లబ్ధిదారు గ్రామంలో అందుబాటులో లేకపోతే వారి కుటుంబసభ్యుల నుంచి తీసుకుంటారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయాన్ని, పూర్తి మార్గదర్శకాలను రాష్ట్రాలకు పంపిన లేఖలో పేర్కొన్నది.

## హైదరాబాద్‌లో రియల్ ధమాకా

మొదటిపేజీ తరువాయి...

ఈ వివరాలు ఉన్నాయి. ఆఫీస్‌స్పేస్‌లో దేశంలోని అన్ని నగరాల కంటే మిన్నగా హైదరాబాద్ ఉన్నది. కొత్తగా పూర్తయిన ఆఫీస్ స్పేస్, లావాదేవీలు.. ఈ రెండింటిలోనూ హెచ్1 2019లో గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యుత్తమ వృద్ధిని నమోదుచేసింది. హెచ్1 2018లో నమోదైన 0.16 మిలియన్ చదరపు మీటర్లతో పోల్చితే, 129% కొత్త ఆఫీస్ స్పేస్‌ను పూర్తిచేసింది. దాదాపు 0.37 మిలియన్ చదరపు మీటర్లుగా ఈ వృద్ధి నమోదైంది. లావాదేవీల విషయంలో హెచ్1 2018లో నమోదైన 0.25 మిలియన్ చదరపు మీటర్లతో పోల్చితే హెచ్1 2019లో 0.36 మిలియన్ చదరపు మీటర్లతో హైదరాబాద్ 43% పెరుగుదల నమోదుచేసింది.



నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్

**నివాస సముదాయాల్లో 47% వృద్ధి**

నివాస సముదాయాల విషయంలో 2018 తొలి అర్ధసంవత్సరంలో ప్రారంభించిన 3,706 యూనిట్లతో పోలిస్తే, హెచ్1 2019లో 47% వృద్ధితో 5,430 కొత్త రెసిడెన్షియల్ యూనిట్ల ప్రారంభంతో హైదరాబాద్ రికార్డు సృష్టించింది. హౌసింగ్ యూనిట్ల అమ్మకాల్లోనూ 0.3% పెరుగుదల నమోదుచేసింది. హెచ్1 2019లో రికార్డుస్థాయిలో మొత్తం రెసిడెన్షియల్ యూనిట్ల అమ్మకాలు 8,334గా నమోదయ్యాయి. ఈ సందర్భంగా నైట్‌ఫ్రాంక్ ఇండియా డైరెక్టర్ శామ్సన్ ఆర్థర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఆఫీస్ ప్రాపర్టీ మార్కెట్ నిరంతరం పెరుగుతూనే ఉన్నదని చెప్పారు. జాతీయస్థాయితోపాటు ప్రాంతీయస్థాయి విస్తరణకోసం ప్రపంచస్థాయి టెక్నాలజీ సంస్థలు హైదరాబాద్‌కు రావటమే దీనికి ప్రధాన కారణమని తెలిపారు. బెస్ట్ లివింగ్ సిటీ, ఆహ్లాదకరమైన వాతావరణం, వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం తదితర కారణాల వల్ల టెక్ దిగ్గజాలు, స్టార్టప్‌లు హైదరాబాద్‌కు వస్తున్నట్లు ఆయన విశ్లేషించారు. అందుకే, ఈ మార్కెట్లో డెవలపర్లద్వారా ఆఫీస్ లావాదేవీలతోపాటు ప్రాజెక్టుల నిర్మాణం నిరంతరాయంగా జరుగుతున్నదని చెప్పారు. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ వృద్ధి అనేది అకస్మాత్తుగాకాకుండా, క్రమపద్ధతిలో, స్థిరంగా కొనసాగుతున్నదని, ఇది మంచి పరిణామమని అన్నారు. నివాస సముదాయాల విషయంలో దాదాపుగా పూర్తికావచ్చిన ప్రాజెక్టుల అమ్మకాలు హెచ్1 2019లో పెరిగాయని ఆర్థర్ చెప్పారు. సిద్ధంగా ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగదారులకు జీఎస్టీ మినహాయింపు ఉండటం వల్ల డిమాండ్ పెరిగిందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ అనేది పటిష్ఠంగా కొనసాగుతున్నదనేందుకు నిదర్శనంగా అమ్మకంకాని ఇన్వెంటరీలో 67% భారీ తగ్గుదల నమోదైందని ఆయన తెలిపారు.

# రాజకీయ లబ్ధికోసమే కేసులు

- విధాన నిర్ణయాలను సవాల్ చేయలేరు
- ఎర్రమంజిల్ భవనం కూల్చివేతకు హెరిటేజ్ అనుమతి అవసరం లేదు
- నూతన అసెంబ్లీ, సచివాలయ భవన నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ, సచివాలయ భవనాలు పాలనావసరాలకు అనుగుణంగా లేనందువల్లనే కొత్త భవనాల నిర్మాణానికి పూనుకొన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు మంగళవారం వేర్వేరుగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలుచేసింది. ఎర్రమంజిల్ ప్రాంతంలో నూతన అసెంబ్లీని నిర్మించాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకున్నదని, ఈ నిర్ణయాలను పిటిషనర్లు సవాల్ చేయలేరని పేర్కొన్నది. ఉత్తమ పరిపాలన అందించడానికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో జోక్యం చేసుకోలేరని, ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదని చట్టాలు స్పష్టంచేస్తున్నాయని తెలిపింది. ఈ వాదనకు మద్దతుగా 'పీటీఆర్ (ఎక్స్‌పోర్ట్స్) మద్రాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా', 'కచ్ జల్ సంకట్ నివారణ్ సమితి వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్' కేసులను ప్రభుత్వం ప్రస్తావించింది. రాజకీయ లబ్ధి కోసం కొంతమంది, రాజకీయ ప్రేరేపితంగా కొంతమంది కేసులువేశారని, వీటిని తిరస్కరించాలని కోర్టును కోరింది. అవి పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్స్ కాదని పొలిటికల్ ఇంట్రెస్ట్ లిటిగేషన్స్ అని, రాజకీయ ఉద్దేశాలు, లేదా ప్రైవేట్ లబ్ధికోసం వేసిన ఈ పిల్స్‌కు లోకస్ స్టాండీ (అర్హత) లేదని స్పష్టంచేసింది. 'చట్టం ప్రకారం ఎర్రమంజిల్ హెరిటేజ్ భవనం కానందున హెరిటేజ్ కన్జర్వేషన్ కమిటీ నుంచి ఎలాంటి అనుమతి అవసరంలేదు. ప్రస్తుత అసెంబ్లీ భవనాల రిపేర్లకు భారీఎత్తున ఖర్చుచేశారని పిటిషనర్లే అంగీకరించారు. ఎన్ని మరమ్మతులు చేసినా ప్రస్తుత అసెంబ్లీ భవనం భద్రమేనని గుర్తించే పరిస్థితిలేదు. శాసనమండలి భవనం సరిగాలేదని ఆర్‌అండ్‌బీ 2017లో సమర్పించిన అధికారిక నివేదిక స్పష్టంచేస్తున్నది. ప్రస్తుత భవనానికి సరైన అగ్నిమాపక భద్రతా వ్యవస్థ లేదు. అందుకే నూతన కాంప్లెక్స్ నిర్మించాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత అసెంబ్లీ భవనాన్ని టౌన్‌హాల్‌గా వినియోగించుకునేందుకు నిజాంకాలంలో నిర్మించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు గుర్తింపు పొందిన లెజిస్లేచర్ కాంప్లెక్స్ ఎక్కడాలేదు. ప్రస్తుత భవనంలో 25 గదులు, ఐదు కమిటీ హాళ్లు ఉన్నాయి. ముఖ్యమంత్రి, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రతిపక్ష నేత, మంత్రులకు సరైన వసతిసౌకర్యాలు లేవు. లెజిస్లేచర్ సెక్రటరీకి కార్యాలయం అందుబాటులో లేదు. మండలిభవనం కూడా వసతులపరంగా అసౌకర్యంగా ఉన్నది. మంత్రులందరూ ఒకటే హాల్‌లో కూర్చోవాల్సిన పరిస్థితి ఉన్నది. సంబంధిత శాఖల అధికారులు కారిడార్లో కూర్చుంటున్నారు. అసెంబ్లీ, మండలి సంయుక్త సమావేశాలకు సెంట్రల్ హాల్, మంత్రులకు అవసరమైన పరిశోధన విభాగం, సరైన పార్కింగ్ సౌకర్యాలు లేవు. మండలి, అసెంబ్లీ భవనాలు కలిసి లేవు. వాటిమధ్య ఇరుకైన దారి మాత్రమే ఉన్నది. నూతన అసెంబ్లీ, మండలి కాంప్లెక్స్ డిజైన్లపై ప్రస్తుతం కసరత్తు జరుగుతున్నది. వాటికి తుదిరూపు వచ్చిన తర్వాత బడ్జెట్ అంచనాలపై స్పష్టత వస్తుంది' అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నది.

### ప్రభావవంతమైన పాలనకే నూతన సచివాలయం

రాష్ట్ర ప్రజలకు ప్రభావవంతమైన పాలన అందించడం, ప్రభుత్వసేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంతోపాటు ఆధునిక పాలనావిధానాలకు అనుగుణంగా నూతన సచివాలయం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నది. ఇటీవలే రాష్ట్రంలో 33 జిల్లాలు, 69 రెవెన్యూ డివిజన్లు, 589 మండలాలను ఏర్పాటుచేసిన దరిమిలా అన్ని మౌలిక సదుపాయతో కూడిన సచివాలయ భవనం అవసరమని తెలిపింది. 'ప్రస్తుతం ఉన్న సచివాలయంలోని భవనాలను వివిధ సమయాల్లో నిర్మించారు. ఇందులో 1888లో నిర్మించిన భవనాలు కూడా ఉన్న నేపథ్యంలో వాటిలో చాలా భవనాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రాథమికంగా ఉండాల్సిన ఫైర్ సేఫ్టీ, సెక్యూరిటీ బఫర్‌జోన్, క్రౌడ్ హ్యాండ్లింగ్ ఏరియా, క్రమబద్ధమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే మార్గాలు, పార్కింగ్ వ్యవస్థ నిబంధనలకు అనుగుణంగా లేవు. హెలిప్యాడ్ ప్రాంతంతో కలిపి మొత్తం సచివాలయం ప్రాంతం 25.5 ఎకరాలు ఉన్నది. భవనాలు చెల్లాచెదురుగా ఉండటంవల్ల మిగిలిన ఖాళీ ప్రాంతాన్ని ఉపయోగించుకునే పరిస్థితి లేదు. సచివాలయంలో కొన్ని భవనాల జీవితకాలం ఇంకా 50 నుంచి 70 ఏండ్లు ఉంటుందన్న పిటిషనర్ల వాదనలో నిజంలేదు. క్రమబద్ధంగాలేని భవనాలవల్ల సిబ్బంది, అధికారులు, వీవీఐపీలు సచివాలయం ప్రాంగణంలో సరిగా తిరిగే పరిస్థితి లేదు' అని ప్రభుత్వం పేర్కొన్నది.

## మంత్రి ఈటలతో ప్రభుత్వ వైద్యుల సంఘం నేతల భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ లాలుప్రసాద్‌రాథోడ్, ప్రధాన కార్యదర్శి ఆర్ దీన్‌దయాళ్ తదితరులు మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిశారు. మంత్రి కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు కాలపరిమితి నిబంధనతో పదోన్నతులు కల్పించడంతోపాటు వైద్యులకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి ఈటలకు వినతిపత్రం సమర్పించినట్టు వారు తెలిపారు.

## అల్ అరిఫ్ యునానీ మెడికల్ కాలేజ్ గుర్తింపు రద్దు

- ప్రభుత్వ నిజామియా టిబ్బి కాలేజ్‌లో విద్యార్థుల సర్దుబాటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అల్ అరిఫ్ యునానీ మెడికల్ కాలేజ్ అఫిలియేషన్‌ను రద్దుచేసినట్టు కాళోజీ నారాయణరావు ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్ అరిఫ్ యునాని మెడికల్ కాలేజీకి జారీచేసిన ఎసెన్షియాలిటీ సర్టిఫికెట్ (అత్యవసర ధ్రువపత్రం)ను రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్ అరిఫ్‌లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ నిజామియా టిబ్బి కాలేజ్‌లో సర్దుబాటుచేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 13న ఉస్మానియాలోని ప్రొఫెసర్ జీ రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ విభాగంలో విద్యార్థుల సర్దుబాటు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 2014-15, 2015-16, 2016-17, 2017-18 విద్యాసంవత్సరాల్లో చేరిన విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, పూర్తి సమాచారం కోసం www.knruhs.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని రిజిస్ట్రార్ సూచించారు.

## వైద్యులపై దాడుల నిరోధానికి చర్యలు

- ప్రతిపాదనలను సిఫారసు చేయనున్న జాతీయ కమిటీ
- నేడు ఢిల్లీలో తొలి భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో వైద్యులు, దవాఖానలపై దాడులను అరికట్టేలా ఓ చట్టాన్ని రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించేందుకు గత ఐదో తేదీన జాతీయస్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ బుధవారంనాడు ఢిల్లీలో తొలిసారి సమావేశం కానున్నది. దాడులకు పాల్పడుతున్నవారిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ కమిటీ సిఫారసు చేయనున్నది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలోని ఎమ్మెస్ విభాగం జాయింట్ సెక్రటరీ ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

## వన్యప్రాణుల సంరక్షణపై పీజీ డిప్లొమో కోర్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి దేశంలోనే తొలి పీజీ డిప్లొమో కోర్సును నల్సార్ విశ్వవిద్యాలయం ప్రారంభించింది. హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్ భాగస్వామ్యంతో ఏడాది కాలవ్యవధితో దూరవిద్య పద్ధతిలో ఈ కోర్సును నిర్వహిస్తారు.

## అమ్రాబాద్‌లో యురేనియం వెలికితీతకు ప్రాథమిక అనుమతులు

- ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ సిఫారసు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలో యురేనియం వెలికితీతకు ప్రాథమిక అనుమతులు మంజూరు చేయవచ్చని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ (ఎఫ్ఏసీ) సిఫారసు చేసింది. మే 22న జరిగిన సమావేశంలో ఎఫ్ఏసీ ఈ సిఫారసు చేసింది. యురేనియం వెలికితీత కోసం అమ్రాబాద్-ఉడిమల్ల (మహబూబ్‌నగర్ జిల్లా)-నారాయణ్‌పూర్(నల్లగొండ జిల్లా) పరిధిలో సర్వే, డ్రిల్లింగ్ పనులు చేపట్టేందుకు అనుమతించాలని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండీ) గతంలో అటవీ శాఖను కోరింది. ఎఫ్ఏసీ సిఫారసుపై తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పీకే ఝా స్పందిస్తూ.. ఏఎండీకి కేవలం ప్రాథమిక అనుమతులు మాత్రమే వచ్చాయని, టైగర్ రిజర్వులో పనులు చేపట్టేందుకు శాఖాపరమైన పూర్తిస్థాయి అనుమతులు రావాల్సి ఉన్నదని చెప్పారు.

## పాఠశాల బాలికలకు రాగి లడ్డూలు

- 38 రోజులు.. 3.53 లక్షల మందికి..
- రక్తహీనత నివారణకు విద్యాశాఖ నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 8 వరకు చదువుతున్న బాలికలకు రాగి లడ్డూలు పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. బాలికల్లో రక్తహీనతను తగ్గించడానికి రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా పౌష్టికాహారం అందించవచ్చని కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3,53,565 మంది బాలికలకు రాగి లడ్డూలు ఉచితంగా సరఫరా చేయనున్నారు. నెలకు మూడురోజులు లేదా ఏడాదిలో 38 రోజులు రాగి లడ్డూలు సరఫరా చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని, ప్రతి రాగి లడ్డూ 40 గ్రాములు ఉంటుందని తెలిపారు. ఈ పథకం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని, ఇందులో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు.

## ఖాళీ అవుతున్న బీఆర్కే భవన్

- వారంరోజుల్లో పనులు పూర్తి
- అనంతరం సచివాలయం తరలింపు
- సీఎం సహా మంత్రులందరికీ బీఆర్కే భవన్‌లోనే కార్యాలయాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సచివాలయాన్ని బూర్గుల రామకృష్ణారావు (బీఆర్కే) భవన్‌కు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు నాలుగు లక్షల చదరపు అడుగులున్న ఈ భవన్‌లో మెజార్టీ సచివాలయ శాఖలను ఏర్పాటుచేసుకోవచ్చని అధికారులు నిర్ణయానికి వచ్చారు. దీంతో బీఆర్కే భవన్‌లో ఉన్న వివిధ శాఖల కార్యాలయాలను ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆయా శాఖల కార్యాలయాలకు తరలిస్తున్నారు. తొమ్మిది అంతస్తులున్న బీఆర్కే భవన్‌లో ప్రస్తుతం గనులు, మార్కెటింగ్, అగ్నిమాపక, సాంకేతికవిద్య, విజిలెన్స్, తెలంగాణ స్టేట్ టెక్నలాజికల్ సర్వీసెస్ (టీఎస్టీఎస్), భూగర్భ జలవనరులు తదితర శాఖలకు చెందిన 15 కార్యాలయాలున్నాయి. వీటిలో భూగర్భ జలవనరులశాఖ ఇప్పటికే బీఆర్కే భవన్‌ను ఖాళీచేసింది. ఏడో అంతస్తులో ఉన్న సాంకేతిక విద్యామండలి కార్యాలయాన్ని మాసబ్ ట్యాంక్‌కు తరలిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఈ పనులు మొదలయ్యాయి. మిగలిన ఇతర కార్యాలయాలను కూడా వారంరోజుల్లో వేరే ప్రాంతాలకు తరలించనున్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత సచివాలయ అధికారులు తమతమ కార్యాలయాలను బీఆర్కే భవన్‌కు తరలిస్తారు. ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు మంత్రులందరికీ బీఆర్కే భవన్‌లోనే కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం, జీఏడీ కార్యాలయాలతోపాటు వివిధ శాఖలను బీఆర్కే భవన్‌కు తరలిస్తారు. బీఆర్కే భవన్‌లో ఎన్ని శాఖలకు వీలైతే అన్ని శాఖలకు చోటు కల్పించాలని ప్రాథమికంగా నిర్ణయించిన ప్రభుత్వం.. మరి కొన్నింటిని ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు తరలించాలని నిర్ణయించినట్టు తెలిసింది. సచివాలయంలోని ఎక్కువ శాఖలను బీఆర్కే భవన్‌కు తరలించాలని నిర్ణయించిన నేపథ్యంలో పార్కింగ్‌పై అధికారులు దృష్టిసారించారు. భద్రత కారణాల రీత్యా బీఆర్కే భవన్ లోపల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధించనున్నారు. జీహెచ్ఎంసీ, బీఆర్కే భవన్‌ల ముందున్న రోడ్డును బ్లాక్‌చేసి పూర్తిగా పార్కింగ్‌కు కేటాయిస్తారు.



బీఆర్కే భవన్ ఏడో అంతస్తులోని సాంకేతిక విద్యామండలి కార్యాలయ సామగ్రిని మంగళ వారం మాసాబ్‌ట్యాంక్‌కు తరలిస్తున్న దృశ్యం



కర్ణాటక రాజకీయ సంక్షోభంలో బీజేపీ పాత్ర ఉన్నది. తిరుగుబాటు ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న విమానంలో యడ్యూరప్ప పీఏ ఉన్నాడు. ప్రభుత్వాలను అస్థిరపరిచి బార్లు, హోటళ్లలో ముఖ్యమంత్రులను ఖరారు చేస్తున్నది. ఇదేవిధంగా గతంలో మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో కూడా చేసింది.

**గులాం నబీ ఆజాద్, కాంగ్రెస్ సీనియర్ నేత**



కాంగ్రెస్, జేడీ(ఎస్) ఎమ్మెల్యేలకు తమ నేతలపై, వారి ప్రభుత్వంపై విశ్వాసం లేదు. అందుకే వారు రాజీనామాలతో తిరుగుబాటు చేస్తున్నారు. కర్ణాటక సంక్షోభంలో బీజేపీ పాత్రేమీ లేదు. అవకాశం లభిస్తే రాష్ట్రాన్ని పాలించే హక్కు బీజేపీకి ఉన్నది.

**సదానంద గౌడ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత**

**చరిత్రలో నేడు**



**1806**

వెల్లూరు తిరుగుబాటు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాలపై భారత మొదటి తిరుగుబాటు.

**1934**



మొదటిసారి దక్షిణ అమెరికాలో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్.



**1947**

పాకిస్థాన్‌కు మొదటి గవర్నర్ జనరల్‌గా మహమ్మద్ అలీ జిన్నాను నియమించిన బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ.

నేపాల్‌లో రుతుపవనాల ఆగమనం నెలరోజుల పాటు ఆలస్యమైంది. దీంతో కొండ ప్రాంతాల్లో నాట్లు వేయడం కూడా ఆలస్యమైంది. వరి స్థూల దేశీయోత్పత్తిలో ఇరువై శాతం. రుతుపవనాల మందగమనం వల్ల ఈసారి వరి దిగుబడి కూడా తగ్గవచ్చు. దేశవ్యాప్తంగా పద్నాలుగు శాతం మాత్రమే నాట్లు వేశారు. దీనికితోడు ప్రధాన నదీ పరీవాహక ప్రాంతాల్లో వరదల ప్రమాదం పొంచి ఉందనే హెచ్చరికలు వెలువడ్డాయి. దీనివల్ల కూడా పంటలు దెబ్బ తినవచ్చు. ఇతర మౌలిక సదుపాయాలకు కూడా నష్టం వాటిల్లవచ్చు.

**ది హిమాలయన్ టైమ్స్**

బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ సబ్సిడీ వ్యయం భారీగా 29.36 శాతానికి చేరుకున్నది. ఈ సబ్సిడీ మొత్తం 46,385 కోట్లు ఉంటుంది. ఇందులో ఎగుమతులకు చెల్లించేది 6,825 కోట్లు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన వస్తువులు పోటీ పడాలంటే సబ్సిడీలు అవసరమే. దీనివల్ల భిన్నరకాల ఎగుమతులను ప్రోత్సహించడానికి వీలు కలుగుతుంది. అయితే ఆర్థిక కోణంలో పూర్తిగా ఎగుమతులను సమర్థించలేము. దీనిపై సమీక్ష జరుగవలసి ఉన్నది. ప్రవాసులు చట్టబద్ధ మార్గాల్లో డబ్బులు స్వదేశానికి డబ్బు పంపడాన్ని ప్రోత్సహించడం కూడా మంచిదే.

**ది డైలీ స్టార్**



# సంకీర్ణ సంక్షోభం

కర్ణాటకలోని జనతాదళ్ (ఎస్), కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం తీవ్ర సంక్షోభంలో పడింది. వేగంగా మారుతున్న సమీకరణాల నేపథ్యంలో హెచ్‌డీ కుమారస్వామి ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని అనిశ్చితి కొనసాగుతున్నది. అధికార కూటమికి చెందిన 13 మంది ఎమ్మెల్యేలతోపాటు ఒక స్వతంత్ర ఎమ్మెల్యే కూడా రాజీనామా చేసి ఏకంగా బీజేపీ పక్షాన చేరిపోవటంతో అధికార కూటమికి మెజారిటీ నిరూపించుకోవలసిన సంకటం ఏర్పడుతున్నది. ఈ రాజకీయ సంక్షోభానికి కారణం నువ్వంటే, నువ్వని కాంగ్రెస్, బీజేపీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. కానీ నిజానికి ఈ అనిశ్చితికి కారణం ఈ రెండు పార్టీలు అనుసరిస్తున్న ఆధిపత్య రాజకీయాలే. కాంగ్రెస్ ముక్త్‌భారత్ అంటున్న బీజేపీని నిలువరించటం కోసం సంఖ్యాబలాన్ని చూడకుండా కాంగ్రెస్ జేడీ(ఎస్)కు ముఖ్యమంత్రి పదవి అప్పజెప్పి సంతృప్తిపడింది. అయితే బీజేపీ ఏమీ తక్కువ తినలేదు. గతంలో అరుణాచల్‌ప్రదేశ్, గోవా ఉదంతాల నేపథ్యంలో మూటగట్టుకున్న అనైతిక రాజకీయ మరకలు, పార్టీ ఫిరాయింపుల అపవాదుల నుంచి తప్పించుకునేందుకు పావులు కదిపింది. ఎప్పటిలాగే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలుచేస్తున్నారన్న నిందారోపణల నుంచి తప్పించుకోవటం కోసం రాజీనామాలనే కొత్త అస్ర్తాన్ని ప్రయోగిస్తున్నది. ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేల రాజీనామాలతో సంఖ్యాబలాన్ని కుదించేసి, తమకున్న సంఖ్యాబలాన్ని పెద్దదిగా చేసుకుంటున్నది. ఏడాదిన్నరకాలంగా (జేడీఎస్), కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం దినదిన గండంగా సాగుతున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని కూల్చివేయకుండానే అధికారం చేజిక్కించుకోవాలనేది బీజేపీ వ్యూహం.

**కేంద్రంలో అధికారం చేజిక్కించుకునే స్థితి వచ్చినప్పటి నుంచీ బీజేపీ అన్నిరకాల ప్రజాస్వామిక సంప్రదాయాలకు వక్రభాష్యాలు చెప్పటమే కాదు, తిలోదకాలు ఇస్తున్నది. వాజపేయి హయాంలో సమయానుకూలంగా వచ్చేదంతా సంకీర్ణయుగమని, చెప్పుకొస్తూ ఆ ప్రభుత్వాలను అస్థిరపరిచే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి చేటని చాటిచెప్పింది. ఇక 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ కర్ర ఉన్నోనిదే బర్రె అన్నట్టు వ్యవహరిస్తున్నది.**

కర్ణాటక సంక్షోభంలో కాంగ్రెస్ పాత్ర తక్కువేమీ కాదు. మొదటినుంచీ జేడీ(ఎస్)కు అధికారం అప్పగించటం పట్ల కాంగ్రెస్‌లోని సిద్ధరామయ్య వర్గానికి కంటగింపుగా ఉన్నది. కేవలం 37 మంది ఎమ్మెల్యేలతో ఉన్న జేడీ(ఎస్)కు మద్దతు ఇస్తూ డెబ్భైకి పైగా సంఖ్యాబలం కలిగి ఉండి కూడా అధికారపగ్గాలకు దూరంగా ఉండటం కాంగ్రెస్ వర్గాలకు మింగుడుపడటం లేదు. ఈ నేపథ్యంలోంచే మొదటినుంచీ మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వర్గీయులు అవకాశం దొరికినప్పుడల్లా కుమారస్వామి ప్రభుత్వంపై విరుచుకుపడుతూనే ఉన్నారు. అవినీతి ఆరోపణలతో ఇరుకునపెడుతూ ఉన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములై ఉండి కూడా ప్రభుత్వ పనితీరును కాంగ్రెస్ విమర్శిస్తుండటం పట్ల ఒకానొక దశలో కుమారస్వామి కన్నీటి పర్యంతమైన సందర్భాలున్నాయి. సిద్ధరామయ్య వర్గీయులు చేస్తున్న సహాయ నిరాకరణ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తూ సీఎం సీట్లో కూర్చొని అనుక్షణం తాను అనుభవిస్తున్న క్షోభ అంతాఇంతా కాదని కుమారస్వామి చెప్పుకున్నారు. అనేక సందర్భాల్లో అధికారపీఠంపై నిర్వేదాన్ని ప్రకటిస్తూ ముళ్ల కిరీటాన్ని మోయలేనని మొరపెట్టుకున్న సందర్భాలున్నాయంటే కాంగ్రెస్ అంతర్గతంగా ఎంతటి ఒత్తిడి రాజకీయాలకు పాల్పడిందో ఊహించుకోవచ్చు. సంకీర్ణ నీతిని కాంగ్రెస్ ఏ మాత్రం పాటించినా కర్ణాటకలో ఈ దురవస్థ తలెత్తేది కాదు.

కేంద్రంలో అధికారం చేజిక్కించుకునే స్థితి వచ్చినప్పటి నుంచీ బీజేపీ అన్నిరకాల ప్రజాస్వామిక సంప్రదాయాలకు వక్రభాష్యాలు చెప్పటమే కాదు, తిలోదకాలు ఇస్తున్నది. వాజపేయి హయాంలో సమయానుకూలంగా వచ్చేదంతా సంకీర్ణయుగమని, చెప్పుకొస్తూ ఆ ప్రభుత్వాలను అస్థిరపరిచే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి చేటని చాటిచెప్పింది. ఇక 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ కర్ర ఉన్నోనిదే బర్రె అన్నట్టు వ్యవహరిస్తున్నది. కేంద్రంలోని అధికారబలంతో వివిధ రాష్ర్టాల్లోని ప్రతిపక్షపార్టీల ప్రభుత్వాలను ఆపరేషన్ లోటస్ పేరుతో పడగొట్టేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నది. కనీస బలం లేకున్నా ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ర్టాలను అస్థిరపరుస్తున్న బీజేపీ సుస్థిర ప్రభుత్వం కోసమే ప్రభుత్వాలను ఏర్పర్చామని బుకాయించింది. పశ్చిమబెంగాల్‌లో అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ చేస్తున్న హింసా రాజకీయాలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. తాజాగా కర్ణాటకలో పార్టీ ఫిరాయింపుల మాట లేకుండానే రాజీనామాలతో రాజకీయాలను రచ్చకీడ్చింది. కర్ణాటకలో మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 224 కాగా మెజారిటీకి కావాల్సింది 113. బీజేపీ 105 సీట్లు సాధించి 13 సీట్ల దూరంలో ఉన్నది. కాబట్టి 13 మంది రాజీనామాలతో మెజారిటీ మ్యాజిక్ సంఖ్య 106కు తగ్గుతుంది. దీంతో బీజేపీకి కావాల్సింది ఒక ఎమ్మెల్యే మద్దతు మాత్రమే. ఈ స్థితిలో కాంగ్రెస్ కూడా అధికారాన్ని నిలుపుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నది. మంత్రులతో రాజీనామా చేయించింది. అసంతృప్తులకు తిరిగివస్తే మంత్రివర్గంలో స్థానం కలిగిస్తామనే సంకేతాలు పంపుతున్నది. మరోవైపు బీజేపీ అనుసరిస్తున్న ఆధిపత్య రాజకీయాలు ప్రజాస్వామ్యానికే హానికరం. ఈ మొత్తం వ్యవహారంలో ఎమ్మెల్యేల బేరసారాలు సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయాలలో విలువలను కాపాడటం అన్ని రాజకీయపక్షాల బాధ్యత.

**జనగళం**

## ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యం అనుచితం

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నాయి. కానీ, మన దేశంలో మాత్రం అందుకు భిన్నంగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండటం దురదృష్టకరం. ఇది తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్న చందాన ఉన్నది. ప్రైవేట్ పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా ప్రవేశించడానికి వీలు కల్పిస్తూ ప్రైవేటీకరణకు మార్గాన్ని సుగమం చేయటమే గాక, ప్రభుత్వరంగసంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణలపై ప్రభుత్వం వచ్చే ఐదేండ్లలో నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పర్చుడం అనుచితం. ఇప్పటిదాకా ఖాయిలా పడ్డ పరిశ్రమలను మాత్రమే విక్రయించడం జరుగగా ఇకపై లాభాల బాటలో పయనించే సంస్థలను కూడా ప్రైవేట్‌పరం చేయబోతున్నారని తెలుస్తున్నది. విమానాశ్రయాల నిర్వహణ, ప్రభుత్వసంస్థల నుంచి ప్రభుత్వ వాటా ఉపసంహరణ, అన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతోనే స్థాపించడం, రైల్వేలు, బీమా, వైద్యరంగాల్లో ప్రైవేట్ సంస్థల ప్రవేశం వంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే. 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.1,05,000 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ జమలను మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ లక్ష్యాన్ని 'ప్రభుత్వరంగ సంస్థల వ్యూహాత్మక విక్రయం' ద్వారా సాధించాలని కేంద్రం లక్ష్యాలను నిర్దేశించుకోవడం అనుచితం. ఇది ఒక రకంగా స్వావలంబనకు తిలోదకాలివ్వటంగా చెప్పవచ్చు. స్వతంత్ర భారతంలో స్వాతంత్ర్యోద్యమ నాయకులు లాభార్జన పక్కన పెట్టి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారు. దాదాపుగా అన్నిరంగాల్లో ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పారు. వీటి స్థాపన ఉద్దేశం అర్థ చేసుకోకుండా కేవలం ఉత్పాదకత, లాభార్జనలను దృష్టిలో ఉంచుకొని ఈ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం సముచితం కాదు. అదేవిధంగా రైల్వేల ప్రైవేటీకరణ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా అనుసరించనున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వరంగసంస్థల ప్రయివేటీకరణకు మోదీ సర్కారు ప్రయత్నాలను అన్ని ప్రతిపక్షరాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ప్రతిఘటించి తిప్పికొట్టాలి?.

**- సి.సాయిప్రతాప్, రాహుల్‌కాలనీ, ఎ.ఎస్‌రావునగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**విశ్లేషణ**



**జయతి ఘోష్**

# బడ్జెట్‌లో తప్పుడు లెక్కలా?

ప్రభుత్వ ఆదాయవ్యయాల వివరాలను పార్లమెంటుకు, ప్రజలకు వెల్లడించాల్సిందే. పార్లమెంటు బడ్జెట్‌ను ఆమోదించే ముందు సవివర చర్చ సాగుతుంది. ఈ చర్చ ప్రధానంగా ఏ రంగానికి ఎంత కేటాయించారనే దానిపై కేంద్రీకరించి ఉంటుంది. ప్రభుత్వం కనుక ఏకపక్షంగా ఒక రంగానికి సంబంధించిన ఖర్చును తగ్గించి వేసినప్పుడు ఆ వివరాలను పార్లమెంటుకు, ప్రజలకు చెప్పాల్సిందే. వాస్తవ గణాంకాలకు బదులు అంతకుముందున్న సవరించిన అంచనాలను మాత్రమే వెల్లడించడం అంటే పార్లమెంటును అగౌరవపరుచడమే.

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తమ బడ్జెట్ ప్రసంగంలో గతేడాదితో పాటు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెవెన్యూ, వ్యయాలను చేర్చలేదు. దీనిపై విస్తృత వ్యాఖ్యానాలు వచ్చాయి. నిజానికి బడ్జెట్ ప్రసంగం అంటేనే ఈ ఆదాయ వ్యయాల లెక్కలు ఉండాలె. పార్లమెంటుకు, సాధారణ ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై తక్షణ అవగాహన కలుగాలె. అయితే బడ్జెట్ ప్రసంగంలో ఈ వివరాలు ఎందుకు లేవనే సందేహాలకు ఆర్థికమంత్రి ఇచ్చిన వివరణ–ఈ లెక్కలన్నీ బడ్జెట్ అనుబంధ పత్రాలలో ఉన్నాయనేది. అనుబంధాలలో ఉన్నందువల్ల తమ బడ్జెట్ ప్రసంగంలో చేర్చలేదనేది మంత్రి సమర్థింపు. కానీ చాలామంది బడ్జెట్ అనుబంధ పత్రాలను పట్టించుకోరు. అందువల్లనే ఆర్థికమంత్రులు బడ్జెట్ ప్రసంగంలో ఆదాయవ్యయాల లెక్కల సంగ్రహ సారాంశాన్ని బడ్జెట్ ప్రసంగ పాఠంలోనే చేరుస్తారు. తాజా బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ఈ ఆదాయవ్యయాల లెక్కలను ఎందుకు చేర్చలేదనే సందేహానికి సమాధానం ఎట్టకేలకు లభించింది. ఈ అనుబంధ పత్రాలలోని ఆదాయవ్యయాల వివరాలు తప్పుదోవ పట్టించేవిగానే కాదు, తప్పుల తడకగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంతోపాటు గతేడాది వివరాలు కూడా తప్పుగానే ఉన్నాయి.

బడ్జెట్ ప్రసంగ పాఠం అనుబంధంలో తప్పులున్నాయనడానికి ఆధారం 2018–19 ఆర్థిక సర్వేనే. ఇందులోని రెండవ సంపుటిలో గణాంకాల అనుబంధం ఉన్నది. ఇందులోని ఏ 59 పుటలో గల 2.5 పట్టికలో కేంద్ర ప్రభుత్వ ఆదాయ వ్యయాల లెక్కలున్నాయి. పట్టిక చివరి కాలంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ సొంత లెక్కల ప్రకారమే 2018–19 సంవత్సర తాత్కాలిక లెక్కలను చేర్చారు. నిజానికి సర్వే నివేదికను ఫిబ్రవరి లేదా మార్చిలో కాకుండా జూలై ఇచ్చారు. అందువల్ల 2019 మార్చి 31 వరకు ముగిసే ఆర్థిక సంవత్సరపు వాస్తవిక ఆదాయ, వ్యయ వివరాలను అందించవచ్చు. ఈ వివరాలు సీఏజీ కార్యాలయం నుంచి తీసుకున్నవి. కనుక సరైనవని భావించవచ్చు. అయితే ఈ గణాంకాలను పోల్చిచూస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. బడ్జెట్ ప్రసంగంలోని ఆదాయ వ్యయ వివరాలు తప్పుల తడకగా ఉన్నాయి. 2018–19 లెక్కలను సవరించిన అంచనాలుగా చూపించారు. అయితే ఆర్థిక సర్వేతో పోల్చి చూసినప్పుడు, ప్రభుత్వ అంచనాలు, వాస్తవిక ఆదాయ వ్యయాలు సరైనవిగా లేవు. ఈ బడ్జెట్ అనుబంధంలోని గణాంకాలు అదే ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి వస్తాయి కనుక ఈ పొంతన కుదరకపోవడం ఆశ్చర్యకరం. పైగా ఈ తేడా భారీగా ఉన్నది. బడ్జెట్ ప్రసంగ పాఠంలో ఈ ఆదాయ వ్యయ వివరాలను చేర్చకపోవడానికి ఇదే కారణమా?

కేంద్ర ట్యాక్స్ రెవెన్యూలలో తేడా ఎక్కువగా ఉన్నది. సవరించిన అంచనాల కన్నా ఈ వివరాలు 1,65,176 కోట్ల మేర తక్కువగా ఉన్నాయి. ఇది మొత్తం ట్యాక్స్ రెవెన్యూ సవరించిన అంచనాలో పదమూడు శాతం తేడా! ప్రభుత్వ ట్యాక్స్ రెవెన్యూ ఎందుకింత తక్కువగా ఉండటానికి కారణం– జీఎస్టీ వసూళ్ళలో తగ్గుదల. ఈ లోటును భర్తీ చేయడానికి కేంద్రం పొదుపు చర్యలను చేపట్టింది. మొత్తం వ్యయ సవరించిన అంచనా 1,45,813 కోట్లు అంటే 13.4 శాతం. అంటే బడ్జెట్ జీడీపీలో ఒక శాతం మేర కుంచించుకుపోయింది. కానీ బడ్జెట్ వివరాలలో ఈ అంశాలు లేవు. పార్లమెంటుకు కానీ, సాధారణ ప్రజలకు కానీ వాస్తవాలను వెల్లడించలేదు. ఈ వ్యవహారసరళి అనేక సంక్లిష్టతలకు దారి తీస్తుంది. సవరించిన అంచనాలో 10,963 కోట్లుగా చెప్పిన దానికన్నా ఆర్థిక లోటు ఎక్కువగా ఉన్నది. జీడీపీలో 3.3 శాతమని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి 3.45 శాతంగా తెలుస్తున్నది. తాత్కాలిక గణాంకాలతో పోల్చినప్పుడు 2018–19 సవరించిన అంచనాలేవీ పొంతన కుదరవు. ఇది ప్రభుత్వం పెట్టే ఖర్చు తీరుపై ప్రభావం చూపుతుంది. అందుకే గతేడాది పన్ను వసూళ్ళు తగ్గే కొద్దీ వివిధ వ్యయాలలో కోతలు పడ్డాయి. జీఎస్టీ అమలు ఎంత అధ్వాన్నంగా ఉన్నదో దీనివల్ల తెలుస్తున్నది. అయితే ప్రభుత్వం జీఎస్టీ వసూళ్ళు తగ్గిన నేపథ్యంలో ఏయే పద్దులలో కోత పెట్టిందో పార్లమెంటుకు, ప్రజలకు చెప్పలేదు.

ప్రభుత్వ ఆదాయవ్యయాల వివరాలను పార్లమెంటుకు, ప్రజలకు వెల్లడించాల్సిందే. పార్లమెంటు బడ్జెట్‌ను ఆమోదించే ముందు సవివర చర్చ సాగుతుంది. ఈ చర్చ ప్రధానంగా ఏ రంగానికి ఎంత కేటాయించారనే దానిపై కేంద్రీకరించి ఉంటుంది. ప్రభుత్వం కనుక ఏకపక్షంగా ఒక రంగానికి సంబంధించిన ఖర్చును తగ్గించి వేసినప్పుడు ఆ వివరాలను పార్లమెంటుకు, ప్రజలకు చెప్పాల్సిందే. వాస్తవ గణాంకాలకు బదులు అంతకుముందున్న సవరించిన అంచనాలను మాత్రమే వెల్లడించడం అంటే పార్లమెంటును అగౌరవపరుచడమే. పార్లమెంటుకు, ప్రజలకు అబద్ధాలు చెప్పడమే. ప్రభుత్వం ఇదేవిధంగా తప్పుల తడకలుగా బడ్జెట్ పత్రాలను రూపొందిస్తూ పోతే ప్రభుత్వం మీద విశ్వాసం తగ్గుతుంది. ప్రభుత్వం వాస్తవాలను దాచి పెట్టడం మంచిది కాదు. దీనివల్ల ఇక ప్రభుత్వం చెప్పే లెక్కలను నమ్మే పరిస్థితి ఉండదు. ఇది చాలా ప్రమాదకర పోకడ. ప్రభుత్వం గత బడ్జెట్ వ్యయానికి సంబంధించిన వాస్తవాలను దాచి పెడుతున్నది. దీనివల్ల ప్రజలకు సందేహాలు కలుగుతాయి. ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని అంచనాలను నమ్మవచ్చా అనే సందేహాలు తలెత్తుతాయి. ప్రభుత్వం తాత్కాలిక వాస్తవిక లెక్కలను మనం ఆమోదించినట్టయితే తాజా 2019– 20 బడ్జెట్‌లోని రెవెన్యూ పెంపుదల ప్రతిపాదనలు ఆశాజనకంగా కనిపిస్తాయి. కానీ అవి వాస్తవాలు కాదు. ప్రభుత్వం చెబుతున్న ప్రకారమే అయితే–ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రెవెన్యూల పెరుగుదల 25.3 శాతం ఉండాలె. అంటే గతేడాది కన్నా నాలుగు లక్షల కోట్ల మేర ఉండాలె. నామమాత్ర జీడీపీ పెరుగుదల 12 శాతంగా భావిస్తే ఈ లెక్కలు సరిపోతాయి. కానీ అది సాధ్యం కాదు. ఎప్పుడైతే ప్రభుత్వం చెబుతున్న ఆదాయం లక్ష్యాన్ని చేరుకోదో, అప్పుడు ఏడాది మధ్యలో నిధుల కొరత ఏర్పడుతుంది. ఈ కొరత మూలంగా వివిధ రంగాలకు చేసిన కేటాయింపులలో కోతలు పెట్టకతప్పదు. అయితే ఆ కోతలను బయటకు చెప్పరు. దానికి పార్లమెంటు ఆమోదం ఉండదు.

కేంద్ర ప్రభుత్వ ఆదాయం తక్కువగా ఉండటం వల్ల మరో విషయం వెల్లడవుతున్నది. జీడీపీ లెక్కలపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. కొత్తగా వెల్లడించిన గణాంకాల ప్రకారం– గతేడాది మొత్తం ట్యాక్స్ రెవెన్యూలు 9.2 శాతం మాత్రమే పెరిగాయి. ప్రభుత్వం చెప్పిన 11.3 శాతం పెరుగుదల కన్నా ఇది చాలా తక్కువ. ఈ తగ్గుదలకు కారణం పరోక్ష పన్నులే. అంటే జీఎస్టీయే కారణం. పరోక్ష పన్ను ఆదాయం పెరుగుదల రేటు ఇంకా తక్కువగా ఉండి ఉంటుంది. సాధారణంగా పరోక్ష పన్నులు నామమాత్ర జీడీపీకి అనుగుణంగా ఉంటాయి. టర్నోవర్‌ను ప్రతిఫలిస్తాయి. అయితే పన్ను ఎగవేత హటాత్తుగా పెరిగిందా? లేక జీడీపీ అంకెలపై వెల్లడైన సందేహాలు సరైనవేనా? తక్కువ ట్యాక్స్ రెవెన్యూ అంకెలు ప్రమాద హెచ్చరికను సూచిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే రెవెన్యూలు కూడా ఆశించిన దానికన్నా చాలావరకు పడిపోయి ఉంటాయి. ఈ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలలో సంక్షోభాన్ని సృష్టిస్తుంది. కేంద్ర పన్నులు, జీఎస్టీ రెవెన్యూల నుంచి వచ్చే వాటా ఆధారంగా రాష్ర్టాలు తమ బడ్జెట్‌లను తయారు చేసుకుంటాయి. ఏదేమైనా గతేడాది తక్కువగా వచ్చిన పన్ను వివరాలు చాలా ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆర్థిక మంత్రిత్వశాఖ ఈ సందేహాలను తీర్చాలె. అవసరమైతే ఆదాయ వ్యయాల అంచనాలను సవరించుకొని కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టాలె.

**కేంద్ర ప్రభుత్వ ఆదాయం తక్కువగా ఉండటం వల్ల మరో విషయం వెల్లడవుతున్నది. జీడీపీ లెక్కలపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. కొత్తగా వెల్లడించిన గణాంకాల ప్రకారం- గతేడాది మొత్తం ట్యాక్స్ రెవెన్యూలు 9.2 శాతం మాత్రమే పెరిగాయి. ప్రభుత్వం చెప్పిన 11.3 శాతం పెరుగుదల కన్నా ఇది చాలా తక్కువ. ఈ తగ్గుదలకు కారణం పరోక్ష పన్నులే. అంటే జీఎస్టీయే కారణం. పరోక్ష పన్ను ఆదాయం పెరుగుదల రేటు ఇంకా తక్కువగా ఉండి ఉంటుంది. సాధారణంగా పరోక్ష పన్నులు నామమాత్ర జీడీపీకి అనుగుణంగా ఉంటాయి. టర్నోవర్‌ను ప్రతిఫలిస్తాయి. అయితే పన్ను ఎగవేత హటాత్తుగా పెరిగిందా? లేక జీడీ పీ అంకెలపై వెల్లడైన సందేహాలు సరైనవేనా? తక్కువ ట్యాక్స్ రెవెన్యూ అంకెలు ప్రమాద హెచ్చరికను సూచిస్తున్నాయి.**

(వ్యాసకర్త: జవహర్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్)

'ది వైర్' సౌజన్యంతో...

**సినిమా**



**అల్లాణి శ్రీధర్**

# మన సినీపరిశ్రమకు మంచిరోజులు

ఉద్ధృతంగా కొనసాగి ఘన విజయం సాధించే ఏ ఉద్యమమైనా ఒక మొదటి అడుగుతోనే మొదలవుతుంది. అడుగడుగునా అవమానాలు, వివక్ష ఎదుర్కొంటూ ఆత్మగౌరవం కాపాడుకునే క్రమంలో సుదీర్ఘ పోరాటం చేసిన వ్యక్తి, ఆ తొలి అడుగు వేసిన శక్తి అయితే, ఆ విజయ ప్రయోజనం వ్యక్తిగతం కాకుండా సామాజికం అవుతుంది. అది అందరికీ ఉపయోగపడుతుంది. మా ఉద్యమ భాగస్వామి –ప్రతిభ గల చలన చిత్ర దర్శకుడు ఎన్.శంకర్‌కు స్టూడియో నిర్మాణం కోసం ఐదెకరాల స్థలం కేటాయిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం అని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. అప్పుడు తెలంగాణ రాష్ట్రంలో సినిమా అభివృద్ధిని కాంక్షించే ప్రతి వారికి ఎంతో సంతోషం కలిగింది.

ఎన్.శంకర్! పెద్ద హీరోలతో సక్సెస్ ఫుల్ సినిమాలకు దర్శకుడు. దార్శనికుడు కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రభావితుడయ్యాడు. నాడు సినిమారంగంలో తనకున్న సంబంధ బాంధవ్యాలను, బంగారు భవిష్యత్తును కాదనుకొని, ప్రజల ఆకాంక్షను దిక్కులు పిక్కటిల్లేలా 'జై బోలో తెలంగాణ' అని నినదించాడు. తనే నిర్మాతగా మారాడు. వర్తమాన ఉద్యమమే ప్రధాన కథాంశంగా 'జైబోలో తెలంగాణ' చిత్రాన్ని ఒక ఉద్యమంలా నిర్మించాడు.

'రాష్ర్టాలుగా విడిపోదాం–అన్నదమ్ములుగా, గౌరవంగా బతుకుదాం' అని చాటిచెప్పిన 'జై బోలో తెలంగాణ' అనేక అవరోధాలను దాటుకొని ఉద్యమ నాయకుని ప్రోత్సాహంతో విడుదలై ఘనవిజయం సాధించింది. ఆ సమయంలో శంకర్ స్నేహితులు ఆందోళనపడ్డారు, అవతలివాళ్లు అడ్డుపడ్డారు. అయినా తనదైన చెరగని చిరునవ్వుతో శంకర్ తన సంకల్పం సఫలీకృతం అయ్యేదాకా పట్టిన పట్టు విడువలేదు. అది అతనిలో ఉన్న స్వాభావిక లక్షణం. తనమొదటి సినిమాలో కూడా సమాజంలో రగులుతున్న సమస్యనే ప్రధాన కథాంశంగా తీసుకున్నాడు.

'ఎన్‌కౌంటర్! ఎన్.శంకర్' అంటే 'ఎన్‌కౌంటర్ శంకర్' అన్నంతగా ఆ సినిమా పెద్ద హిట్టయింది. సూపర్‌స్టార్ కృష్ణకు ఒక సరికొత్త ఇమేజ్ తీసుకొచ్చింది. ఆ కథ చేస్తానన్న నిర్మాత ఆలస్యం చేస్తే ఆ కథనే తీస్తాను తప్ప ఇంకో సినిమా చేయనని పట్టుపట్టాడు. దర్శకుడిగా అవకాశాలు వచ్చినా వద్దనుకొని సహకార దర్శకుడిగానే కొనసాగాడు. ఆ పట్టుదల చూసి హీరో కృష్ణ ఆ సినిమా నిర్మించారు. గ్రామీణ మధ్యతరగతి నేపథ్యమైనా సాహిత్యం పట్ల అభిరుచి వివిధ సామాజికాంశాల గురించి చేసిన అధ్యయనం శంకర్‌కు ప్రపంచాన్ని, ప్రపంచానికి శంకర్‌ను పరిచయం చేసింది. అధ్యయనమే ఆ తర్వాత రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌తో తాను రూపొందించిన శ్రీరాములయ్య సినిమాకు ప్రేరణగా నిలిచింది. లార్జర్ దేన్ లైఫ్ లాంటి ఆ బయోపిక్‌ను చిన్న వయసులోనే డైరెక్ట్ చేసి సమాజం, సాహిత్యమే కాదు, సినిమా కళకు సంబంధించిన నైపుణ్యాన్ని ప్రతిభను ప్రదర్శించారు.



ఉత్తమ దర్శకుడిగా, ఉత్తమ జాతీయ సమగ్రత చిత్రదర్శకుడిగా ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డ్స్ అందుకోవడమే కాకుండా అనేక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డు కమిటీలకు చైర్మన్‌గా జ్యూరీ మెంబర్‌గా అత్యుత్తమ సేవలు అందించారు. వివాదాలకు ఆస్కారం ఉండే సినిమా పరిశ్రమకు చెందిన సంఘాలకు, సమాఖ్యలకు వివాదరహితుడిగా (అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా వివిధ హోదాల్లో) సమర్థవంతంగా పనిచేశాడు. ప్రస్తుతం తెలుగు దర్శకుల సంఘం ప్రెసిడెంట్‌గా–నాయకత్వం వహిస్తున్నారు. ఇదంతా శంకర్ సంకల్పబలాన్ని, సమర్థవంతమైన ఆచరణాత్మక కార్యశీలతను సూచిస్తాయి.

మన రాష్ట్రంలో అందరికీ ముఖ్యంగా తెలంగాణ యువతకు అందుబాటులో ఉండేవిధంగా స్టూడియో ఉంటే బాగుంటుందన్న కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా స్టూడియో నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఆ వెంటనే విదేశాల్లో ఉన్న స్టూడియోల నిర్మాణాన్ని అవలంబిస్తున్న ఆధునిక రీతులను ఆకళింపు చేసుకున్నాడు. స్టూడియో నిర్వహిస్తున్న అనేక మంది పెద్దలను వాటిని ఉపయోగిస్తున్న దర్శకనిర్మాతలను కలిసి వారి సాధకబాధకాలను కూలంకషంగా చర్చించారు. ఫ్లోర్స్ నిర్మాణాల్లో స్థలం వినియోగానికి ఎలాంటి పద్ధతులను పాటించాలి, దర్శకనిర్మాతలకు వారి బడ్జెట్‌కు అనుగుణంగా ఏ రకంగా సేవలందించాలన్న విషయాల్లో ఆయన కు ఒక స్పష్టత ఉన్నది.

'దేశమంటే మట్టికాదు' అన్నట్టు స్టూడియో అంటే ఎత్తయిన గోడలు మార్చుకునే సెట్టింగులు కాదు, సినిమా రంగంలో మార్పులు తీసుకొచ్చే ఒక చలనచిత్ర విధానం అని కేసీఆర్‌కు తెలుసు, ఆయన ఆలోచనలను అభిమానించి అర్థం చేసుకున్న శంకర్‌కు తెలుసు. దర్శకుల కలలు, నిర్మాతల అభిరుచులు, ఆర్టిస్టులు టెక్నీషియన్స్‌కు కావాల్సిన సౌకర్యాల గురించి వారితో కలిసి పని చేసిన అనుభవంతో అర్థం చేసుకొని డిజైన్ చేస్తున్నారు. శంకర్ స్టూడియో అంటే అది మన స్టూడియో అని అనుకునేవిధంగా తెలంగాణ యువతకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించడమే కాకుండా వారికి తగినవిధంగా గైడెన్స్ కూడా ఇస్తానంటున్నారు. ఎందుకంటే తనకు బాధలు తెలుసు, బాధ్యతలు తెలుసు.

ఏదేమైనా సినిమా పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా శంకర్ స్టూడియోతో తొలి అడుగు పడిందనే అనుకుంటున్నాను. నల్లగొండ నుంచి వచ్చిన ఒక సామాన్యుడు, అసామాన్యుడు అయ్యాడు. తన కార్యసాధనతో అద్భుతంగా స్టూడియో నడిపి ఎందరికో ఆదర్శమవుతాడనే నమ్మకం నాకున్నది. అన్ని భాషల నిర్మాణాలకు అనువైన ప్రాంతంగా ఒక సినీ హబ్‌గా ఎంతో అవకాశం ఉన్న మన హైదరాబాద్ నగరంలో ఆధునిక హంగులతో, సాంకేతిక పరిజ్ఞానంతో ఒక విజనరీ సారథ్యంలో సరికొత్త స్టూడియో అందరికీ అందుబాటులోకి రావడం అందరూ హర్షించాల్సిన విషయం. తెలంగాణ సినిమా పరిశ్రమ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సగౌరవంగా ధన్యవాదాలు తెలుపుతున్నది.

జై బోలో కేసీఆర్!

**ఏదేమైనా సినిమా పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా శంకర్ స్టూడియోతో తొలి అడుగు పడిందనే అనుకుంటున్నాను. నల్లగొండ నుంచి వచ్చిన ఒక సామాన్యుడు, అసామాన్యుడు అయ్యాడు. తన కార్యసాధనతో అద్భుతంగా స్టూడియో నడిపి ఎందరికో ఆదర్శమవుతాడనే నమ్మకం నాకున్నది. అన్ని భాషల నిర్మాణాలకు అనువైన ప్రాంతంగా ఒక సినీ హబ్‌గా ఎంతో అవకాశం ఉన్న మన హైదరాబాద్ నగరంలో ఆధునిక హంగులతో, సాంకేతిక పరిజ్ఞానంతో ఒక విజనరీ సారథ్యంలో సరికొత్త స్టూడియో అందరికీ అందుబాటులోకి రావడం అందరూ హర్షించాల్సిన విషయం.**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.





మంగళవారం ఖమ్మం నగరంలో టీఆర్ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్


ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో సభ్యత్వ రసీదులు అందజేస్తున్న డీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ జీ నగేశ్


సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో టీఆర్ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు

# చురుగ్గా సభ్యత్వాలు

- టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు విశేష ఆదరణ
- ఆసక్తి చూపుతున్న అన్ని వర్గాల ప్రజలు


గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి నుంచి సభ్యతాన్ని అందుకుంటున్న టీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జయకృష్ణ తదితరులు


కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతున్నది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, సభ్యత్వ నమోదు ఇంచార్జీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, ఇతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సభ్యత్వ నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. సామాన్య ప్రజలు సైతం టీఆర్ఎస్ సభ్యత్వాలను తీసుకుంటున్నారు. ఎక్కడ చూసిన సభ్యత్వ నమోదు కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతున్నది. మంగళవారం కరీంనగర్‌లోని 23వ డివిజన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున సభ్యత్వాలు తీసుకున్నారు. హుజూరాబాద్‌లో సభ్యత్వ నమోదు ఇంచార్జి బస్వరాజ్ సారయ్య పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా మల్యాల, కొడిమ్యాలలో చొప్పదండి ఇంచార్జి గూడూరి ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ నగేశ్ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. మంచిర్యాలలోని 20వ వార్డులో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లిలో ఇంచార్జి అరిగెల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పలువురికి సభ్యత్వాలు అందజేశారు. భీమారం మండలం మద్దికల్‌లో ఇంచార్జి మూల విజయారెడ్డి పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా చర్లపల్లి డివిజన్‌లోని కుషాయిగూడలో టీఆర్ఎస్ నాయకులు శివకుమార్‌గౌడ్, నాగిళ్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి కంచర్ల చంద్రశేఖర్ రెడ్డిలతో కలిసి నగర మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొన్నారు. ఖమ్మంలోని పలు వార్డుల్లో చేపట్టిన సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**పాలమూరులో..**

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం లోకిరేవు గ్రామంలో మంగళవారం చేపట్టిన టీఆర్ఎస్ సభ్యత్వాల నమోదులో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, కల్వకుర్తిలోని బలరాంనగర్, గచ్చుబావి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా స్వాతంత్ర్య సమరయోధుడు పెంటమరాజు సుదర్శన్‌రావు టీఆర్ఎస్ క్రియాశీల సభ్యత్వాన్ని తీసుకున్నారు. నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం చందూర్, కారేగాం, లక్ష్మాపూర్, మేడిపల్లి, ఘన్‌పూర్‌లో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, కామారెడ్డిలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీగౌడ్ పాల్గొన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, యాదగిరిగుట్ట, మోటకొండూర్, ఆలేరు, ఆత్మకూరు(ఎం), బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, గుండాల మండలాల్లో సభ్యత్వ నమోదు ఇంచార్జి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు పెంటమరాజు సుదర్శన్‌రావు


కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సభ్యత్వ నమోదు రసీదు ఇస్తున్న సభ్యత్వ నమోదు ఇంచార్జి బస్వరాజు సారయ్య


నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ


కరీంనగర్‌లోని 23వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్


జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో టీఆర్ఎస్ సభ్యత్వాలు అందజేస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సభ్యత్వాలను అందజేస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఇంచార్జి అరిగెల


యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకిలో సభ్యత్వం అందజేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## కీచక హెచ్ఎం శంకర్‌రెడ్డి అరెస్ట్



**కూసుమంచి:** విద్యార్థునుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు ఖమ్మం జిల్లా కూసుమంచి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బెజవాడ శంకర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం రూరల్ ఏసీపీ రామోజీ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌రెడ్డి కూసుమంచి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులను తన గదికి పిలిపించి అసభ్యంగా ప్రవర్తించినట్టు గత ఫిబ్రవరి 2న ఇద్దరు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శంకర్‌రెడ్డిపై కేసునమోదు చేశారు. అప్పటి డీఈవో శంకర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. కాగా అప్పటినుంచి శంకర్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. కూసుమంచిలో ఒక వ్యక్తిని కలిసేందుకు వచ్చిన శంకర్‌రెడ్డిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

## ఎస్సార్ కళాశాలలో పీజీడీఎం కోర్సు

**వరంగల్ అర్బన్ జిల్లా, (హసన్‌పర్తి):** వరంగల్‌అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో పీజీడీఎం కోర్సును ప్రవేశపెట్టారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నూతనంగా ప్రవేశపెట్టిన పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్నోవేటివ్ డిప్లామా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) కోర్సును మంగళవారం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, స్మార్ట్ ఇండియా హాకథాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మోహిత్‌గంభీర్ ప్రారంభించి, సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సార్ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రిన్యూర్ షిప్, వెంచర్ డెవలప్‌మెంట్ సీఈవో శ్రీదేవిదేవిరెడ్డి, పీజీడీఎం కోర్సు డీన్ బి.ఎస్.రావు, నరేడ్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, కలెక్టర్ హరిత

**వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పట్టణాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పరకాల పట్టణంలో చిరు వ్యాపారుల కోసం ప్రభుత్వం కోటి రూపాయలతో నిర్మించిన భవన సముదాయాలను ప్రారంభించారు. పరకాల మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి సమీక్షించారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి చేసేందుకు డబ్బులు వెచ్చించడానికి ఇబ్బంది లేదన్నారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి పరకాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొస్తానన్నారు. దళిత కాలనీల్లో సమస్యలు ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని.. ఈనెల 15లోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. నియోజకవర్గ స్థాయి జాబ్‌మేళాను నిర్వహించాలని డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావును ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా హరితహారాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని.. ప్రజల కోరిక మేరకు ఇంటింటికి మొక్కలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ హరిత, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు సురేశ్, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి పాలమూరుకు సాగునీరు

ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి


మహబూబ్‌నగర్ జిల్లా నిజలాపూర్‌లో సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:** సీఎం కేసీఆర్ చొరవతోనే ఉమ్మడి పాలమూరుకు సాగునీరు అందుతున్నదని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. సమైక్య పాలనలో సాగునీటి కోసం రైతులు ఎన్నో కష్టాలు పడ్డారని చెప్పారు. అప్పటి నేతలు కృష్ణానది నీళ్లు పొలాల్లోకి వచ్చే పరిస్థితి లేదని ప్రజలను మోసగించారని పేర్కొన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం నిజాలాపూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఎంజీకేఎల్ఐ ద్వారా ఎగువన ఉన్న భూభాగానికి సైతం కృష్ణానీరు అందించారని చెప్పారు. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెంచినట్టు తెలిపారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాలకు జాతీయహోదా కావాలని కోరినా కేంద్రం స్పందించలేదని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పేదల ఆకలితీర్చేందుకే రూ.5 భోజనం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ముస్తాబాద్ చౌరస్తాలో సామాన్యులతోకలిసి భోజనం


సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

**కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వం, హరేరామ హరే కృష్ణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రూ.5 భోజన కేంద్రాన్ని ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు మంగళవారం సందర్శించారు. అనంతరం పలువురితో కలిసి భోజనం చేశారు. భోజనం ఎలా ఉంది? అని అక్కడున్న వారిని అడిగారు. 'వివిధ పనుల నిమిత్తం వస్తున్న మాకు తక్కువ ధరకే కడుపు నిండా భోజనం పెడుతున్నారు. మీ కడుపు సల్లంగా ఉండాలె సార్' అంటూ అక్కడ తింటున్న వారు చెప్పారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నో పనుల కోసం వచ్చే పేద ప్రజలకు ఇబ్బంది కలుగొద్దనే ఐదు రూపాయలకే భోజనం ఏర్పాటు చేశామన్నారు. హరే రామ హరే కృష్ణ వారి సౌజన్యంతో సిద్దిపేటలోని మార్కెట్ యార్డులో సద్దిమూట, ప్రభుత్వ దవాఖానలో భోజనమృతం పథకం ఏర్పాటు చేశామన్నారు. ముస్తాబాద్ చౌరస్తాలోనూ భోజన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజల కోసం మరిన్ని కేంద్రాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు.

## టీఆర్ఎస్ ఎంపీటీసీ కిడ్నాప్

మావోయిస్టుల దుశ్చర్య

అడ్డుకోబోయిన భార్యను నెట్టేసి, కుమారుడిపై దాడిచేసి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీ కొత్తూరులో ఘటన

**చర్ల రూరల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పెద్దమిడిసిలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని సీ కొత్తూరు టీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యుడు నల్లూరి శ్రీనివాసరావును సోమవారం రాత్రి మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు 2014లో ఎంపీటీసీగా ఎన్నికకాగా ఆగస్టు 5 వరకు పదవీకాలం ఉన్నది. దాదాపు 15 నుంచి 20 మంది మావోయిస్టులు సోమవారం రాత్రి 10.15 గంటల సమయంలోశ్రీనివాస్‌రావు ఇంటి తలుపులు కొట్టారు. తలుపు తీయగానే.. తుపాకులు, కర్రలతో లోపలికి ప్రవేశించి శ్రీనివాస్‌రావును బయటకు లాక్కెళ్లారు. అడ్డుకోబోయిన శ్రీనివాసరావు భార్య దుర్గను బయటకు నెట్టేశారు. కుమారుడు ప్రవీణ్‌కుమార్‌పై దాడి చేశారు. వరండాలోని బైక్‌ను తీసుకెళ్లారు. నల్లూరి శ్రీనివాసరావును మావోయిస్టులు కిడ్నాప్ చేశారనే వార్త తెలియగానే మంగళవారం తెల్లవారుజాము నుంచే సీ కొత్తూరు పరిసర గ్రామాల ప్రజలు, భారీగా తరలివచ్చి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. శ్రీనివాసరావును మావోయిస్టులు క్షేమంగా వదిలిపెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అపహరణకు గురైన శ్రీనివాసరావు ఎప్పుడు ఎవరికీ ఏ హానీ తలపెట్టలేదని అతని భార్య దుర్గ, కొడుకు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## చిరుత దాడిలో లేగదూడ మృతి

**లింగంపేట:** కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని సురాయిపల్లి గ్రామ శివారులో చిరుతదాడిలో లేగదూడ మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన శంకర్‌శర్మ లేగదూడ సోమవారం సాయంత్రం మేతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో మంగళవారం ఉదయం వెతుకగా అటవీ ప్రాంతంలో కళేబరం కనిపించింది.

## వరంగల్ రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

**ఖిలావరంగల్:** వరంగల్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన ఎండు గంజాయి ప్యాకెట్లను మంగళవారం రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే సీఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఎస్సై పరశురాములు, హెడ్‌కానిస్టేబుల్ సమ్మిరెడ్డి, పీసీ కిరణ్‌కుమార్ సాధారణ తనిఖీలు చేపడుతుండగా.. మూడోనంబర్ ప్లాట్‌ఫాం చివర చీర మూటలో గంజాయి కనిపించింది. తహసీల్దార్‌ను రైల్వేస్టేషన్‌కు పిలిపించి పంచనామ నిర్వహించారు. ఐదు ప్యాకెట్లలో పది కిలోల ఎండు గంజాయి కనిపించడంతో సీజ్ చేశారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినయ్‌కుమార్ తెలిపారు.

## రాజన్న ఆలయ ప్రసాదాల విభాగం పరిశీలన

**వేములవాడ, నమస్తే తెలంగాణ:** వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి సన్నిధిలో ప్రసాదాల తయారీ విభాగాన్ని జిల్లా ఇంచార్జి ఆహారభద్రతాధికారి రవీందర్‌రావు మంగళవారం పరిశీలించారు. రాజన్న ప్రసాదంలో సోమవారం బోల్టు వచ్చిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ప్రసాదతయారీలో పూర్తిస్థాయిలో నాణ్యత, పరిశుభ్రత పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రసాదంలో బోల్టు వచ్చిందనే అంశంపై సంబంధిత విభాగం పర్యవేక్షకులు నర్సయ్యను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. ప్రసాదాలు పూర్తిస్థాయిలో పర్యవేక్షణలోనే తయారవుతాయని.. ఎట్టి పరిస్థితిలోనూ వచ్చే అవకాశం లేదని సదరు పర్యవేక్షకులు అధికారికి వివరించారు.

### లడ్డూలో బోల్టు రావడం అవాస్తవం

రాజన్న ఆలయ ప్రసాదంలో నట్‌బోల్టు వచ్చినట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని వారు కోరారు.

మంచిర్యాల జిల్లా చెన్నూర్ నుంచి కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ అధికారులు మంగళవారం బస్సు ప్రారంభించారు. కోటపల్లి మండలం అర్జునగుట్ట- మహారాష్ట్రలోని సిరోంచ మధ్యలో ప్రాణహిత నదిపై వంతెన పూర్తి కావడంతో అధికారులు ఈ బస్సును ప్రారంభించారు. - చెన్నూర్, నమస్తే తెలంగాణ



## న్యూస్‌ప్రింట్‌పై కస్టమ్స్ సుంకాన్ని తొలిగించాలి

కేంద్రానికి భారత వార్తాపత్రికల సంఘం వినతి



**న్యూఢిల్లీ, జూలై 9:** బడ్జెట్‌లో న్యూస్‌ప్రింట్‌పై విధించిన 10 శాతం కస్టమ్స్ సుంకాన్ని తొలిగించాలని భారత వార్తాపత్రికల సంఘం(ఐఎన్‌ఎస్) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అధిక ఖర్చులు, ప్రకటనలపై తక్కువ ఆదాయం, డిజిటల్ ప్రభావం కారణంగా వార్తాపత్రికలు, మ్యాగజైన్ల ప్రచురణకర్తలపై ఇప్పటికే ఆర్థికపరమైన ఒత్తిళ్లు ఉన్నాయని తెలిపింది. దీంతో చిన్న, మధ్య తరహా వార్తాపత్రికలు నష్టాల్లో కూరుకుపోగా కొన్ని మూతపడ్డాయని అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలో వార్తాపత్రికల ముద్రణకు అవసరమైన అన్‌కోటెడ్ పేపర్, మ్యాగజైన్లకు సంబంధించిన లైట్‌వెయిట్ కోటెడ్ (ఎల్‌డబ్ల్యూసీ) పేపర్‌పై బడ్జెట్‌లో విధించిన 10 శాతం కస్టమ్స్ సుంకాన్ని వెనక్కి తీసుకోవాలని కోరింది. దేశంలో ఏటా సుమారు 25 లక్షల టన్నుల న్యూస్‌ప్రింట్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో 10 లక్షల టన్నుల న్యూస్‌ప్రింట్ మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతున్నది. అన్‌కోటెడ్, లైట్‌వెయిట్ కోటెడ్ పేపర్ దేశంలో ఉత్పత్తి కాకపోవడంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది.

## మక్కా పవిత్ర జలాలను తెచ్చుకోవచ్చు!

హజ్ యాత్రికులకు ఎయిర్ ఇండియా సూచన



**న్యూఢిల్లీ:** హజ్ యాత్రకు వెళ్లిన ముస్లింలు అక్కడి నుంచి తిరిగి వచ్చేటప్పుడు మక్కాలో ఉన్న 'జమ్ జమ్' బావి నీటిని తమ లగేజీతోపాటు తెచ్చుకోవచ్చని ఎయిర్ ఇండియా తెలిపింది. సెప్టెంబర్ 15 వరకు ఏ1966, ఏ1964 విమానాల్లో సౌదీ అరేబియా నుంచి భారత్‌కు తిరిగి వచ్చే హజ్ యాత్రికులు ఆ బావి నీటిని తమ లగేజీతో పాటు తెచ్చుకోవద్దని తొలుత సూచించామని, విమానంలో సీట్ల పరిమితిని దృష్టిలో ఉంచుకొని ఈ సూచన చేశామని పేర్కొంది. అయితే తమ నిర్ణయాన్ని మార్చుకున్నామని, యాత్రికులు మక్కా బావి నీటిని తమ వెంట తెచ్చుకోవచ్చని సూచించింది. విమానయాన శాఖ ఆదేశాల ప్రకారం తమ హ్యాండ్ లగేజీలో 100 మిల్లీలీటర్ల కన్నా ఎక్కువ ద్రవపదార్థాన్ని తీసుకురావద్దని పేర్కొంది.

## ఆరేండ్ల బాలుడు.. ఆగకుండా 4,445 పుషప్స్



**న్యూఢిల్లీ:** రష్యాకు చెందిన ఆరేండ్ల బాలుడు ఇబ్రహీం ల్యానవ్ కేవలం రెండు గంటల్లో 3,270 పుషప్స్ కొట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. అతడు ఆగకుండా 4,445 పుషప్స్ కొట్టినప్పటికీ 2 గంటల్లో 3,270 పుషప్స్ కొట్టడం విశేషం. దీంతో ఆ బాలుడికి ఓ అపార్ట్‌మెంట్ బహుమానంగా అందడమే కాకుండా అతడి పేరు రష్యా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ఇటీవల రష్యాకు చెందిన చింగిస్ అనే స్పోర్ట్స్ క్లబ్ పుషప్స్ పోటీలను నిర్వహించింది. ఈ క్లబ్‌కు తన తండ్రితోపాటు కలిసి వెళ్లే ఇబ్రహీం పుషప్స్ శిక్షణ తీసుకున్నాడు. పుషప్స్ పోటీల్లో కొడుకును విజేతగా నిలుపడానికి తండ్రి కూడా సహకారం అందించాడు. దీంతో రాటుదేలిన ఇబ్రహీం పోటీల్లో ఆగకుండా 4,445 పుషప్స్ కొట్టి చరిత్ర సృష్టించాడు.





లోక్‌సభలో వాకౌట్ చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు

# పార్లమెంట్‌ను కుదిపేసిన 'కర్ణాటక'

- రాష్ట్ర పరిణామాలపై చర్చకు పట్టుబట్టిన కాంగ్రెస్
- ప్రజాస్వామ్యానికి బీజేపీ తూట్లు పొడుస్తున్నదని ధ్వజం
- కర్ణాటక అంశం కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమన్న బీజేపీ
- ప్రభుత్వాన్ని నడపడం చేతగాక సభను అడ్డుకుంటున్నదని ఎద్దేవా

**న్యూఢిల్లీ, జూలై 9:** కర్ణాటక సంక్షోభం పార్లమెంట్ ఉభయసభలను కుదిపేసింది. బీజేపీ అనుచిత, దిగుజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపిస్తూ కాంగ్రెస్ లోక్‌సభ నుంచి వాకౌట్ చేసింది. కర్ణాటకలో రాజకీయ పరిణామాలపై జీరో అవర్‌లో చర్చించేందుకు కాంగ్రెస్ లోక్‌సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. అయితే దీనిపై సోమవారమే సభలో చర్చ జరిగిందని, లోక్‌సభ ఉపనేత రాజ్‌నాథ్‌సింగ్ చర్చకు సమాధానమిచ్చారని స్పీకర్ ఓం బిర్లా ఆ తీర్మానాన్ని తిరస్కరించారు. దీంతో కర్ణాటక ప్రభుత్వాన్ని బీజేపీ టార్గెట్ చేసిందని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి ఆరోపించారు. రాజ్‌నాథ్ సింగ్ దీన్ని ఖండించారు. కర్ణాటక అంశం కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమన్నారు. కర్ణాటకలో ప్రభుత్వాన్ని సక్రమంగా నడపడం చేతగాక ఇక్కడ సభకు అంతరాయం కలిగిస్తున్నారని ఎద్దేవాచేశారు. అంతకుముందు కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార పార్టీ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నదని ఆరోపించారు. రాజీనామా చేసిన ఎమ్మెల్యేలకు వసతులు కల్పిస్తూ ప్రత్యర్థి పార్టీలపై అనుచిత, టార్గెట్ రాజకీయాలకు ముగింపు పలకాలని అధీర్ కోరారు. తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కూడా వాకౌట్ చేశారు. డీఎంకే సభ్యులు వారిని అనుసరించారు. బీజేపీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని బీఎస్పీ సభ్యుడు డానిష్ అలీ ధ్వజమెత్తారు.

**లోక్‌సభలో రాహుల్ నినాదాలు**

కర్ణాటక పరిణామాలపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నినాదాలు చేశారు. 17వ లోక్‌సభలో ఆయన నినాదాలు చేయడం ఇదే తొలిసారి. మంగళవారం మధ్యాహ్నం రాహుల్ లోక్‌సభకు వచ్చినప్పుడు కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి కర్ణాటక అంశాన్ని లేవనెత్తారు. వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంతో ఆందోళనకు దిగిన కాంగ్రెస్ సభ్యులతో కలిసి రాహుల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**రాజ్యసభలోనూ రచ్చ**

కర్ణాటక అంశంపై రాజ్యసభలోనూ రచ్చ జరిగింది. ఆ రాష్ట్ర పరిణామాలపై చర్చించాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. గందరగోళం మధ్య సభ బుధవారానికి వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభం కాగానే, కర్ణాటక సంక్షోభంపై చర్చకు వీలుగా మిగతా అంశాలను రద్దు చేయాలని 267 నిబంధన కింద కాంగ్రెస్ సభ్యుడు హరిప్రసాద్ ఇచ్చిన నోటీసును సభ చైర్మన్ వెంకయ్యనాయుడు తిరస్కరించడంతో కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తున్నదన్నారు. తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగుతుండటంతో మధ్యాహ్నం సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తెలిపారు.

# సంకీర్ణ సర్కార్‌కు ఊరట

### ఎమ్మెల్యేల రాజీనామాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోని స్పీకర్

14 మందిలో తొమ్మిది మంది రాజీనామాలు సక్రమంగా లేవని వెల్లడి

నిబంధనల ప్రకారం రాజీనామా చేసిన ఐదుగురితో వ్యక్తిగతంగా భేటీ కావాలని నిర్ణయం

శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కాంగ్రెస్ బహిష్కృత ఎమ్మెల్యే



బెంగళూరులో విధానసభ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

**బెంగళూరు, జూలై 9:** అసెంబ్లీకి రాజీనామా చేస్తూ 14 మంది ఎమ్మెల్యేలు పంపిన లేఖల్లో తొమ్మిది నిర్దేశిత ప్రమాణాల ప్రకారం లేవని స్పీకర్ రమేశ్‌కుమార్ చెప్పారు. వారిని మరోమారు సక్రమమైన పద్ధతిలో రాజీనామా లేఖలు పంపాలని కోరినట్టు తెలిపారు. తాజాగా మరో ఎమ్మెల్యే (కాంగ్రెస్ సభ్యుడు రోషన్ బేగ్) రాజీనామా చేశారని స్పీకర్ చెప్పారు. ఐదుగురు ఎమ్మెల్యేలే నిర్దేశిత ప్రమాణాల ప్రకారం రాజీనామాలు సమర్పించారని తెలిపారు. రాజీనామాలు చేసిన వారిలో 11 మంది కాంగ్రెస్, ముగ్గురు జేడీఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలున్నారు. తానేం చేసినా అది చరిత్రగా మిగిలిపోతుందని, అందువల్ల పొరపాట్లు చేయలేనని స్పీకర్ చెప్పారు. వారాంతపు సెలవు తర్వాత మంగళవారం విధులకు హాజరైన రమేశ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ, తన కార్యాలయానికి 14 మంది ఎమ్మెల్యేల రాజీనామా లేఖలు వచ్చాయని, వాటిలో ఐదు మాత్రమే సరైన పద్ధతిలో ఉన్నాయన్నారు. మిగిలిన తొమ్మిది మంది నిబంధనలను అనుసరించి తమ రాజీనామాలను మళ్లీ సమర్పించాలని స్పష్టం చేశారు. రాజీనామాలు సక్రమంగా ఉన్న ఆ ఐదుగురు ఎమ్మెల్యేలూ తనను వ్యక్తిగతంగా కలుసుకోవాలని చెప్పారు. వారిలో ముగ్గురు ఎమ్మెల్యేలను ఈ నెల 12న, ఇద్దరిని 15న రావాలని ఆదేశించారు. వారి వాదన విన్న తరువాత విచారణకు ఒక తేదీని నిర్ణయించి, సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా తనను కలిసి తమ రాజీనామాలను అందజేయాలని రమేశ్‌కుమార్ చెప్పారు. 'అన్నీ పోస్టల్ పద్ధతుల్లో జరిగితే ఇక నేనెందుకు? నా అవసరమే ఉండదు కదా?' అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల రాజీనామాలపై తాను 'కఠిన నిర్ణయాలు' తీసుకోనున్నట్టు చెప్పారు. ఈ విషయంలో 'నేను రాజ్యాంగం, చట్టం ప్రకారం నిర్ణయం తీసుకుంటాను' అని చెప్పారు. 'నేను రెబల్స్ (ఎమ్మెల్యేలు)తో మాట్లాడలేదు. వారు నా బంధువులు కాదు. రాష్ట్రం వదిలి వెళ్లే ముందు వారు నాకు చెప్పలేదు' అని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. తాను తీసుకునే నిర్ణయానికి తన రాజకీయ అనుబంధం అడ్డంకి కాబోదని స్పీకర్ రమేశ్‌కుమార్ చెప్పారు. 'స్పీకర్ చాంబర్‌లోకి ప్రవేశించిన తరువాత నేను కాంగ్రెస్ సభ్యుడిని కాదు. నేను న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాను. కేవలం నా ప్రజలు, నా బాబా తప్ప ఎవరూ నాపై ఒత్తిడి తేలేరు' అన్నారు.

**బెదరని రెబల్స్**

తమ రాజీనామాలను స్పీకర్ ఆమోదించకున్నా, తమపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరినా.. మహారాష్ట్రలో మకాం వేసిన కాంగ్రెస్-జేడీఎస్‌కు చెందిన రెబల్ ఎమ్మెల్యేలు ఏ మాత్రం బెదిరినట్టు కనిపించలేదు. తాము రాజీనామాలను ఉపసంహరించుకునే ప్రసక్తే లేదన్నారు. తాము స్వచ్ఛందంగానే రాజీనామా చేశామని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర చెప్పారు. రాజీనామాలు సమర్పించిన 14 మందిలో నలుగురు రాష్ట్రంలోనే ఉండగా, పది మంది మాత్రం ముంబై వెళ్లారు. ఈ పది మంది సోమవారం సాయంత్రం ముంబై నుంచి ఓ బీజేపీ నేత నేతృత్వంలో గోవాకు బయలుదేరారని, కానీ వారు మహారాష్ట్రలోని సతారా వరకు వెళ్లి అక్కడి నుంచి మంగళవారం ఉదయం తిరిగి ముంబైకి వచ్చారని వార్తలు వెలువడ్డాయి. అయితే దీంట్లో నిజం లేదని, తాము ముంబైలోనే ఉన్నామని ఒక రెబల్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెబల్స్‌ను సంప్రదించి, వారికి నచ్చజెప్పేందుకు కాంగ్రెస్ ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రాజీనామాలు వెనుకకు తీసుకున్న వారందరికీ రిటర్న్ గిఫ్ట్‌గా మంత్రిపదవినిస్తామని చెప్తున్నారు.

**రోషన్‌బేగ్‌కు సిట్ నోటీసులు**

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణపై ఇటీవల కాంగ్రెస్ నుంచి సస్పెండైన ఎమ్మెల్యే ఆర్ రోషన్‌బేగ్ తాజాగా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తానెక్కడికి వెళ్లడం లేదని, హజ్ కమిటీ చైర్మన్‌గా హజ్ యాత్రికులకు జరుగుతున్న ఏర్పాట్లను చూస్తానన్నారు. మరోవైపు బేగ్ రాజీనామా చేసిన వెంటనే ఐఎంఏ గ్రూప్ పోంజి కుంభకోణాన్ని దర్యాప్తు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆయనకు నోటీసులు జారీ చేసింది. బేగ్‌ను గురువారం తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది.

### మా నాన్న రాజీనామా చేయడం సరైనదే!

రామలింగారెడ్డి కుమార్తె, ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి వ్యాఖ్య

**బెంగళూరు/ముంబై:** కాంగ్రెస్ అసమ్మతి నేత రామలింగారెడ్డి కుమార్తె, ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి సీఎల్పీ భేటీకి హాజరయ్యారు. తన తండ్రి రాజీనామా నేపథ్యంలో సోమవారం యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో ఆమె భేటీ అయ్యారు. తాను రాజీనామా చేసే అంశాన్ని తోసిపుచ్చలేనని పేర్కొనడం గమనార్హం. సంకీర్ణ ప్రభుత్వం నిలబడే విషయం తానేమీ చెప్పలేనన్నారు.

### రెబల్స్‌పై అనర్హత వేటు!

స్పీకర్‌ను కోరిన కాంగ్రెస్



స్పీకర్ రమేశ్ కుమార్‌తో సమావేశమైన కాంగ్రెస్ నేతలు

సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతున్నది. అసెంబ్లీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యేలందరిపై అనర్హత వేటువేయాలని ఆ పార్టీ స్పీకర్‌ను కోరింది. తాజాగా మరో ఎమ్మెల్యే రాజీనామా చేసిన నేపథ్యంలో.. బీజేపీ ధనబలంతో తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతున్నదని ఆరోపించింది. కాంగ్రెస్ నేతలు మంగళవారం జరిగిన సీఎల్పీ భేటీ తర్వాత స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్‌ను కలుసుకున్నారు. రెబల్ ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపు చట్టం కింద అనర్హత వేటు వేయాలని కోరారు. ఓ వైపు నేతలు స్పీకర్‌ను కలుసుకొనేందుకు ప్రయత్నిస్తుండగా, మరో ఎమ్మెల్యే ఆర్ రోషన్‌బేగ్ తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనను కాంగ్రెస్ ఇటీవల సస్పెండ్ చేసింది. స్పీకర్‌ను కలిసిన అనంతరం పీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు మీడియాతో మాట్లాడుతూ, సీఎల్పీలో తీసుకున్న నిర్ణయం మేరకు, రెబల్స్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించామని చెప్పారు. రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీతో చేతులు కలిపారని, అందువల్ల వారికి పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తిస్తుందన్నారు. ఆరేండ్లు వారు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత విధించాలని స్పీకర్‌ను కోరినట్టు మాజీ సీఎం సిద్దరామయ్య చెప్పారు. ఈ నెల 12నుంచి జరుగనున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని రెబల్స్ సహా అందరు ఎమ్మెల్యేలను కోరినట్టు తెలిపారు. రెబల్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపునకు సంబంధించిన ఆధారాలను ఈ నెల 11లోగా సమర్పించాలని స్పీకర్ కాంగ్రెస్ నేతలను కోరినట్టు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రామలింగారెడ్డిపై మాత్రం అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరవద్దని నేతలు నిర్ణయించారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన రామలింగారెడ్డి పార్టీని మాత్రం వీడబోనన్నారు. స్పీకర్‌ను కలువడానికి ముందు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు విధానసభ ఎదుటనున్న గాంధీ విగ్రహం వద్ద గంటసేపు ధర్నా చేశారు. తాజా సంక్షోభం నేపథ్యంలో తొలిసారి జరిగిన సీఎల్పీ భేటీకి.. రాజీనామా చేసిన 11 మంది ఎమ్మెల్యేలు సహా మొత్తం 20 మంది గైర్హాజరయ్యారు. ఆరోగ్య కారణాలతో తాము రావడం లేదని ఏడుగురు ముందే సమాచారం ఇచ్చారు. పార్టీలో నెలకొన్న సంక్షోభ పరిష్కారానికి కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, బీకే హరిప్రసాద్ బెంగళూరు తరలివచ్చారు. వారిద్దరినీ యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ పంపినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

### స్పీకర్ ఏం చేయవచ్చు?

ఎమ్మెల్యేల రాజీనామాలపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎదుట 4 అవకాశాలున్నాయని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు.

- ఆయన ఒక్కొక్క ఎమ్మెల్యేతో విడిగా సమావేశమై, వారి వాదన విని వారి రాజీనామాలను ఆమోదించవచ్చు. అప్పుడు కుమారస్వామి ప్రభుత్వం మైనారిటీలో పడిపోతుంది. అప్పుడు గవర్నర్ రంగంలోకి దిగాల్సి వస్తుంది.
- ఎమ్మెల్యేల రాజీనామాలపై నిర్ణయాన్ని జాప్యం చేసి, వారికి నోటీసులివ్వవచ్చు.
- ఎమ్మెల్యేల రాజీనామాలన్నీ తిరస్కరించవచ్చు. అప్పుడు రాజీనామా చేసిన ఎమ్మెల్యేలందరూ ఆయన నిర్ణయంపై కోర్టుకు వెళ్లడం తప్ప వారికి మరో గత్యంతరం ఉండదు.
- పార్టీ ఫిరాయింపు చట్టం కింద ఆ ఎమ్మెల్యేలను స్పీకర్ అనర్హులుగా ప్రకటించవచ్చు. అప్పుడు కూడా వారు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుంది

# దేశవ్యాప్తంగా సీబీఐ తనిఖీలు

30 కేసుల నమోదు

యూపీ చక్కెర కుంభకోణం కేసులో మాయావతి మాజీ కార్యదర్శి ఇంటిపై దాడి



**న్యూఢిల్లీ:** వివిధ కేసులకు సంబంధించి సీబీఐ మంగళవారం దేశవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని చక్కెర మిల్లుల్లో పెట్టుబడుల ఉపసంహరణ కుంభకోణం కేసులో 2007-12 మధ్య యూపీ సీఎంగా మాయావతి ఉన్నప్పుడు ఆమె కార్యదర్శిగా పని చేసిన నేత్రం, యూపీ రాష్ట్ర చక్కెర సంస్థ ఎండీగా ఉన్న వినయ్ ప్రియా దూబే ఇండ్లపై సీబీఐ దాడులు చేసింది. యూపీ చక్కెర సంస్థ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా లక్నో, దేశ రాజధాని ప్రాంత పరిధిలో 14 చోట్ల తనిఖీలు చేసింది. న్యూఢిల్లీలో ఒక చార్టర్డ్ అకౌంటెంట్, యూపీలోని సహారన్‌పూర్‌లో మరొక వ్యక్తి ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.11 లక్షల నగదును జప్తు చేశారు. దీంతోపాటు అవినీతి, ఆయుధాల అక్రమ రవాణా, నేరపూరిత దుష్ప్రవర్తన అంశాల్లో దేశవ్యాప్తంగా సీబీఐ 30 కేసులు నమోదు చేసింది. మంగళవారం 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని ఢిల్లీ, ముంబై, లక్నో, చండీగఢ్, హైదరాబాద్ సహా 110 కేంద్రాల్లో తనిఖీలు చేశారు. హర్యానా మాజీ సీఎం భూపీందర్‌సింగ్ హుడాకు వ్యతిరేకంగా దాఖలైన కేసు విచారణలో భాగంగా ఢిల్లీలోని జసోలాలో కృష్ బిల్డ్ టెక్ సంస్థ కార్యాలయంపై దాడులు చేశారు. జమ్ముకశ్మీర్‌లో చట్ట విరుద్ధంగా తుపాకీ లైసెన్సులు మంజూరు చేసిన అధికారులపై సీబీఐ రెండు కేసులు నమోదు చేసింది. దేశవ్యాప్తంగా సీబీఐ అధికారులు తనిఖీలు చేయడం ఈ వారం రోజుల్లో ఇది రెండోసారి.

## కోర్టులో లొంగిపోయిన 'దోశ కింగ్'

మరింత సమయం అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు



**చెన్నై, జూలై 9:** హత్య కేసులో దోషిగా తేలిన తమిళనాడుకు చెందిన 'శరవణ భవన్' హోటల్స్ వ్యవస్థాపకుడు 'దోశ కింగ్' పీ రాజగోపాల్(72) మంగళవారం అంబులెన్స్‌లో వచ్చి చెన్నైలోని స్థానిక కోర్టులో లొంగిపోయాడు. మరో దోషి జనార్ధనన్ కూడా మరో అంబులెన్స్‌లో కోర్టుకు వచ్చి లొంగిపోయాడు. వారిద్దరినీ పుజ్హల్ కేంద్ర కారాగారానికి తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. అనారోగ్య కారణాలు చూపుతూ లొంగిపోవడానికి సమయం కావాలన్న రాజగోపాల్ అభ్యర్థనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణతో కూడిన ధర్మాసనం మంగళవారం తిరస్కరించింది. రెండు వివాహాలు చేసుకున్న ఆయనకు మూడో పెళ్లితో అదృష్టం కలిసి వస్తుందని జ్యోతిష్కుడు చెప్పడంతో అసిస్టెంట్ మేనేజర్ కుమార్తెను దీని కోసం బలవంతపెట్టాడు. అంగీకరించని ఆమె ఓ వ్యక్తిని పెళ్లి చేసుకోగా 2001లో అతడ్ని హత్య చేయించాడు. స్థానిక కోర్టు 2004లో రాజ్‌గోపాల్‌తోపాటు మరో 8 మందిని దోషులుగా నిర్ధారించి పదేండ్ల జైలుశిక్ష విధించింది. మద్రాసు హైకోర్టులో బాధితులు అప్పీల్ చేయగా యావజ్జీవశిక్షగా మార్పు చేసింది. దీనిపై రాజగోపాల్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది.

## 2,000 నోటు ముద్రణ వ్యయం రూ.3.53

రూ.500 నోటుకు రూ.2.13

రాజ్యసభలో కేంద్రం వెల్లడి



**న్యూఢిల్లీ:** రూ.2000 నోటును ముద్రించడానికి రూ.3.53 ఖర్చు అవుతున్నదని కేంద్ర ప్రభుత్వం మంగళవారం రాజ్యసభకు తెలిపింది. ఆర్బీఐకి చెందిన 'భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రన్ ప్రైవేట్ లిమిటెడ్' మాత్రమే ముద్రిస్తున్న రూ.2000నోటుకు 2017-18లో రూ.4.18 ఖర్చుయ్యిందని, 2018-19 నాటికి ఈ ఖర్చు రూ.3.53కు తగ్గిందని పేర్కొంది. అదే విధంగా రూ.500 నోటు ముద్రణకు 2017-18లో రూ.2.39 ఖర్చు కాగా, 2018-19 నాటికి రూ.2.13కు తగ్గిందని వెల్లడించింది. రూ.200 నోటు ముద్రణకు 2017-18లో రూ.2.24 ఖర్చు అయ్యిందని, 2018-19 నాటికి ఈ ఖర్చు రూ.2.15కు తగ్గిందని తెలిపింది. రూ.500, రూ.200 నోట్లను 'సెక్యూరిటీ ప్రింటింగ్, మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' కూడా ముద్రిస్తున్నదని కేంద్రం వెల్లడించింది. ఇక్కడ ముద్రణ అయ్యే రూ.500 నోటుకు 2017-18లో రూ.3.375 ఖర్చు కాగా 2018-19లోనూ అంతే ఖర్చు అవుతున్నదని పేర్కొంది. రూ.200 నోటుకు 2017-18లో రూ.3.12 ఖర్చు కాగా 2018-19 లోనూ అంతే ఖర్చవుతున్నదని తెలిపింది.

## పునఃప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర

ఉత్కంఠ మధ్య తరలిన 9వ బృందం

మంచు లింగాన్ని దర్శించుకున్న లక్షకుపైగా భక్తులు

**జమ్ము:** ఉత్కంఠ మధ్య అమర్‌నాథ్ యాత్ర మంగళవారం పునఃప్రారంభమైంది. 5,964 మంది భక్తులతో కూడిన 9వ బృందం జమ్ము బేస్ క్యాంపు నుంచి గట్టి భద్రత మధ్య తరలివెళ్లింది. హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌లో మరణించి మూడేండ్లైన సందర్భంగా వేర్పాటువాదుల బంద్ పిలుపుతో అమరనాథ్ యాత్రకు సోమవారం బ్రేక్ పడింది. కొత్త బృందం తరలింపుపై మంగళవారం ఉత్కంఠ నెలకొంది. జూలై 1న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర 47 రోజులపాటు కొనసాగనుంది. సోమవారం నాటికి 1,11,655 మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

## వరదలో బైక్‌తోపాటు కొట్టుకుపోయిన జంట

**నవీ ముంబై, జూలై 9:** జోరుగా వెళ్తున్న వరదనీటిలోనూ వంతెన మీదుగా వెళ్లడానికి సాహసించిన యువ దంపతులు తాము ప్రయాణిస్తున్న బైక్‌తోపాటు కొట్టుకుపోయారు. ఈ దుర్ఘటన నవీ ముంబైలో చోటు చేసుకుంది. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నవీ ముంబై పరిధిలో 'గడి' నది నుంచి వరద పోటెత్తింది. ఆ నదిపై నిర్మించిన వంతెన మీదుగా వరద ప్రవహిస్తున్నది. ఆ వంతెన మీదుగా దాటేందుకు ఓ జంట ప్రయత్నించింది. కానీ అకస్మాత్‌గా పెరిగిన వరదలో బైక్‌తోపాటు ఆ జంట కొట్టుకుపోయింది. గల్లంతైన దంపతుల కోసం గాలింపు చేపట్టారు.

## మహారాష్ట్ర యూనివర్సిటీలో..
# ఆరెస్సెస్ గురించి పాఠాలు



**నాగ్‌పూర్:** మహారాష్ట్రలో నాగ్‌పూర్ కేంద్రంగా పని చేస్తున్న రాష్ట్ర విశ్వవిద్యాలయంలో 'ఆరెస్సెస్ చరిత్ర', 'జాతి నిర్మాణంలో ఆరెస్సెస్ పాత్ర' అనే అంశాలను సిలబస్‌గా చేర్చారు. రాష్ట్రసంత్ తుకాదోజీ మహారాజ్ నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఏ (చరిత్ర) సెకండియర్ సిలబస్‌లో ఆరెస్సెస్ చరిత్ర పాఠ్యాంశంగా చేరింది. మూడో సెమిస్టర్‌లో 'జాతి నిర్మాణంలో ఆరెస్సెస్ పాత్ర' అనే అంశంతో కూడిన పాఠ్యాంశం చోటు దక్కించుకున్నది. తొలి సెమిస్టర్‌లో కాంగ్రెస్ పార్టీ స్థాపన, జవహర్‌లాల్ నెహ్రూ ఎదుగుదల, రెండో సెమిస్టర్‌లో సహాయనిరాకరణ ఉద్యమం పాత్ర పాఠ్యాంశాలుగా చేరాయి. ఇక నుంచి చరిత్రలో నూతన ధోరణులను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ చర్య చేపట్టినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. యూనివర్సిటీ అధ్యయన బోర్డు సభ్యుడు సతీష్ చాఫ్లే మంగళవారం పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ జాతి నిర్మాణంలో ఆరెస్సెస్ పాత్ర (1885-1947) అంశాన్ని బీఏ (చరిత్ర) నాలుగో సెమిస్టర్‌లో చేరుస్తామని చెప్పారు. 2003-04లో ఎంఏ (చరిత్ర) కోర్సులో 'ఆరెస్సెస్ పరిచయం' పాఠ్యాంశాన్ని విశ్వవిద్యాలయం చేర్చింది. నూతన వాస్తవాలను సమాజం ముందుకు తెచ్చేందుకే చరిత్రను పునఃలిఖిస్తున్నట్లు చాఫ్లే సమర్థించుకున్నారు. అయితే యూనివర్సిటీ సిలబస్‌లో ఆరెస్సెస్ పాత్రను పాఠ్యాంశంగా చేర్చడంపై విమర్శలు వచ్చాయి. మహారాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి సచిన్ సావంత్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. 'దేశ నిర్మాణంలో ఆరెస్సెస్ పాత్రకు సంబంధించిన సమాచారాన్ని నాగ్‌పూర్ యూనివర్సిటీ ఎక్కడ నుంచి సేకరించింది? అత్యంత విభజన వాద సంస్థ అయిన ఆరెస్సెస్.. బ్రిటిష్ పాలకులతో మమేకమై జాతీయోద్యమాన్ని వ్యతిరేకించింది. దుశ్శకునమని పేర్కొంటూ 52 ఏండ్ల పాటు త్రివర్ణ పతకాన్ని ఎగురవేయని ఆరెస్సెస్.. ద్వేషాన్ని వ్యాపింపజేస్తూ.. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలులోకి తేవాలని భావిస్తున్నది' అని ఆరోపించారు.

## హంతకుడ్ని పట్టించిన కోడి ఈకలు

మహిళ హత్య కేసును వినూత్నంగా ఛేదించిన మహారాష్ట్ర పోలీసులు



**థానే:** ఓ మహిళను హత్య చేసిన నిందితుడ్ని కోడి ఈకలు పట్టించాయి. జూన్ 23న మహారాష్ట్ర థానేలోని కల్యాణ్ నగరంలో ఓ కల్వర్ట్ కింద సగం కాలిన మహిళా మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలాన్ని సందర్శించిన పోలీసులు ఆధారాల కోసం పరిసరాలను నిశితంగా గమనించారు. మృతదేహం పక్కన పడి ఉన్న గోనె సంచికి కొన్ని కోడి ఈకలు అతుక్కుని ఉండటంపై వారి దృష్టి పడింది. అలాగే మృతదేహానికి ఉన్న తావీదుపై బెంగాలీ భాషలో ఏదో రాసి ఉంది. దీంతో మృతురాలు(25) పశ్చిమబెంగాల్‌కు చెందిన మహిళగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నగరంలో బెంగాలీ మాట్లాడే చికెన్ షాపు యజమానుల గురించి ఆరా తీశారు. ఆలం షేక్(33) చికెన్ షాపునకు ఖడావలి ప్రాంతానికి చెందిన ఓ మహిళ తరుచుగా వచ్చేదని తెలిసింది. అతడి ఆచూకీ కోసం ప్రయత్నించగా మృతదేహం బయట పడిన తర్వాత బెంగాల్‌కు పారిపోయినట్లు గ్రహించారు. దీంతో పోలీసులు బెంగాల్‌కు వెళ్లి బీర్భుమ్ జిల్లాలోని సైద్‌పూర్ గ్రామంలో నిందితుడు ఆలంను అదుపులోకి తీసుకుని థానేకు తీసుకొచ్చారు. పోలీసుల విచారణలో మహిళను తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించాడు. మోనీతో తనకు కొన్ని నెలలుగా పరిచయం ఉందని, తన వద్ద రూ.2.5 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతో జూన్ 22న ఆమె ఇంటికి వెళ్లి స్నేహితుడి సహాయంతో గొంతు నులిమి హత్య చేసినట్లు ఆలం తెలిపాడు. అనంతరం మృతదేహాన్ని కల్వర్డు కింద పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు చెప్పాడు.

# విజయం వాయిదా!

## భారత్, కివీస్ సెమీస్‌కు వరుణుడు అడ్డు




### కివీస్ 46.1 ఓవర్లలో 211/5..
### బుధవారం రిజర్వ్ డేలో మ్యాచ్ కొనసాగింపు

**అనుకున్నట్లే భారత బౌలర్లు విజృంభించారు. కఠిన ప్రత్యర్థి కివీస్‌ను తక్కువ పరుగులకే కట్టడి చేశారు. బుమ్రా యార్కర్లతో రెచ్చిపోతే.. భువనేశ్వర్ లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి ఫలితం సాధించాడు. మధ్య ఓవర్లలో జడేజా మరీ పిసినారిగా వ్యవహరిస్తే.. పాండ్యా బౌన్సర్లతో అదరగొట్టాడు. కుల్దీప్ ప్లేస్‌లో చాన్స్ దక్కించుకున్న చాహల్ కాస్త ఎక్కువ పరుగులిచ్చినా.. కివీస్ బ్యాటింగ్‌కు వెన్నెముకైన కేన్ విలియమ్సన్‌ను ఔట్ చేశాడు. అంతా కోరుకున్నట్లే జరుగుతున్నది. మరో నాలుగు ఓవర్లు ముగిస్తే.. మన లక్ష్యం ఎంతో డిక్లేర్ అయ్యేదే.. అలాంటి దశలో నేనున్నానంటూ వచ్చిన వరుణుడు.. ఇక అక్కడే తిష్ట వేశాడు. మన బౌలర్ల మెరుపులు చూసేందుకు చుట్టపు చూపుగా వచ్చినట్లు కనిపించినా.. ఆ తర్వాత ఐదు గంటల ఆటను మింగేశాడు. దీంతో మైదానం నీటితో నిండిపోయింది. పలుమార్లు పరిశీలనలు, వాయిదాలు, చర్చలు ఇలా ఎన్ని జరిగినా చివరకు ఆట బుధవారానికి వాయిదా పడింది.**

**మాంచెస్టర్:** ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టాలని తహతహలాడుతున్న టీమ్ ఇండియా జోరుకు వరుణుడు బ్రేక్ వేశాడు. విశ్వసమరం తొలి సెమీఫైనల్లో భారత్ మంచి స్థితిలో ఉన్న సమయంలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించడంతో.. ఆట అర్ధాంతరంగా నిలిచింది. సెమీఫైనల్‌కు రిజర్వ్ డే ఉందని సంబరపడేలోపే.. బుధవారం ఇంకా భారీ వర్షం పడే సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళవారం వర్షం కారణంగా పూర్తి ఓవర్లు సాగని మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 46.1ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. క్లిష్టమైన పిచ్‌పై కెప్టెన్ కేన్ విలియమ్సన్ (95 బంతుల్లో 67; 6 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. రాస్ టేలర్ (85 బంతుల్లో 67 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), లాథమ్ (3 నాటౌట్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో బుమ్రా (8 ఓవర్లలో 1/25), భువనేశ్వర్ (8.1 ఓవర్లలో 1/30) రాణించారు. కీలక మ్యాచ్‌లో ఇరు జట్లు ఒక్కో మార్పుతో బరిలో దిగాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో ఆడిన కుల్దీప్‌ను పక్కనపెట్టి టీమ్‌ఇండియా చహల్‌కు అవకాశమివ్వగా, న్యూజిలాండ్.. సౌథీ ప్లేస్‌లో ఫెర్గూసన్‌ను తీసుకుంది. భారత్, న్యూజిలాండ్ మధ్య జూన్ 13న జరగాల్సిన లీగ్ మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దైన విషయం తెలిసిందే.

### కట్టిపడేసిన పేసర్లు

టాస్ ఓడిపోవడంతో ఒకింత కలవరపాటుకు గురైన టీమ్‌ఇండియాకు బౌలర్లు అదిరిపోయే ఆరంభం అందించారు. పకడ్బందీ బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టిపడేశారు. జస్ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ చెరో ఎండ్ నుంచి చెలరేగుతుంటే.. కివీస్ బ్యాట్స్‌మెన్ పరుగులు తీసేందుకు నానాతంటాలు పడ్డారు. క్రీజులో ఉన్నంత సేపు ఇబ్బందిగా కనిపించిన ఓపెనర్ మార్టిన్ గప్టిల్ (1) స్లిప్‌లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. గప్టిల్‌కు పదే పదే ఆఫ్‌స్టంప్‌పై బంతులు వేసిన మన పేసర్లు.. తనంతట తానే వికెట్ సమర్పించుకునేలా ఉసిగొల్పారు. వీరిద్దరు ఎక్కడా తగ్గకపోవడంతో న్యూజిలాండ్ ఎనిమిదో ఓవర్‌లోగానీ తొలి బౌండ్రీ కొట్టలేకపోయింది. మొత్తానికి పవర్ ప్లే ముగిసేసరికి కివీస్ వికెట్ నష్టానికి 27 పరుగులు చేసింది. మరో ఓపెనర్ నికోల్స్ (51 బంతుల్లో 28)కు కెప్టెన్ విలియమ్సన్ తోడైనా.. పరుగులు వేగం మాత్రం పెరగలేదు. పొదుపుగా బౌలింగ్ చేసిన రవీంద్ర జడేజా (1/34).. రెండో వికెట్‌కు 68 పరుగులు జోడించాక నికోల్స్‌ను ఔట్ చేశాడు. విలియమ్సన్, రాస్ టేలర్ క్రీజులో ఉన్నా.. ఓ దశలో 13 ఓవర్ల పాటు న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో ఒక్క బౌండ్రీ కూడా రాలేదు. 29వ ఓవర్‌లో కానీ ఆ జట్టు స్కోరు 100 దాటలేదు. 79 బంతుల్లో అర్ధ శతకం పూర్తిచేసుకున్న విలియమ్సన్ స్కోరు పెంచే క్రమంలో ఔట్ కావడంతో మూడో వికెట్‌కు నమోదైన 65 పరుగులు భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చి రావడంతోనే క్యాచ్ మిస్ కావడంతో బతికిపోయిన నీషమ్ (12) పెద్దగా ఆకట్టుకోలేకపోగా.. గ్రాండ్ హోమ్ (16) కూడా ఎక్కువసేపు నిలువలేకపోయాడు. మరో ఎండ్‌లో టేలర్ కొన్ని చక్కటి షాట్లతో అలరించడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో 40 ఓవర్ల తర్వాత తొలిసారి రన్‌రేట్ 4 దాటింది. అప్పటి వరకు నత్తనడకన బ్యాటింగ్ చేసిన టేలర్ కాస్త జోరు పెంచడంతో ఆట నిలిచిపోవడానికి ముందు 6.1 ఓవర్లలో కివీస్ 56 పరుగులు చేసింది. మరో నాలుగు ఓవర్లలో మ్యాచ్ ముగుస్తుందనగా వర్షం జోరందుకోవడంతో ఆటకు బ్రేక్ పడింది. భారత బౌలర్లలో భువీ, బుమ్రా, పాండ్యా, జడేజా, చహల్ తలా ఓ వికెట్ తీశారు.

### స్కోరు బోర్డు

**న్యూజిలాండ్:** గప్టిల్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 1, నికోల్స్ (బి) జడేజా 28, విలియమ్సన్ (సి) జడేజా (బి) చహల్ 67, టేలర్(నాటౌట్) 67, నీషమ్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 12, గ్రాండ్‌హోమ్ (సి) ధోనీ (బి) భువనేశ్వర్ 16, లాథమ్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు:** 17, **మొత్తం:** 46.1 ఓవర్లలో 211/5. **వికెట్ల పతనం:** 1-1, 2-69, 3-134, 4-162, 5-200, **బౌలింగ్:** భువనేశ్వర్ 8.1-1-30-1, బుమ్రా 8-1-25-1, పాండ్యా 10-0-55-1, జడేజా 10-0-34-1, చహల్ 10-0-63-1.




### డక్‌వర్త్ లూయిస్ ప్రకారం భారత్ టార్గెట్

| ఓవర్లు | లక్ష్యం |
|---|---|
| 46 | 237 |
| 40 | 223 |
| 35 | 209 |
| 30 | 192 |
| 25 | 172 |
| 20 | 148 |

**ఒకవేళ వర్షం కారణంగా ఆట సాగకపోతే.. లీగ్‌దశలో ఎక్కువ పాయింట్లు సాధించిన భారత్ (15 ).. న్యూజిలాండ్ (11 )ను తోసిరాజని తుదిపోరుకు అర్హత సాధిస్తుంది.**

## మన మంచికే..

వర్షం కురిసిన పిచ్‌పై తక్కువ టార్గెటైనా ఛేజ్ చేయడం చాలా కష్టం అనే విషయం ఇప్పటికే చాలాసార్లు రుజువైంది. చిత్తడిగా ఉన్న ఔట్‌ఫీల్డ్‌పై ఛేదన అంత సులువు కాదు. తగ్గించిన టార్గెట్‌ను ఛేదించేందుకు మంగళవారమే భారత్ బరిలో దిగుతుందని అంతా ఊహించారు. కానీ 20 ఓవర్లలో 148 పరుగులు చేయాల్సి వచ్చినా మాంచెస్టర్‌లో అది అంత సులభతరం అయ్యేది కాదు. చల్లటి వాతావరణంలో బౌల్ట్, ఫెర్గూసన్, హెన్రీ, గ్రాండ్‌హోమ్‌ను ఎదుర్కోవడం భారత బ్యాట్స్‌మెన్‌కు తలకు మించిన భారం అయ్యేదే. వర్షం కారణంగా మ్యాచ్ బుధవారానికి వాయిదా పడటం ఒకందుకు మనకు మంచే చేసింది. నేడు తాజాగా తిరిగి గ్రౌండ్‌లో అడుగుపెట్టనున్న టీమ్ ఇండియా మంగళవారం మ్యాచ్ ఆగిన దగ్గరి నుంచి తిరిగి ప్రారంభిస్తుంది. మాంచెస్టర్‌లో బుధవారం కూడా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కివీస్ తిరిగి బ్యాటింగ్ కొనసాగిస్తుందా.. లేక సవరించిన లక్ష్యంతో భారత్ బ్యాటింగ్‌కు దిగుతుందా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ న్యూజిలాండ్ మరోసారి బ్యాటింగ్‌కు రాకపోతే.. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం భారత లక్ష్యాన్ని 46 ఓవర్లలో 237గా నిర్దేశిస్తారు.

## బౌలర్లు భేష్

గప్టిల్, నికోల్స్, విలియమ్సన్, రాస్ టేలర్ వంటి బ్యాట్స్‌మెన్‌తో కూడిన లైనప్ ఉన్న న్యూజిలాండ్ 29 ఓవర్లకు గానీ 100 పరుగులు చేయలేకపోయిందంటే.. అందులో కివీస్ బ్యాట్స్‌మెన్ వైఫల్యం కన్నా భారత బౌలర్ల గొప్పతనమే ఎక్కువ కనిపిస్తున్నది. ప్రపంచకప్‌లోనే బెస్ట్ బౌలింగ్‌గా గుర్తింపు సాధించిన టీమ్‌ఇండియాపై పరుగులు చేసేందుకు న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ ఆపసోపాలు పడ్డారు. ఆరంభంలో బుమ్రా, భువీ ఇచ్చిన ఆరంభాన్ని మధ్య ఓవర్లలో జడేజా (1/34), పాండ్యా (1/55) కొనసాగించారు. ముఖ్యంగా జడేజా వికెట్ టు వికెట్ బంతులతో ఆకట్టుకున్నాడు. 10 ఓవర్లలో అతడు 38 డాట్స్ బాల్స్ వేయడం విశేషం. మరో ఎండ్ నుంచి హార్దిక్ పాండ్యా స్లో బౌన్సర్లతో అదరగొట్టాడు. చహల్ (1/63) కాస్త ఎక్కువ పరుగులు ఇచ్చినా కీలకమైన విలియమ్సన్ వికెట్ పడగొట్టడం విశేషం. ఈ టోర్నీలో ఆడిన 4 మ్యాచ్‌ల్లోనే 14 వికెట్లు తీసి అబ్బురపరిచిన షమీ ఈ మ్యాచ్‌లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు.

## తొలి బంతికే షాక్



టాస్ ఓడిపోవడం నుంచి కోలుకోక ముందే భారత్‌కు మరో షాక్ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ తొలి బంతికే గప్టిల్ ఎల్బీ కోసం భువనేశ్వర్ గట్టిగా అప్పీల్ చేశాడు. వికెట్ కీపర్ ధోనీ సహా సర్కిల్‌లోని మిగిలినవాళ్లంతా ఒక్కసారిగా అరిచినా అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అయితే బంతికి కచ్చితంగా వికెట్లను తాకుతుందని భావించిన భువీ రివ్యూ కోరమని కోహ్లీకి సూచించాడు. కాస్త తటపటాయించిన కెప్టెన్ రివ్యూకు వెళ్లాడు. కానీ బంతి లెగ్‌స్టంప్ దాటి వెళ్తున్నట్లు రివ్యూలో తేలడంతో.. టీమ్‌ఇండియా మొదటి బంతికే ఉన్న ఒక్క రివ్యూను కోల్పోవాల్సి వచ్చింది. మిగిలిన మ్యాచ్ మొత్తం రివ్యూ కోరకుండానే కొనసాగించింది.

## ఒక్కటొచ్చే చోట మూడిచ్చారు..

ఈ మ్యాచ్‌లో భారత్ ఫీల్డింగ్ స్థాయికి తగ్గట్లు లేదనే చెప్పాలి. కివీస్ ఇన్నింగ్స్ 38వ ఓవర్ సందర్భంగా నీషమ్ ఇచ్చిన ఈజీ క్యాచ్‌ను వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుకోలేకపోయాడు. మిడ్‌వికెట్ ప్రాంతంలో రోహిత్ మిడ్‌వికెట్ ప్రాతంలో ఫీల్డింగ్ చేస్తుండగా.. అతడి ఎడమ వైపు నుంచి వెళ్లిన బంతిని హిట్‌మ్యాన్ ఒడిసిపట్టలేకపోయాడు. ఆ తర్వాత 8 పరుగులు మాత్రమే జోడించిన నీషమ్ ఔట్ కావడంతో భారీ నష్టం జరగలేదు. అంతే కాదు ఈ మ్యాచ్‌లో ఓవర్‌త్రోల రూపంలోనూ మనవాళ్లు ప్రత్యర్థికి అదనపు పరుగులు ఇచ్చుకున్నారు. బ్యాకప్ ఉన్నాడా లేడా అని చూసుకోకుండా చహల్ త్రో వేస్తే.. దాన్ని అడ్డుకున్న రాహుల్ కూడా అదే తప్పు పునరావృతం చేశాడు. దీంతో ఒక్క పరుగు రావాల్సిన చోట మూడు రన్స్ వచ్చాయి. తర్వాత కూడా బంతిని ఆపడం, త్రో చేయడంలో చహల్ తడబాటు కనబర్చాడు.

## అలుపెరగకుండా..

వికెట్ కీపర్‌గా ఏకబిగిన 350 వన్డేలు ఆడిన తొలి క్రికెటర్‌గా మహేంద్రసింగ్ ధోనీ రికార్డుల్లోకెక్కాడు. ఇందులో ధోనీ 3 మ్యాచ్‌ల్లో ఆసియా ఎలెవన్‌కు ప్రాతినిధ్యం వహించగా.. మిగిలిన 347 టీమ్‌ఇండియా తరఫున ఆడాడు. శ్రీలంక మాజీ కీపర్ సంగక్కర 404 వన్డేలు ఆడినా అందులో 44 మ్యాచ్‌ల్లో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గా బరిలో దిగాడు. ధోనీ మాత్రం కెరీర్ మొత్తం కీపర్‌గానే కనిపించాడు. ఈ క్రమంలో భారత్ తరఫున సచిన్ టెండూల్కర్ (463) తర్వాత ఎక్కువ వన్డేలు ఆడిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఓవరాల్‌గా 350 వన్డేలకు పైగా ఆడిన ఆటగాళ్లలో మహీ 10వ స్థానంలో ఉన్నాడు. సచిన్ అగ్రస్థానంలో ఉండగా.. జయవర్ధనే (448),జయసూర్య (445), సంగక్కర (404), అఫ్రిది (398), ఇంజమామ్ (378), పాంటింగ్ (375), అక్రమ్ (356), మురళీధరన్ (350) ముందున్నారు.



## ఒక్కసారే..

ఇప్పటి వరకు మూడు సార్లు ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత్ ఒక్క సారి మాత్రమే సెమీఫైనల్లో (1983) ఛేజింగ్ చేసింది. అది కూడా ఇదే ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలోనే. ఇంగ్లండ్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించి తుదిపోరుకు చేరింది. ఆ తర్వాత రెండు సార్లు ఫైనల్ (2003, 2011)కు అర్హత సాధించినా.. ఆ రెండు సార్లు కూడా మొదట బ్యాటింగే చేసింది.

## 'నో ఫ్లై జోన్'గా మాంచెస్టర్

ప్రపంచకప్‌లో ఆటేతర అంశాలను చర్చకు రానివ్వకూడదని కంకణం కట్టుకున్న ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ)దానికి తగ్గట్లు గట్టి చర్యలు తీసుకుంటున్నది. లీడ్స్ వేదికగా జరిగిన భారత్, శ్రీలంక మ్యాచ్‌లో గుర్తు తెలియని విమానం 'జస్టిస్ ఫర్ కశ్మీర్' పేరిట బ్యానర్లు ప్రదర్శిస్తూ చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. సెమీఫైనల్లో ఇలాంటి రాజకీయ అంశాలు చర్చకు రాకూడదని ముందు జాగ్రత్తగా ఈ మ్యాచ్ జరుగుతున్న ప్రదేశాన్ని మంగళవారం 'నో ఫ్లై జోన్'గా ప్రకటించినట్లు ఈసీబీ స్పష్టం చేసింది. ఆటగాళ్ల రక్షణ విషయంలో ఉదాసీనతకు తావివ్వకూడదనే విమానాలపై ఆంక్షలు విధించినట్లు పేర్కొంది. 'గత అనుభవాల దృష్ట్యా ఆటగాళ్ల భద్రత అంశాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లాం. దానిపై చర్యలు తీసుకున్న ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఓల్డ్‌ట్రఫోర్డ్ విమానాశ్రయాన్ని 24 గంటల పాటు 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించింది. ఈ విషయాన్ని బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీకి టోర్నీ నిర్వాహకులు సమాచారం అందించారు'అని ఓ అధికారి తెలిపారు. అంతకుముందు పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మ్యాచ్ సందర్భంగానూ ఇలాగే 'జస్టిస్ ఫర్ బలూచిస్థాన్'అనే బ్యానర్లతో విమానం చక్కర్లు కొట్టగా.. ఈ అంశంపై ఆ రెండు దేశాల అభిమానుల మధ్య తీవ్ర వాగ్వాదంతో పాటు ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే.

## ఐపీఎల్‌లో ఒకే జట్టుకు ఆడితే బాగుండేది



**కోల్‌కతా:** అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో అనితర సాధ్యమైన రికార్డులను తన పేరిట లిఖించుకున్న భారత మాజీ క్రికెటర్ యువరాజ్‌సింగ్..ఐపీఎల్ కెరీర్‌పై మాత్రం పెదవి విరిచాడు. మంగళవారం భారత చాంబర్ ఆఫ్ కామర్స్ 91వ వార్షిక సాధారణ సమావేశాల్లో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా యువీ మాట్లాడాడు. ఐపీఎల్‌లో ఒకే ఫ్రాంచైజీ తరఫున స్థిరంగా ఉండలేకపోవడం నిరాశ కలిగించిందని చెప్పాడు. 'నేను ఆ విషయాన్ని వివరించి చెప్పలేను. కానీ ఒకే ఫ్రాంచైజీ తరఫున ఆడలేకపోయా. ఒకటి లేదా రెండు జట్ల తరఫునే ఆడి ఉంటే బాగుండేది. 2016 వేలంలో దాదాపు కోల్‌కతాతో జతకలుస్తానని అనుకున్నా. కానీ ఆర్సీబీకి వెళ్లా. అదే నా అత్యుత్తమ ఐపీఎల్ సీజన్' అని యువీ అన్నాడు. ఐపీఎల్ కెరీర్‌లో పంజాబ్, పుణె, ఆర్సీబీ, ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్, ముంబై జట్ల తరఫున యువీ ఆడాడు.

# సెరెనా 12వ సారి సెమీస్‌లో

### హలెప్ ముందడుగు, కొంటా ఔట్.. నేడు పురుషుల సింగిల్స్ క్వార్టర్స్



సెరెనా

**లండన్:** మాజీ చాంపియన్ సెరెనా విలియమ్స్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేస్తున్నది. మొదటి రౌండ్ నుంచి పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్న ఈ అమెరికా క్రీడాకారిణి మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్‌లోనూ అదరగొట్టింది. ప్రిక్వార్టర్స్‌లో టాప్ సీడ్ బార్టీని ఓడించిన తన దేశానికే చెందిన అన్‌సీడెడ్ ప్లేయర్ అలీసన్ రిస్కేని 6-4, 4-6, 6-3 తేడాతో చిత్తు చేసి ఓవరాల్‌గా 12వ సారి సెరెనా సెమీఫైనల్‌లో అడుగుపెట్టింది. 2గంటల పాటు సాగిన మ్యాచ్‌లో విలియమ్స్ తన సర్వీస్ పవర్‌ను చూపుతూ ఏకంగా 19 ఏస్‌లు కొట్టడం సహా 49 విన్నర్లను సాధించి సత్తా చాటింది. తొలి సెట్‌ను 6-4తో సులువుగానే గెలిచినా.. రెండో సెట్‌లో వెనుకబడింది. ప్రత్యర్థి రిస్కే రెచ్చిపోయి ఆడడంతో ఆత్మరక్షణ ధోరణి అవలంభించి 4-6తో కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో పుంజుకొని 6-3తో కైవసం చేసుకొని సెరెనా విజయం సాధించింది. ఏడో సీడ్ హలెప్(రొమేనియా) కూడా ఎదురులేని ఆటతో క్వార్టర్‌ఫైనల్‌లో షువాయ్ జంగ్ (చైనా)ను ఓడించింది. 7-6(7/4), 6-1తో గంటా27 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. ప్రారంభం నుంచి ఇరువురు హోరాహోరీగా తలపడడంతో తొలి సెట్ టైబ్రేకర్ దాకా వెళ్లింది. అప్పటి నుంచి తనదైన దూకుడుతో అదరగొట్టి టైబ్రేకర్‌తో పాటు రెండో సెట్‌ను 6-1తో హలెప్ సునాయాసంగా కైవసం చేసుకొని జంగ్‌ను మట్టికరిపించి, ముందడుగేసింది. 19వ సీడ్ జొహన్నా కొంటా (బ్రిటన్)కు క్వార్టర్స్‌లో షాక్ తగిలింది. అన్ సీడెడ్ క్రీడాకారిణి బార్బోరా స్ట్రైకోవా(చెక్ రిపబ్లిక్) చేతిలో ఆమె 6-7(5/7), 1-6 తేడాతో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. గంటా 37 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో కొంటా ఏకంగా 34 తప్పిదాలు చేసి భారీ మూల్యం చెల్లించుకుంది. మరోమ్యాచ్‌లో అన్ సీడెడ్ క్రీడాకారిణి, ప్రిక్వార్టర్స్‌లోనే ప్లిస్కోవాను ఇంటికి పంపిన కరోలినా మచువా(చెక్‌రిపబ్లిక్)పై 8వ సీడ్ ఎలీనా స్వితోలినా(ఉక్రెయిన్) విజయం సాధించింది. 7-5, 6-4తో వరుస సెట్లలో మ్యాచ్‌ను గెలిచి సెమీస్‌కు చేరింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్ గురువారం జరగనున్నాయి. స్వితోలినాతో హలెప్, స్ట్రైకోవాతో సెరెనా విలియమ్సన్ తలపడనున్నారు.

**సెరెనాకు జరిమానా**

మాజీ చాంపియన్ సెరెనా విలియమ్స్‌కు వింబుల్డన్ నిర్వాహకులు జరిమానా విధించారు. రాకెట్‌తో ఆల్ ఇంగ్లండ్ క్లబ్ టెన్నిస్ కోర్టును డ్యామేజ్ చేసిందనే కారణంతో 10వేల డాలర్ల ఫైన్ వేశారు. టోర్నీ ప్రారంభానికి ముందు ప్రాక్టీస్ సెషన్లలో ఈ ఘటన జరిగిందని తెలిపారు.

**నేడు పురుషుల సింగిల్స్ క్వార్టర్స్..**

వింబుల్డన్‌లో పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం జరగనున్నాయి. టాప్ సీడ్ జకోవిచ్.. గొఫిన్(బెల్జియం)తో తలపడనుండగా.. ఎనిమిదో సీడ్ నిషికోరీతో స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్ పోటీపడనున్నాడు. అలాగే స్పెయిన్ బుల్ రఫేల్ నాదల్... సామ్ క్వెర్రీ(అమెరికా)తో, గుడియో పెల్లా(అర్జెంటీనా)తో బాటిస్టా అగట్(స్పెయిన్) తలపడనున్నారు.



హలెప్

## మీరాబాయికి స్వర్ణం



**ఏపియా(సమోవా):** కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. మంగళవారమిక్కడ ప్రారంభమైన సీనియర్ మహిళల పోటీ(49కేజీల విభాగం)లో భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మీరాబాయి మొత్తం 191 కేజీల(84+107)ను ఎత్తి సత్తా చాటింది. అలాగే టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించడం సహా అవకాశాలను మెరుగుపరుచుకుంది. చానూ స్వర్ణం సహా సీనియర్, జూనియర్, యూత్ విభాగాల్లో భారత ప్లేయర్లు మొత్తం 13 పతకాలను దక్కించుకున్నారు. అందులో ఎనిమిది స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్యాలు ఉన్నాయి. సీనియర్ మహిళల 45 కేజీల విభాగంలోనే 154 కేజీలు ఎత్తి జిల్లి దల్‌బెహ్రా స్వర్ణాన్ని, 55 కేజీల సీనియర్ విభాగంలో వింధ్యారాణి దేవి పసిడిని, తెలుగమ్మాయి మత్స్య సంతోషి రజతాన్ని చేజిక్కించుకుంది. సీనియర్ పురుషుల 55కేజీల విభాగంలో రిషికంత సింగ్ మొత్తం 235 కేజీలు(105+130) ఎత్తి స్వర్ణ పతకాన్ని చేజిక్కుంచుకున్నాడు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 38,731 | 11,556 |
| ↗10 | ↘3 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 64.23 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,870 |
| 22 క్యారెట్లు | 34,700 |
| వెండి (కిలో) | 38,900 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.00 | 71.50 |
| యూరో | 73.80 | 80.30 |
| బహ్రెయిన్ దినార్ | 173.20 | 187.20 |
| కువైట్ దినార్ | 217.00 | 231.00 |
| సౌదీ రియాల్ | 17.30 | 19.10 |
| యూఏఈ దిర్హామ్ | 17.80 | 19.50 |

**చికెన్ ధరలు**

| (రూ.లలో) | |
|---|---|
| ఫారం ధర | 85.00 |
| రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్డ్ | 155.00 |
| స్కిన్‌లెస్ | 177.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

| (రూ.లలో) | |
|---|---|
| హైదరాబాద్ | 429-00 |
| రంగారెడ్డి | 429-00 |
| మెదక్ | 429-00 |
| కరీంనగర్ | 432-00 |
| వరంగల్ | 432-00 |
| రిటైల్ ప్రైస్ | 4-90 |

# టీసీఎస్ బోణీ అదిరింది

## క్యూ1 లాభంలో 11 శాతం వృద్ధి ■ రూ.8,131 కోట్లు ఆర్జించిన సంస్థ ■ రూ.5 డివిడెండ్‌ను ప్రకటించిన కంపెనీ

**ముంబై, జూలై 9:** ఆర్థిక ఫలితాల బోణీ అదిరింది. దేశంలో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థయైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) విశ్లేషకుల అంచనాలకుమించి లాభాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.8,131 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.7,340 కోట్లతో పోలిస్తే 10.8 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఏప్రిల్-జూన్ మధ్యకాలానికిగాను కంపెనీ ఆదాయం 11.శాతం పెరిగి రూ.38,172 కోట్లకు చేరుకున్నది. 2018-19 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికిగాను రూ.34,261 కోట్లుగా ఉన్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోవడం కంపెనీకి కలిసొచ్చింది. 'నూతన ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠ స్థాయి లాభాలతో ప్రారంభించాం..వినియోగదారులు కోరుకుంటున్న విధంగా సేవలు అందించడం, బలమైన ఆర్డర్ బుకింగ్, పలు ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది' అని టీసీఎస్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ గోపినాథన్ తెలిపారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో డిజిటల్ వాటా గరిష్ఠమని, 32.20 శాతం వీటిని అందించడం ద్వారానే సమకూరినట్లు ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపినాథన్ చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో వృద్ధి పది శాతం కంటే తక్కువగా నమోదవగా, ఈసారి మాత్రం రెండంకెల వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ నెలలో సిబ్బంది జీతభత్యాలు పెంచడంతో మార్జిన్లు 2.4 శాతం పడిపోయాయని టీసీఎస్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి వీ రామకృష్ణన్ చెప్పారు. ప్రతిషేరుపై రూ.21.67 మేర ఆదాయం సమకూరినట్లు అయింది. గతేడాదితో పోలిస్తే 13 శాతం ఎదుగుదల కనిపించింది. మార్చి త్రైమాసికంలో నమోదైన 17.72 శాతం వృద్ధి, డిసెంబర్ క్వార్టర్‌లో 24 శాతం, సెప్టెంబర్‌లో 22.71 శాతం వృద్ధితో పోలిస్తే ఇది చాలా తక్కువ. జూన్ 31తో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. కంపెనీల్లో ప్రమోటర్ల వాటాను తగ్గించుకునే అవకాశాలు లేవని గోపినాథ్ స్పష్టంచేశారు. స్టాక్ మార్కెట్లో లిస్టైన ప్రతి సంస్థలో ప్రజల వాటాను 25 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన నేరుగా స్పందించలేదు. ప్రస్తుతం టీసీఎస్‌లో టాటా గ్రూపునకు 75 శాతం వాటా ఉన్నది.

### కొత్తగా 12,356 ఉద్యోగాలు

గడిచిన త్రైమాసికంలో సంస్థ 12,356 మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకున్నది. ఒక త్రైమాసికంలో ఇంతటి స్థాయిలో ఉద్యోగ నియామకం చేపట్టడం గడిచిన ఐదేండ్లలో ఇదే తొలిసారి. దీంతో మొత్తం సిబ్బంది 4,36,641కి చేరుకున్నారు. అయినప్పటికీ కంపెనీల్లో వలసలు ఆగడం లేదు. గత త్రైమాసికంలో వలసలు 11.5 శాతంగా నమోదయ్యాయి. జూన్ చివరి నాటికి నూతన టెక్నాలజీకోసం 3.15 లక్షల మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చింది సంస్థ. అలాగే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ల ద్వారా ఎంపిక చేసిన 30 వేల మందికి నియమించుకున్నది.

### 5 బిలియన్ డాలర్ల ఒప్పందాలు

గడిచిన త్రైమాసికంలో సంస్థ ఒప్పందాలు కుదుర్చుకోవడంలో దూసుకుపోయింది. నికరంగా 5 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకున్నది. వీటిలో 100 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు నాలుగు ఉన్నాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 2.05 శాతం తగ్గి రూ.2,131.45 వద్ద స్థిరపడింది.



ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ముంబైలో జరిగిన విలేకరుల సమావేశంలో టీసీఎస్ సీఈవో, ఎండీ రాజేష్ గోపినాథన్, కంపెనీ సీఎఫ్‌వో వీ రామకృష్ణన్

### రంగాల వారీగా ఆదాయం..

రంగాలవారీగా ఆదాయంలో భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. లైఫ్ సైన్స్ అండ్ హెల్త్ కేర్ విభాగం భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. ఈ విభాగం 18.1 శాతం, బీఎఫ్ఎస్ఐ 9.2 శాతం, రిటైల్ అండ్ ఈపీసీ 7.9 శాతం, కమ్యూనికేషన్స్ అండ్ మీడియా 8.4 శాతం, టెక్నాలజీ అండ్ సర్వీసెస్ 7.8 శాతం, తయారీ 5.5 శాతం వృద్ధిని కనబరిచాయి.

### బ్రిటన్, యూరప్‌లది కీలక పాత్ర

కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో బ్రిటన్, యూరప్ దేశాలు కీలకపాత్ర పోషించాయి. బ్రిటన్ నుంచి సమకూరిన ఆదాయంలో 16 శాతం పెరుగగా, భారత్‌లో 15.9 శాతం, యూరప్‌లో 15 శాతం, ఉత్తర అమెరికా 7.7 శాతం, ఆసియా పసిఫిక్ 9.5 శాతం, ఎంఈఏ 6.4 శాతం, లాటిన్ అమెరికాలో 6.4 శాతం పెరుగుదల నమోదైంది.

# దిగొచ్చిన పసిడి ధర



## ఒకేరోజు రూ.600 తగ్గిన తులం

**న్యూఢిల్లీ, జూలై 9:** రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు మళ్లీ దిగొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు భారీగా తగ్గడంతోపాటు దేశీయంగా ఆభరణాల వర్తకులు కొనుగోళ్ళకు మొగ్గుచూపకపోవడంతో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర ఒకే రోజు రూ.600 తగ్గి రూ.34,870కి పరిమితమైంది. కిలో వెండి ధర రూ.40 తగ్గి రూ.38,900 వద్ద ముగిసింది. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,400 డాలర్ల దిగువకు 1,394.39 డాలర్లకు పడిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ధరలు శాంతించాయి. మరోవైపు ఔన్స్ వెండి కూడా 15.08 డాలర్లకు చేరుకున్నది. రూపాయితో పోలిస్తే డాలర్ విలువ మూడు వారాల గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో పసిడి దిగువముఖం పట్టిందని, భవిష్యత్తులో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు కూడా ఉండటం పరోక్షంగా దోహదం చేశాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ హరీష్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సార్వత్రిక బడ్జెట్లో దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయంలో ఒక్కసారిగా బంగారం భగ్గుమన్నది.

# రుణాలు మరింత చౌక

## వడ్డీరేట్లను 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఎస్‌బీఐ

**ముంబై, జూలై 9:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. రుణాలపై వడ్డీరేట్లను తగ్గించింది. 5 బేసిస్ పాయింట్ల మేర అన్నింటిపైనా దించుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. కొత్త వడ్డీరేట్లు బుధవారం నుంచే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. దీంతో గృహ, వాహన తదితర రుణాలపై ఖాతాదారులకు భారం తగ్గనున్నది. ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను తాము తగ్గిస్తున్నా.. బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని ఆశించిన స్థాయిలో ఖాతాదారులకు అందివ్వడం లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వరుసగా మూడు సమీక్షల్లో రెపో రేటును 75 బేసిస్ పాయింట్లు తగ్గించామని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఎస్‌బీఐ తాజా నిర్ణయం వెలువడింది. ఏడాది మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) లేదా కనీస రుణ రేటును 8.45 శాతం నుంచి 8.40 శాతానికి తగ్గిస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. అన్ని రుణాలకు ఈ ఎంసీఎల్ఆరే అనుసంధానంగా ఉంటున్నది. ఇక ఈ నెల 1 నుంచి రెపో ఆధారిత గృహ రుణాలనూ ఎస్‌బీఐ అందుబాటులోకి తీసుకురాగా, ఆర్బీఐ వరుస కోతల నడుమ 20 బేసిస్ పాయింట్ల మేర గృహ రుణాల వడ్డీరేట్లను తగ్గించింది.

# ఇంకెంతో కాలం భరించలేం

## అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలపట్ల ట్రంప్ ■ తీరు మారకపోతే ఇబ్బందేనని మరోసారి హెచ్చరిక

**వాషింగ్టన్, జూలై 9:** అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలను మరోసారి ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. ఇంకెంతో కాలం వీటిని సహించలేమంటూ మంగళవారం హెచ్చరించారు. ఇటీవలి జపాన్ జీ-20 సమావేశాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయిన కొద్దిరోజుల వ్యవధిలోనే ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నాడు ద్వైపాక్షిక వాణిజ్యంపై ఇరు దేశాల అధినేతలు ఆందోళన వ్యక్తం చేస్తూ వాణిజ్య వివాదాలను రెండు దేశాల వాణిజ్య శాఖ మంత్రుల చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ట్రంప్, మోదీ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 'అమెరికాపై భారత్ అధిక సుంకాలు కొనసాగుతున్నాయి. వీటిని ఇంకెంతో కాలం భరించలేం' అని ట్వీట్ చేశారు. ఈ వారం అమెరికా వాణిజ్య శాఖ మంత్రి విల్బర్ రాస్, ఇంధన శాఖ మంత్రి రిక్ పెర్రీ.. వాషింగ్టన్ డీసీలో ఓ భారీ భారతీయ సదస్సునుద్దేశించి మాట్లాడనున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యాఖ్యలు భారత్‌పట్ల అమెరికా వైఖరికి అద్దం పట్టేలా ఉన్నాయి. ఇదే నిజమైతే రాబోయే సదస్సులో అగ్రరాజ్య మంత్రులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

### తరచూ విమర్శలు

ఇటీవలికాలంలో భారత్‌ను 'టారీఫ్ కింగ్'గా ట్రంప్ తరచూ అభివర్ణిస్తున్న సంగతీ విదితమే. వీలు చిక్కినప్పుడల్లా భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. 'చాలా కాలం నుంచి అమెరికా ఉత్పత్తులపై భారత్‌లో అధిక సుంకాలు పడుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీతో దీని గురించి మాట్లాడాలని చూస్తున్నాను. ఈ మధ్యనే ఈ సుంకాల భారాన్ని మరింత పెంచారు కూడా. వీటిని తప్పక ఉపసంహరించాలి' అని జీ-20 సమావేశాలకు వెళ్తూ కూడా ట్రంప్ ట్వీట్ చేశారు.



ఇప్పటికే అమెరికా మంత్రి పాంపి యో.. భారత్‌లో పర్యటించి ప్రధాని మోదీ, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జయశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమై వాణిజ్య సుంకాలు తదితర అంశాలపై చర్చించారు. భారత ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాలు విధించడం, భారత్‌కున్న వాణిజ్య ప్రాధాన్య హోదా (జీఎస్పీ)ను తొలగించడం మధ్య మోదీ సర్కారు సైతం అమెరికాకు చెందిన 28 ఉత్పత్తులపై సుంకాలను పెంచినది తెలిసిందే. ఏటా అమెరికాకు భారత్ నుంచి దాదాపు 1.5 బిలియన్ డాలర్ల విలువైన ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత్ ఎగుమతులు 47.9 బిలియన్ డాలర్లుగా నమోదైయ్యాయి. అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు 26.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వాణిజ్యపరంగా అమెరికా వెనుకబడిన దేశాలతో సుంకాల సమరానికి ట్రంప్ కాలు దువ్వుతుండగా, చైనాతోనూ ఇదే కారణంగా వాణిజ్య యుద్ధానికి తెర తీశారు.

### ట్రంప్ వద్ద టెక్కీల ఆందోళన

భారత్ డేటా లోకలైజేషన్‌పై అమెరికా టెక్నాలజీ సంస్థలు ట్రంప్ వద్ద ఆందోళన వ్యక్తం చేశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. దేశీయ చెల్లింపుల సమాచారాన్ని స్థానికంగానే భద్రపరుచాలంటూ స్పష్టం చేసిన నేపథ్యంలో అమెరికాకు చెందిన గూగుల్, మాస్టర్‌కార్డ్, వీసా, అమెజాన్ సంస్థలు.. ట్రంప్‌కు తమ గోడును వెళ్లబోసుకున్నాయి. ఆర్బీఐ నిబంధనలకు తలొగ్గితే నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని చెప్పాయి. దీంతోనే వాణిజ్యపరంగా భారత్‌పై ఒత్తిడిని పెంచే వ్యూహాన్ని ట్రంప్ అమలు చేస్తున్నారని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 899 ప్లాన్ 786కే..

### బీఎస్ఎన్ఎల్ వరల్డ్ కప్ ఆఫర్

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :** బీఎస్ఎన్ఎల్ సరికొత్తగా వరల్డ్ కప్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా రూ.899 ప్రీపెయిడ్ ప్లాన్‌ను రూ.113 రాయితీతో రూ.786కే అందిస్తున్నది. ఈనెల 16వ వరకు అమలులో ఉండనున్న ఈ ఆఫర్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కస్టమర్లు వినియోగించుకోవచ్చును. ఈ ఆఫర్‌తో ఏ నెట్‌వర్క్‌కైనా ఉచిత కాలింగ్, అన్‌లిమిటెడ్ డాటా, రోజుకు 50 ఎస్ఎంఎస్‌లను 180 రోజుల పాటు వినియోగించుకోవచ్చును. ఈ ఆఫర్‌ను రెండుసార్లు రీచార్జి చేసుకునే అవకాశాన్ని కూడా వినియోగదారులకు కల్పించింది. ఒక్కసారి రూ.786తో రీచార్జి చేసుకున్న తర్వాత రెండోసారి కూడా అంతే మొత్తంతో రీచార్జి చేసుకుంటే 365 రోజుల పాటు ఈ ఆఫర్ లభించనున్నది.

## జీ ఎండీ అశోక్ వెంకట్రమణి రాజీనామా

**న్యూఢిల్లీ, జూలై 9:** ప్రముఖ మీడియా సేవల సంస్థయైన జీ మీడియా కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ వెంకట్రమణి మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఆయన పదవి నుంచి వైదొలిగారని, ఈ రాజీనామా వెంటనే అమలులోకి రానున్నట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఐఐఎం అహ్మదాబాద్, హార్వార్డ్ బిజినెస్ స్కూల్‌లో చదివిన వెంకట్రమణికి సేల్స్ అండ్ మార్కెటింగ్‌లో 30 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది.

# సింగరేణి బొగ్గు అమ్మకాలకు ఈ-ఆక్షన్

## ఈ నెల 16 నుంచి ప్రారంభం ■ 14.4 లక్షల టన్నుల విక్రయానికి ఏర్పాట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్తేతర పరిశ్రమలకు కావాల్సిన బొగ్గును ఈ-ఆక్షన్ ద్వారా అమ్మేందుకు సింగరేణి సంస్థ ఏర్పాట్లు చేసింది. ఈ పద్ధతిలో ఇప్పటికే 150 పరిశ్రమలకు 107 లక్షల టన్నుల బొగ్గును విక్రయించిన సింగరేణి సంస్థ.. తాజాగా మరో 14.4 లక్షల టన్నుల బొగ్గును ఈ-ఆక్షన్‌లో అమ్మేందుకు సన్నాహాలు చేసింది. ఈ నెల 16 నుంచి ఈ-ఆక్షన్ మొదలవుతుందని, దీనిని పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి మార్కెటింగ్ జీఎం ఆంటోని రాజా సూచించారు. ఈ అమ్మకాలపై ఆయా పరిశ్రమలకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం సదస్సును నిర్వహించారు. తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని సిమెంట్, పేపర్, క్యాప్టివ్ పవర్ ప్లాంట్లు, ఎరువులు, మందుల పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కోల్ మూవ్‌మెంట్ ఈడీ జే అల్విన్, జీఎం జీ వెంకటేశ్వరరెడ్డి, ఏజీఎం ఎన్వీకే శ్రీనివాస్, డీజీఎంలు ఎన్వీ రాజశేఖర్‌రావు, టీ శ్రీనివాస్.. ఈ-ఆక్షన్ ప్రక్రియ గురించి పరిశ్రమల ప్రతినిధులకు వివరించారు. గతంలో ఈ తరహా పరిశ్రమలు సింగరేణి నుంచి బొగ్గు కొనాలంటే ఢిల్లీ నుంచి అనుమతులు పొందాల్సివచ్చేది. అదెంతో వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారమే కాకుండా బొగ్గు కేటాయింపు జరిగిందో లేదో తెలుసుకునేందుకు చాలా సమయం పట్టేది. ఈ నేపథ్యంలో కేంద్ర బొగ్గు గనులశాఖ పాత విధానాన్ని పూర్తిగా సరళీకరించి ఈ-ఆక్షన్ విధానంతో పరిశ్రమలు నేరుగా ఉత్పత్తిదారుల నుంచి బొగ్గును కొనుగోలుచేసే అవకాశాన్ని కల్పించింది. ఐటీసీ, నవ భారత్, సిర్పూర్ పేపర్ మిల్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, దివీస్, కేశోరాం సిమెంట్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, మైహోమ్, భవ్య, రెయిన్ సిమెంట్స్ తదితర 29 పరిశ్రమల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

# ఇండిగోలో భగ్గుమన్న విభేదాలు



**న్యూఢిల్లీ, జూలై 9:** దేశీయ అతిపెద్ద ప్రైవేట్ రంగ విమానయాన సంస్థ ఇండిగోలో ప్రమోటర్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. సహ వ్యవస్థాపకుడు రాహుల్ భాటియా కారణంగా సంస్థ పాన్ షాప్ కంటే అధ్వాన్నంగా తయారైందని, తీవ్ర పాలనాపరమైన లోపాలు చోటు చేసుకుంటున్నాయని నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ గంగ్వాల్ మంగళవారం ఆరోపించారు. దీంతో దాదాపు ఏడాది కాలంగా నివురు కప్పిన నిప్పులా ఉన్న భేదాభిప్రాయాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. సంస్థలో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులను చక్కదిద్దడానికి మార్కెట్ రెగ్యులేటర్ సెబీ జోక్యాన్ని కూడా గంగ్వాల్ కోరుతున్నారు. మరోవైపు గంగ్వాల్ నుంచి ఓ లేఖను తమ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అందుకున్నారని, సెబీ కూడా ఈ లేఖపై స్పందనను కోరిందని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇండిగో తెలియజేసింది. మే నెలలో ప్రమోటర్ల మధ్య విభేదాలున్నాయన్న వార్తలు వచ్చిన దగ్గర్నుంచి సెబీ కూడా దీనిపై దృష్టి పెట్టింది. జెట్ ఎయిర్‌వేస్ మూతబడటం, ఎయిర్ ఇండియా రుణ భా రం, ప్రైవేటీకరణ అంశాలతో దేశీయ విమానయాన రంగం సంక్షోభంలో ఉన్న వేళ ఇండిగో విభేదాలను సెబీ సీరియస్‌గా తీసుకున్నది.

## ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో బాస్మతి

### నేడు ప్రారంభిస్తున్న ఎన్‌సీడీఈఎక్స్

**న్యూఢిల్లీ, జూలై 9:** వ్యవసాయ ఉత్పత్తుల ప్రముఖ వాణిజ్య వేదిక ఎన్‌సీడీఈఎక్స్.. బుధవారం 'బాస్మతి-పూస 1121' రకం బియ్యం ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను ప్రారంభిస్తున్నది. హర్యానాలోని కర్నల్.. కోర్ ట్రేడింగ్ సెంటర్‌గా, అదనపు పంపిణీ కేంద్రంగా సోనీపట్ ఉంటాయని మంగళవారం ఓ ప్రకటనలో ఎన్‌సీడీఈఎక్స్ తెలిపింది. 10 టన్నులదాకా తప్పనిసరి డెలివరీ ఆప్షన్‌తో మదుపరులు ట్రేడింగ్ చేయవచ్చని చెప్పింది. 'ధాన్యం పరిశ్రమకు మా మద్దతు కొనసాగుతుంది. ఈ కమోడిటీ ఫ్యూచర్ ట్రేడింగ్ విజయవంతం కావాలని కోరుకుంటున్నాం' అని ఎన్‌సీడీఈఎక్స్ ఎండీ, సీఈవో విజయ్ కుమార్ అన్నారు.

# ఇక ఉద్దెరకు ఇంధనం

## శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ సాయం.. భారత్ పెట్రోల్ బంకులతో ఒప్పందం



నగదు రహిత ఇంధనం స్కీంను ప్రారంభిస్తున్న శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఎండీ, సీఈవో ఉమేష్

**పటాన్‌చెరు రూరల్, నమస్తే తెలంగాణ:** జేబులో చిల్లిగవ్వ లేదు.. ప్రయాణిస్తున్న వాహనంలో ఇంధనం అయిపోయిందా.. అయినా ఇక చింతక్కర్లేదు. నేరుగా భారత్ పెట్రోల్ బంకుకు వెళ్లండి.. అక్కడ కావాల్సినంత ఇంధనం పోయించుకోండి. శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు, భారత్ పెట్రోలియంతో ఇలాంటి ఒప్పందం ఒకటి కుదుర్చుకున్నది. ఈ మేరకు పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని భారత్ పెట్రోల్ పంపులో నగదు రహిత ఇంధనం అందజేసే పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ టాన్స్‌పోర్టు ఫైనాన్స్ సంస్థ ఎండీ, సీఈవో ఉమేష్ జీ రేవంకర్ మాట్లాడుతూ.. తమ సంస్థ దేశంలోనే తొలిసారిగా నగదు రహిత ఇంధనం కొనుగోలు పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని, సంస్థలో సభ్యులైన 20 లక్షల మంది వినియోగదారుల్లో వాహనదారులకు, డ్రైవర్లకు ఈ సదుపాయం లాభిస్తుందన్నారు. ఇంధనం డబ్బులు తర్వాత చెల్లించుకునే సౌకర్యం కల్పించామన్న ఆయన వాయిదాల రూపంలోనూ ఇవ్వొచ్చన్నారు.

## సింగపూర్‌కు పెరుగుతున్న భారతీయులు

### సింగపూర్ టూరిజం ప్రాంతీయ డైరెక్టర్ శ్రీధర్



**హైదరాబాద్, జూలై 9:** ప్రతియేటా సింగపూర్‌ను సందర్శించే దేశీయ పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతున్నారు. గడిచిన సంవత్సరంలో 14 లక్షల మంది భారతీయులు సింగపూర్‌ను సందర్శించగా, ఈ ఏడాది మరో రెండు లక్షలు మేర పెరిగే అవకాశాలున్నాయని సింగపూర్ టూరిజం ప్రాంతీయ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. టూరిస్టులను ఆకట్టుకోవడానికి సింగపూర్ ప్రభు త్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, భారత్ నుంచి తొలిసారిగా పది లక్షల మంది కంటే అధికంగా రావడం ఇదే తొలిసారని ఆయన వ్యాఖ్యానించారు.

# హ్యుందాయ్ విద్యుత్ కారు వచ్చేసింది..

## సింగిల్ చార్జ్‌తో 452 కిలోమీటర్లు.. ధర రూ.25.30 లక్షలు

**న్యూఢిల్లీ, జూలై 9:** దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్.. తొలి పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ వాహనమైన ఎస్‌యూవీ 'కోన'ను దేశీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. విద్యుత్ వాహనాల వాడకాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఊతమిచ్చేలా కంపెనీ మంగళవారం ఈవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యుత్‌తో నడిచే వాహనాలపై పన్ను రాయితీలు ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడం శుభసూచికమని, అయినప్పటికీ కేంద్రం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని హెచ్ఎంఐఎల్ ఎండీ, సీఈవో ఎస్ఎస్ కిమ్ తెలిపారు. ప్రస్తుతం విద్యుత్‌తో నడిచే వాహనాలు తయారు చేయడం చాలా ఖరీదుతో కూడుకున్న విషయమన్నారు. ఈ నూతన కారు దేశీయ ఈవీల మార్కెట్‌ను పూర్తిగా మార్చివేయనున్నదని చెప్పారు. ఒక్కసారి రీచార్జి చేస్తే ఈ కారు 452 కిలోమీటర్ల మేర దూరం ప్రయాణించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. విభిన్న డ్రైవింగ్ సదుపాయం కలిగిన ఈ కారులో పలు నూతన ఫీచర్స్ ఉన్నాయని, 136 పీఎస్ శక్తిని ఇచ్చే ఈ కారు కేవలం 9.7 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం ఈ కారు ప్రత్యేకత. కారు బ్యాటరీ పూర్తిస్థాయిలో చార్జింగ్ కావడానికి ఆరు గంటల సమయం పట్టనున్నది. భద్రత ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంలో భాగంగా ఆరు ఎయిర్ బ్యాగులు, ఎలక్ట్రానిక్ బ్రేక్-ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్ కలిగిన యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఒత్తిడిన తట్టుకునే విధంగా టైర్లు, రియర్ కెమెరా వంటివి ఉన్నాయి.




### హైదరాబాద్ పరిశోధన కేంద్రంలో డిజైనింగ్..

హైదరాబాద్‌లో ఉన్న పరిశోధన కేంద్రంతోపాటు కొరియాలో ఉన్న ఆర్ అండ్ డీ సెంటర్లు ఈ కారును తీర్చిదిద్దినట్లు కిమ్ చెప్పారు. చెన్నైలో ఉన్న ప్లాంట్లోనే ఈ కారును తయారు చేయడానికి అత్యధికంగా విడిభాగాలు విదేశాల నుంచి దిగుమతి చేసుకోనున్నది. ప్రస్తుతానికి ఈ కారు దేశవ్యాప్తంగా 11 నగరాల్లో మాత్రమే విడుదల చేయనున్నట్లు, ముఖ్యం గా చార్జింగ్ స్టేషన్లు ఉన్న నగరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి చమురు విక్రయ దిగ్గజం ఇండియన్ ఆయిల్‌తో ఒప్పం దం కుదుర్చుకోనున్నట్లు ప్రకటించింది.

# రూ.18 వేల కోట్లిచ్చి పో..!

## విదేశాలకు అనుమతిపై జెట్ వ్యవస్థాపకుడు గోయల్‌తో ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, జూలై 9:** నరేశ్ గోయల్‌కు ఢిల్లీ హైకోర్టు షాకిచ్చింది. విదేశాలకు వెళ్లాలనుకుంటే ముందు రూ.18,000 కోట్లను పూచీకత్తుగా డిపాజిట్ చేయాలని సూచించింది. ఆపై నిరభ్యంతరంగా ఏ దేశానికైనా వెళ్లిరావచ్చని స్పష్టం చేసింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి విమానయాన సేవలకు దూరమైన దేశీయ ప్రైవేట్ రంగ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడే నరేశ్ గోయల్ అన్న విషయం తెలిసిందే. అప్పటిదాకా దేశం విడిచి వెళ్లరాదని తేల్చిచెప్పారు. జెట్ ఎయిర్‌వేస్ కేసును తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐవో) విచారిస్తున్నదని, రూ.18,000 కోట్ల రుణ బకాయిలు దీనికి ముడిపడి ఉందని కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ క్రమంలోనే న్యాయమూర్తి సురేశ్ పైవిధంగా స్పందించారు. 'బ్యాంక్ గ్యారెంటీగా రూ.18,000 కోట్లను డిపాజిట్ చేసేందుకు మీరు సిద్ధంగా ఉంటే.. విదేశాలకు వెళ్లొచ్చు' అని న్యాయమూర్తి అన్నారు. అప్పటిదాకా ఇంకెలాంటి ఆదేశాలను ఇవ్వలేమని చెప్పారు. తదుపరి విచారణను ఆగస్టు 23కు వాయిదా వేశారు.

### ఎల్‌వోసీ విచారణపై..

తనపై జారీ చేసిన లుకౌట్ నోటీసుల (ఎల్‌వోసీ)ను సవాల్ చేస్తూ గోయల్ వేసిన పిటీషన్‌ను హైకోర్టు విచారిస్తున్నది. ఇందులో భాగంగానే కేంద్రం వివరణను కోరింది. నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలంటూ హోం శాఖ, కార్పొరేట్ వ్యవహారాల శాఖ, న్యాయ శాఖలను ఆదేశించింది. మే 25న దుబాయ్‌కి వెళ్లే విమానం నుంచి గోయల్, ఆయన భార్య అనితా గోయల్‌ను అధికారులు దింపి వేసిన సంగతి విదితమే. వీరి వెంట తీసుకెళ్తున్న నాలుగు భారీ సూట్‌కేసులనూ స్వాధీనం చేసుకున్నారు. అయితే కారణం ఏమిటా? అని ఆరా తీసిన గోయల్‌కు ఎల్‌వోసీ సంగతి తెలియడంతో దీనిపై హైకోర్టును ఆశ్రయించారు. గోయల్‌పై ఎలాంటి ఈసీఐఆర్/ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. గోయల్ దంపతులు విదేశాలకు పారిపోతున్నారని సూచించేలా ఎలాంటి అనుమానిత పరిస్థితులు లేకున్నా.. ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారని, వారు ప్రవాస భారతీయులు.. కొంతకాలం విదేశాల్లో ఉండాల్సిన అవసరం ఉందని గోయిల్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్ కోర్టుకు చెప్పారు.



## 'మిట్టె'కు జలకళ



ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ సమీపంలోని మిట్టె జలపాతం జలకళను సంతరించుకుంది. సప్త గుండాలుగా పిలిచే ఈ జలపాతానికి వర్షాకాలం వచ్చిందంటే ఏటా సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివస్తుంటారు. పచ్చని చెట్లు, ఎత్తయిన నల్లని రాళ్లతో ఈ ప్రాంతంలో ప్రకృతి సోయగం కండ్లకు కట్టినట్టుగా కనిపిస్తుంది. - సిర్పూర్(యు)

## ఏపీలో చీకటిపడితే మందు బంద్?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో సాయంత్రం ఆరు గంటలు దాటితే మద్యం అమ్మకాలను బంద్ చేసే ప్రతిపాదనను ఆ రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ప్రభుత్వ కార్యాలయాల తరహాలోనే ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయించాలని.. కీలకమైన బ్రాండ్లను సైతం తగ్గించాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తున్నది. అక్టోబర్ నుంచి అమల్లోకి రానున్న కొత్త ఎక్సైజ్ పాలసీలో ఈ ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. ఇకపై మద్యం షాపులను కూడా ప్రభుత్వమే నిర్వహించాలన్న ప్రతిపాదన కూడా ఉన్నది.అయితే ఈ ప్రతిపాదనలపై మరింత లోతుగా అధ్యయనం చేసి, నివేదిక రూపొందించాలని అధికారులు నిర్ణయించారు.



## సీఎస్ జోషితో బీసీ కమిషన్ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములుతోపాటు సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయ గౌడ్, జూలూరు గౌరీశంకర్ మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ కమిషన్ జరుపుతున్న అధ్యయనం కోసం వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి తాము కోరిన సమాచారాన్ని త్వరితంగా అందజేసేలా ఆయా శాఖాధిపతులను ఆదేశించాలని వారు సీఎస్‌ను కోరారు. బీసీ కమిషన్ తెలుగులోకి అనువదించిన నివేదికలను ఈ సీఎస్‌కు అందజేశారు.

**బీసీలకు రూ.60వేల కోట్లు కేటాయించాలి**

కేంద్రబడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి రూ.60వేల కోట్లు కేటాయించేలా ప్రభుత్వానికి సిఫారసుచేయాలని బీసీ జాతీయ కమిషన్‌కు సీపీఐ అనుబంధ బీసీ హక్కుల సాధన సమితి విజ్ఞప్తిచేసింది. హైదరాబాద్‌కు వచ్చిన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ భగవాన్‌సహానీ, వైస్‌చైర్మన్ లోకేశ్‌కుమార్, సభ్యులు తల్లోజు ఆచారి, కౌశలేంద్రసింగ్, సుధాయాదవ్‌ను సమితి ప్రతినిధులు కలిశారు.



మంగళవారం సచివాలయంలో సీఎస్ ఎస్కే జోషిని కలిసిన బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్



# లక్ష మీటర్ల ఆర్డర్ లక్ష్యం

- కార్పొరేట్ సంస్థలను సంప్రదిస్తున్నాం
- ఆగస్టు 7న చేనేత దినోత్సవాన తెలియా రుమాల్‌తో ఫ్యాషన్ షో
- చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చేనేత రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు జాతీయస్థాయిలో ప్రముఖ సంస్థలను భాగస్వాములను చేయాలని నిర్ణయించినట్టు చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యార్ తెలిపారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేలా కార్పొరేట్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నామని, లక్ష మీటర్ల ఆర్డర్ తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని గోల్కొండ హస్తకళల కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. చేనేత వస్త్రాలను వినియోగించేలా రిలయన్స్, టాటా, అరవింద్ తదితర సంస్థలను కలిసి వివరిస్తున్నామని తెలిపారు. బెంగళూరులోని ఆ సంస్థల కార్యాలయాలను సంప్రదించామని, త్వరలో ఢిల్లీ, ముంబయి వంటి ప్రాంతాల్లో ఉన్న పెద్ద సంస్థలను సంప్రదించి వారినుంచి ఆర్డర్ తీసుకొనేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో తయారైన చేనేత వస్త్రాలకు మరింత ప్రాధాన్యం, మార్కెటింగ్ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నదని, ఈ చర్యలతో చేనేత వస్త్రాల విక్రయాలు పెరిగాయని చెప్పారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో వచ్చేనెల 7 నుంచి వారంపాటు చేనేత వస్త్ర ప్రదర్శన ఉంటుందని, అక్కడే ముఖ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లతో చేనేత వస్త్రాలతో ఫ్యాషన్ షో నిర్వహించనున్నామని, ఈసారి తెలియా రుమాల్‌తో షోను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. తెలియా రుమాల్‌ను తలకు కట్టుకుంటే చలికాలంలో వెచ్చగా, ఎండకాలంలో చల్లగా ఉంటుందని తెలిపారు. వీటికి ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉన్నదని, వీటిని సహజసిద్ధంగా తయారుచేయడానికి అవసరమైన ప్రోత్సాహన్ని చేనేత కళాకారులకు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. చేనేతరంగంలో విశిష్ట సేవలందించినవారికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు మీద చేనేత దినోత్సవాన అవార్డులను అందించనున్నట్టు తెలిపారు.



శైలజా రామయ్యార్

**ప్రముఖుల పిలుపుతో పెరిగిన వినియోగం**

నాటి ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు పిలుపుతో అనేక మంది ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరిస్తున్నారని, దీనిద్వారా చేనేత వస్త్రాల విక్రయాలు పెద్దఎత్తున పెరిగాయని శైలజా రామయ్యార్ తెలిపారు. సినీ నటి సమంత చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని, హీరో మహేశ్ బాబు, సానియా మిర్జా, సైనా నెహ్వాల్ లాంటి ప్రముఖులు చేనేత వస్త్రాలను ధరించి వీటికి మరింత ప్రాచుర్యం కల్పించారన్నారు. ప్రభుత్వ చర్యలతో గొల్లభామ చీరలకు డిమాండ్ ఏర్పడిందని, వచ్చే ఏడాది నాటికి పితాంబరి, ఆర్మూర్ చీరలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

## అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు

- మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రత్యేక సమావేశం
- వర్కర్స్, హెల్పర్స్ సంఘం ప్రతినిధులతో మంత్రి మల్లారెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం అందిస్తూ, వాటిని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. అంగన్‌వాడీ అంశంపై మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు మంత్రి మల్లారెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులన్నీ తీర్చుతున్నామని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా అవసరంలేకున్నా ఆందోళన చేస్తున్నారన్నారు. సమావేశంలో తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం భిక్షమమ్మ, ప్రతినిధులు శ్రీలత, సౌదామిని, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే సంస్థలను తనిఖీచేసిన జీఎం మాల్యా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా మంగళవారం జోనల్ కేంద్రం సికింద్రాబాద్‌లోని రైల్వే శిక్షణ, విద్యా సంస్థలను తనిఖీచేశారు. లాలాగూడలోని రైల్వే బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడారు. సౌత్‌లాలాగూడలోని ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ వసతిగృహాన్ని పరిశీలించారు. రైల్వే జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజీలను తనిఖీచేసి, ప్రయోగశాలలతోపాటు ఇతర వసతుల కల్పనపై మాట్లాడారు.

# శిక్షలు కఠినంగా ఉండాలి

- అధికారులకు ఆయుధాలివ్వాలి
- అటవీశాఖ రిటైర్డ్ అధికారుల సంఘం సదస్సు సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అటవీ నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేలా ప్రస్తుత చట్టంలో మార్పులు తేవాల్సిన అవసరమున్నదని అటవీశాఖ రిటైర్డ్ అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అడవులను కాపాడటానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకొంటూ అటవీ అధికారులకు ఆయుధాలనిచ్చే విషయాన్ని ప్రభుత్వం మరోమారు పరిశీలించాలని సమావేశం సూచించింది. 'అడవుల సంరక్షణలో సవాళ్లు' అనే అంశంపై అటవీశాఖ రిటైర్డ్ అధికారుల సంఘం మంగళవారం అరణ్యభవన్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సమావేశానికి రిటైర్డ్ ఉన్నతాధికారులు కృష్ణమూర్తి, బుచ్చిరామిరెడ్డి, బీఎస్ రావు, సోమశేఖరరెడ్డి, ఎస్‌డీ ముఖర్జీ, కేడీ ఆర్, జయకుమార్‌తోపాటు ప్రస్తుత ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా, పీసీసీఎఫ్‌లు పృథ్వీరాజ్, శోభ, అదనపు పీసీసీఎఫ్‌లు మునీంద్ర, లోకేశ్ జైస్వాల్, డోబ్రియాల్, స్వర్గం శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. అడవులను కాపాడటానికి, హరితహారం కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంచడానికి సీఎం కేసీఆర్ తీసుకొంటున్న చొరవను ప్రశంసించారు. గిరిజనులు, ఆదివాసీల ముసుగులో బడా స్మగ్లర్లు, స్థానిక రాజకీయ నేతలు చెలరేగుతున్నారన్నారు.

**అట్రాసిటీ కేసును ఉపసంహరించాలి**

సార్సాల ఘటనలో గాయపడ్డ అటవీశాఖ అధికారి అనితపై అట్రాసిటీ యాక్ట్ కింద నమోదైన కేసును ఉపసంహరించుకోవాలని అటవీశాఖ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు మోజం అలీ, కార్యదర్శి జవహర్ కోరారు.



అరణ్యభవన్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న అటవీశాఖ అధికారులు, రిటైర్డ్ అధికారులు

## ఈడీ మాజీ ఏడీ గాంధీ ఇంట్లో సీబీఐ సోదాలు

**హైదరాబాద్/ కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) బొల్లినేని శ్రీనివాసగాంధీకి చెందిన ఇండ్లలో సీబీఐ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీకాలనీ వసంత్‌నగర్‌తోపాటు ఏపీలోని విజయవాడలో ఉన్న ఆయన నివాసాల్లో ఏకకాలంలో జరిపిన సోదాల్లో రూ.3.75 కోట్ల అక్రమాస్తులను గుర్తించినట్టు సమాచారం. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై గతంలో నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో దర్యాప్తుచేసిన శ్రీనివాసగాంధీ.. ప్రస్తుతం సెంట్రల్ జీఎస్టీలో పన్నుల ఎగవేత వ్యతిరేక విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. గాంధీ దురుద్దేశంతో తనను కేసులపేరిట వేధించారని, అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపిస్తూ.. వైఎస్ జగన్ 2017 ఫిబ్రవరిలో ప్రధాని మోదీకి ఫిర్యాదుచేశారు.



కేపీహెచ్‌బీకాలనీలోని శ్రీనివాసగాంధీ ఇల్లు

# గ్యాస్‌కోసం వెదికితే ఖాతా ఖాళీ

- సైబర్ నేరగాళ్ల వలకు చిక్కిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు
- అసలు వెబ్‌సైట్ల గుర్తింపులో నిర్లక్ష్యంతో ప్రమాదం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గూగుల్ సెర్చ్ చేస్తున్నారా? అప్రమత్తంగా లేకపోతే సైబర్ నేరగాళ్ల ఫేక్ లింక్ వలకు చిక్కుకొనే ప్రమాదముంది. అవసరంలేని లింకుల్లో మన సమాచారం పొందుపరిస్తే ఖాతాలు గుల్లచేయడం ఖాయమని హెచ్చరిస్తున్నారు సైబర్‌క్రైం పోలీసులు. గ్యాస్ కనెక్షన్ కోసం వెతుకుతూ నకిలీ లింకుల మాయలోపడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు రూ.2 లక్షల వరకు దోపిడీకి గురైన ఘటన ఇటీవల రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెలుగుచూసింది. మల్కాజిగిరికి చెందిన దిలీప్ తేజ (పేరు మార్చాం) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గ్యాస్ కనెక్షన్ పొందేందుకు గూగుల్‌లో వెదికాడు. అనేక గ్యాస్ కంపెనీల వెబ్‌సైట్ల లింకులు కనిపించాయి. ఇండియన్ గ్యాస్ వెబ్‌సైట్‌ను తెరిచి ఆన్‌లైన్ గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించాడు. వెబ్‌సైట్‌లో అడిగినట్టుగా కొన్ని వివరాలు నమోదుచేయగా.. సదరు కంపెనీ నుంచి మాట్లాడుతున్నట్టు ఒక వ్యక్తి ఫోన్‌చేశాడు. మెయిల్‌కు పంపే లింకులో వివరాలు నమోదుచేయాలని నమ్మించాడు. సబ్సిడీ వేయడానికి బ్యాంకు అకౌంట్ వివరాలు కావాలని అడగడంతో.. బ్యాంకు ఖాతా, డెబిట్ కార్డు ఇలా అన్ని వివరాలను నమోదు చేశాడు. మరుక్షణమే దిలీప్ తేజ ఖాతా నుంచి రూ.లక్ష నగదు ఇతరుల ఖాతాకు బదిలీ అయినట్టు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మోసపోయానని తెలుసుకొని రాచకొండ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదుచేశా డు. ఇదే తరహాలో మరో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన వివరాలను గుర్తుతెలియని వ్యక్తులు పం పిన ఫిషింగ్ లింకులకు పంపి రూ.లక్ష పోగొట్టుకొన్నాడు.

**90 శాతం నకిలీ వెబ్‌సైట్ లింకులే**

గూగుల్ సెర్చ్ ఇంజిన్లో సైబర్ క్రిమినల్స్ తిష్ఠ వేసుకొని ఉన్నారు. నకిలీ లింకులను ఎరగా వేసి అమాయకులను దోచుకొంటున్నారు. గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో 90 శాతం నకిలీ వెబ్‌సైట్ లింకులే దర్శనమిస్తున్నాయి. బ్యాంక్ ఖాతా వివరాలు, క్రెడిట్, డెబిట్‌కార్డు సీవీవీ, పిన్ నంబర్లను అపరిచితులకు ఇవ్వకుండా జాగ్రత్తపడాలి.

– హరినాథ్, ఏసీపీ, రాచకొండ సైబర్‌క్రైం

## ఆర్థికంగా దెబ్బతీశాడనే
# అంతం

**వ్యాపారి రాంప్రసాద్ హత్య కేసులో కీలక పురోగతి**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వ్యాపారి తేలప్రోలు రాంప్రసాద్ హత్య కేసులో నగర పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. స్టీల్ వ్యాపారంలో తనను మోసంచేసి ఆర్థికంగా దెబ్బతీయడమే కాకుండా తనకు తెలిసిన పోలీసు అధికారులతో కుమ్మక్కై తప్పుడు కేసులు పెట్టించినందుకు ప్రతీకారంగానే ఈ హత్య జరిగినట్టు పోలీసులకు ఆధారాలు లభించాయి. ఇందులో మరో వ్యాపారి కోగంటి సత్యం కీలక సూత్రధారి అని అనుమానిస్తున్న క్రమంలో దానికి బలం చేకూర్చేలా పలు కీలక ఆధారాలు కూడా సేకరించిట్టు సమాచారం. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో పంజాగుట్ట పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఒకట్రెండురోజుల్లో కేసును కొలిక్కి తెచ్చే అవకాశాలు ఉన్నాయి. రాంప్రసాద్ హత్యకు ఉపయోగించిన బొలెరో వాహనాన్ని మంగళవారం గచ్చిబౌలిలో పంజాగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ వాహనం సత్యంకు చెందినదని గుర్తించారు. రాంప్రసాద్‌ను తామే హత్య చేశామంటూ శ్యాంతోపాటు అతడి అనుచరులు చోటూ, రమేశ్, నరేశ్ సోమవారం మీడియా ముందుకు వచ్చి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నలుగురిని వేర్వేరుగా విచారించడంతో పలుకీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్టు సమాచారం. సత్యం అనుచరుడే శ్యాం అని తేలడంతోపాటు.. శ్యాం కూడా రాంప్రసాద్‌పై పగ పెంచుకొన్నట్టు బయటపడింది. నిందితుల విచారణలో కొత్త పేర్లు కూడా బయటపడినట్టు తెలిసింది. ఈ విషయాలను నిర్ధారించుకొనేందుకు పోలీసు బృందాలు విజయవాడకు వెళ్లి మరింత సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యాయి.

# రాష్ట్రంలో ఉన్నత విద్య మెరుగు

**ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఉన్నత విద్యావిధానం మెరుగుపడుతున్నదని.. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించే విధంగా టీహబ్‌ను ఏర్పాటుచేశామని రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. 'అక్రెడిటేషన్, క్వాలిటీ, ఇంప్రూవ్‌మెంట్ అండ్ ర్యాంకింగ్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై గత రెండ్రోజులుగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సమావేశంలో పాల్గొన్న జయేశ్‌రంజన్ టీహబ్ గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. పారిశ్రామిక విధానాన్ని పటిష్టపర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణరావు ఉన్నత విద్య, సాంకేతిక విద్యాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, నాణ్యమైన విద్యా విధానంపై ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, రాష్ట్ర కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, యూజీసీ సభ్యుడు ప్రొఫెసర్ జీ గోపాల్‌రెడ్డి, న్యాక్ బెంగళూరు సలహాదారు డాక్టర్ కే రాము, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సెక్రటరీ ప్రొఫెసర్ పంకజ్ మిట్టల్, ప్రొఫెసర్ వీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



'అక్రెడిటేషన్, క్వాలిటీ, ఇంప్రూవ్‌మెంట్ అండ్ ర్యాంకింగ్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్' సదస్సులో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

## రవిప్రకాశ్ క్యాష్ పిటిషన్లపై విచారణ 21కి వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అలందా మీడియా ఫిర్యాదు మేరకు పోలీసులు తనపై నమోదుచేసిన నాలుగు ఎఫ్‌ఐఆర్‌లను కొట్టేయాలంటూ టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ దాఖలు చేసిన వేర్వేరు క్వాష్ పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈ నెల 21కి వాయిదావేసింది. దీంతోపాటు సైబర్‌క్రైం పోలీసులు తనపై నమోదుచేసిన కేసును కొట్టేయాలని సినీనటుడు శివాజీ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కూడా ఈ నెల 21కి హైకోర్టు వాయిదా వేసింది.

## కేసు కొట్టేయండి

**హైకోర్టును ఆశ్రయించిన హృతిక్ రోషన్, కల్ట్‌ఫిట్**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కల్ట్‌ఫిట్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్.. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో తమపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలుచేశారు. రోజువారీ వర్కవుట్ సెషన్ల ద్వారా బరువు తగ్గిస్తామంటూ తప్పుడు ప్రచారం చే శారంటూ ఓ యువకుడు కల్ట్‌ఫిట్ సంస్థతోపాటు హృతిక్ రోషన్‌పై పోలీసులకు ఫిర్యాదుచేశారు. కల్ట్‌ఫిట్ డైరెక్టర్లు, కల్ట్‌ఫిట్ బ్రాండ్ అంబాసిడర్ హృతిక్‌రోషన్‌పై కేసుచేశారు. ఫిర్యాదులో వాస్తవం లేదని వారు కోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ చేపట్టి.. నిందితులకు వ్యతిరేకంగా తీవ్ర చర్యలు చేపట్టరాదని ఆదేశించింది.

# జోరుగా పురపోరు ప్రక్రియ

- నేడు వార్డులవారీగా ఓటర్ల డ్రాఫ్ట్
- 18 మున్సిపాలిటీల్లో అదనపు కమిషనర్లుగా ఎంపీడీవోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) వేగవంతం చేసింది. పలు షెడ్యూళ్లను సవరిస్తూ ఎస్‌ఈసీ మంగళవారం ఆదేశాలు జారీచేసింది. పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాపై రాజకీయపక్షాలతో విడివిడిగా సమావేశం జరుపాలని మున్సిపల్ కమిషనర్లు, కార్పొరేషన్ అధికారులకు ఉత్తర్వులిచ్చింది. పోలింగ్ కేంద్రాలను ఫైనల్ చేయాలని ఆదేశించింది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో భాగంగా సవరించిన షెడ్యూల్‌ను ఎస్‌ఈసీ విడుదల చేసింది. ఈ నెల 14న పోలింగ్ కేంద్రాల ముసాయిదా సిద్ధంచేసి, 15న అన్ని మున్సిపాలిటీల్లో విడుదలచేయాలని సూచించారు. ఈ నెల 17 సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను స్వీకరించాలని, 18న తుదిజాబితాను కలెక్టర్లకు అందించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. 19న తుదిజాబితాను మున్సిపాలిటీల్లో విడుదలచేయాలని ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ చెప్పారు.

**నేడు ఓటరు జాబితా ముసాయిదా**

రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో బుధవారం వార్డులవారీగా ఫొటో ఓటర్ల ముసాయిదాను విడుదలచేయాలని ఎస్‌ఈసీ ఆదేశాలిచ్చింది. దీనిపై అన్ని రాజకీయపక్షాలతో గురువారం సమావేశం ఏర్పాటుచేయాలని, తుది జాబితాను ఈ నెల 14న వార్డుల్లో విడుదలచేయాలని పేర్కొన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా జాయింట్ కలెక్టర్లను అదనపు ఎన్నికల అధికారులుగా నియమిస్తూ ఎస్‌ఈసీ ఉత్తర్వులిచ్చింది. గ్రేటర్ హైదరాబాద్, మహబూబాబాద్ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో జేసీలు అదనపు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. మహబూబాబాద్ జిల్లాలో జిల్లా డీపీవోను డిప్యూటీ ఎన్నికల అధికారిగా నియమించారు.

**నిర్వహణకు ఏర్పాట్లు**

ఎన్నికల నిర్వహణకు ఎస్‌ఈసీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్లు సంయుక్తంగా మంగళవారం కీలక నిర్ణయం తీసుకొన్నాయి. 18 కొత్త మున్సిపాలిటీల్లో తాసిల్దార్ల స్థానంలో ఎంపీడీవోలను అదనపు కమిషనర్లుగా నియమిస్తూ నిర్ణయం తీసుకొన్నాయి. రాయికల్, భూత్పూర్, కోస్గి, మంచిర్యాల, తూంకుంట, నందికొండ, హాలియా, చండూరు, ఖానాపూర్, అమన్‌గల్, నేరేడుచర్ల, తిరుమలగిరి, పోచంపల్లి, యాదగిరిగుట్టలకు సమీప ఎంపీడీవోలను అదనపు కమిషనర్లుగా నియమించారు. ధర్మపురి, మక్తల్, చిట్యాల, అమరచింతలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించారు.

## పండ్ల పక్వానికి 'ఎన్‌రైప్ పౌడర్'

- సహజసిద్ధంగా తీసుకొచ్చిన హైటెన్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
- ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్, చైనా పౌడర్లకు ప్రత్యామ్నాయం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పండ్ల తోటల రైతులకు మంచిరోజులు రానున్నాయి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఉద్యానశాఖకు విస్తృత ప్రాధాన్యమిస్తున్న విషయం తెలిసిందే. దళారుల దోపిడీకి తావులేకుండా రైతులు తమ పంటను మగ్గబెట్టి నేరుగా మార్కెట్లో విక్రయించడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందేందుకు వీలుకల్పించే 'ఎన్‌రైప్ పౌడర్' అందుబాటులోకి వచ్చింది. విషతుల్యమైన కాల్షియం కార్బైడ్, చైనా పౌడర్‌కు ప్రత్యామ్నాయంగా హైటెన్ ఇన్నోవేటివ్ సొల్యూషన్ సంస్థకు చెందిన నిపుణులు 'ఎన్‌రైప్ పౌడర్'ను తెలంగాణ మార్కెట్లోకి తీసుకొచ్చారు. సహజసిద్ధమైన స్టార్చ్ (గంజి)లో ఉండే ఇథలిన్, మాడ్చిన కొబ్బరి చిప్పల పొడితో దీన్ని రూపొందించడంతో పండ్లు సేంద్రియ పద్ధతిలో పక్వానికొస్తాయని హైటెన్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ డైరెక్టర్ ప్రమోద్‌రెడ్డి వివరించారు. మంగళవారం ఆయన మాసాబ్‌ట్యాంక్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశీయ మార్కెట్లలో దొరికే పండ్లు విషతుల్యంగా ఉంటున్నాయన్నారు. ఈ సమస్యలను నిరోధించడానికి సహజసిద్ధంగా 'ఎన్‌రైప్ పౌడర్'ను రూపొందించామన్నారు.




# సోలార్‌తో చెక్ పెట్టింది





**ఆమె మెట్రోపాలిటన్ సిటీలో నివాసం ఉంటుంది. అన్నీ అధిక ధరలే. దానికి తోడు కరెంటు బిల్లు పదివేలు వచ్చేది. ఈ సమస్య ఆమెను ఆలోచింపజేసింది. వెంటనే పరిష్కారాలను ఆలోచించి, ఇతరులకు అవగాహన కల్పిస్తున్నది.**

డాక్టర్ రీమా బెంగళూర్‌కు చెందిన 32 ఏండ్ల మహిళ. ఫిజియోథెరపిస్ట్‌గా పని చేస్తున్నది. ఆమెకు ప్రకృతి ఇంటే ఇష్టం. చెట్లు, మొక్కలు, పక్షులతో ఎక్కువ సంబంధాన్ని కలిగి ఉంది. పెండ్లి తర్వాత ముంబైకి వచ్చింది. అక్కడ లివింగ్ స్పేస్‌లో పచ్చదనాన్ని పరిచయం చేసింది. టెర్రస్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకుంది. కొన్ని రోజుల తర్వాత.. మొదటిసారి ఆమె కరెంట్ బిల్లు సమస్యను ఎదుర్కొన్నది. ఒక్కోనెల 10 వేల రూపాయలకు పైగా వచ్చేది. దీన్ని ఎలాగైనా అధిగమించాలని సోలార్ ప్యానల్‌ను అమర్చింది. అదే ఆలోచనను విస్తరించింది. రోజూ వాడే కారుకు కూడా సోలార్ ప్యానల్ పెడితే ఎలా ఉంటుందని ఆలోచించి వెంటనే ఆ పని చేసింది. మహీంద్రా ఈ20 కారుకు సోలార్ ప్యానల్స్‌ని అమర్చింది. ఆరు గంటలు సోలార్ శక్తిని గ్రహిస్తే అది వంద కిలోమీటర్లు ప్రయాణిస్తుందని ఆమె చెబుతున్నది. ఇలా పదివేలు ఉన్న కరెంట్ బిల్లును రూ. మూడు వందలకు తగ్గించుకుంది. ఇదీ కేవలం కనిష్ఠ ధరే. దీంతో పాటు రీమా చుట్టుపక్కల వాళ్లకు కూడా సోలార్ వ్యవస్థ మీద, ఎకో ఫ్రెండ్లీ సిస్టమ్ మీద అవగాహన కల్పిస్తున్నది.



**గుడ్డు కనిపిస్తే.. ఆమ్లెట్ వేయాలనిపిస్తుంది..**
**లేకపోతే ఉడికించి గుటకాయ స్వాహా చేయాలనిపిస్తుంది..**
**అదే గుడ్డు చెఫ్‌ల చేతిలో పడితే.. రకరకాల వంటకాలు చేయాలని అనుకుంటారు..**
**ఎవరైనా గుడ్డు పెంకును మాత్రం చెత్త బుట్టలోకే చేరుస్తారు..**
**కానీ ఫర్హా సయీద్ మాత్రం వాటితో..**
**అబ్బురపరిచే కళాకృతులను తయారు చేస్తున్నది..**
**భారత్‌లో ఏకైక ప్రొఫెషనల్ ఎగ్ ఆర్టిస్ట్‌గా కూడా పేరు తెచ్చుకున్నది..**
**సున్నితమైన గుడ్డు పెక్కును చెక్కిన శిల్పంలా మార్చేందుకు**
**ఈ వెరీగుడ్డు ఆర్టిస్ట్ ఏం చేసిందో తెలియాలంటే ఈ స్టోరీలోకి వెళ్లాల్సిందే!**







# ఎగ్‌స్ట్రార్డినరీ బొమ్మలు!



**కళాకారుల కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందడం, అదే ఆమె జీవితాన్ని మార్చేస్తుందని ఏనాడూ అనుకోలేదు. కాగితాలు, గాజు, అయస్కాంతాలు ఇలా కనిపించిన వాటికి పెయింటింగులు వేసి సరికొత్త రూపాన్ని తీసుకొస్తుంది ఫర్హా. కంటికి కనిపించిన దేన్నీ వదలదు. మామూలుగా చాలామందిలో ఒక వస్తువుని చూసినప్పుడు ఎలాంటి ఆలోచనలు రావు. మనసులో బలంగా దేన్నయినా వెతుకుతుంటే ప్రతిదాంట్లోనూ అనుకున్నదే ప్రతిబింబిస్తుందని ఫర్హా సయీద్ గట్టిగా నమ్ముతుంది. ఆ నమ్మకమే ఎగ్‌షెల్‌లో ఎంతో కళాత్మకత ఆమెకు కనిపించింది. గుడ్డును అందమైన ఆకృతిగా తీర్చిదిద్దాలంటే అంత సులువు కాదు. ఒక శిల్పి శిల్పాన్ని చెక్కుతున్న సమయంలో కొంచెం అజాగ్రత్త వహించినా ఆ శిల్పం రూపురేఖలు మారిపోతాయి. ఎగ్‌షెల్‌ను కొంచెం గట్టిగా పట్టుకుంటే చాలు పగిలిపోతుంది. మరి అంత సున్నితమైన గుడ్డు పెంకుతో ఆమె ప్రయాణం అంత ఆషామాషీగా సాగలేదు.**

ఎగ్ ఆర్ట్ కోసం చాలా రకాల గుడ్లను సేకరించింది ఫర్హా. గుడ్లను యేడాదంతా ఆర్డర్ చేస్తూనే ఉంటుంది. అయితే ఇవన్నీ రసాయనాలు వాడని గుడ్లు కావడం గమనార్హం. మరికొన్ని ఫామ్ నుంచి తెప్పిస్తుంది. గుడ్లు తెప్పించుకునే సమయంలో చాలాసార్లు అవి దెబ్బతింటుంటాయి. దిగుమతి చేసుకునే సమయానికి చాలా గుడ్లు పగిలిపోతుంటాయి. ఎగ్స్‌ను రకరకాల రాళ్లతో, ముత్యాలతో అలంకరించడానికి 4 నుంచి ఆరు వారాలు పడుతుంది. కొన్నింటికి బంగారు, సిల్వర్ రంగులో డిజైన్స్‌ను ఎగ్‌షెల్స్‌పై అమర్చడానికి ఎక్కువ టైం తీసుకుంటుంది. ఆర్ట్ కోసం తీసుకున్న గుడ్డును జాగ్రత్తగా చెక్కాలి. క్లోరాక్స్‌తో వాటిని డిస్-ఇన్ఫెక్ట్‌గా చేయాలి. వీటిపైన గెస్సో పెయింటింగ్ వేయాలి. ఆ తర్వాత ఆక్రిలిక్ పెయింటింగ్‌తో మృదువుగా మంచి ఫినిషింగ్ వచ్చేలా వేయాలి. ఎగ్‌షెల్స్ చాలా సున్నితంగా ఉంటాయి. ఆర్ట్‌కు కావాల్సిన నీడిల్ బేస్డ్, రొటేటర్స్ పరికరాలు అమెరికా నుంచి తెప్పించుకుంటుంది. ఒక ఆర్ట్‌లా మరొకటి ఉండదు. దేనికి అది భిన్నంగా చేయడం ఫర్హా స్పెషాలిటీ!

**ఇదొక సవాల్..**

చిన్నప్పటి నుంచి ఫర్హాకు ఆర్ట్ అంటే బాగా ఇష్టం. ఆమె భర్త అసఫ్ సయీద్ సౌదీ అరేబియాలో ఇండియన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్నారు. ఫర్హా అక్కడున్నప్పుడు ఒకరోజు 'ఎగ్ ఆర్ట్' తెలిసిన రష్యా కళాకారుల గురించి విన్నది. ఆర్ట్‌పై ఆమెకున్న ఆసక్తితో వారిని కలిసింది. వారి కళా నైపుణ్యం తనని కట్టిపడేశాయి. కానీ ఆ సమయంలో ఆర్ట్ నేర్చుకునే కంటే మిగతా కళల మీద పట్టు సాధించాలనుకుంది. అందుకే.. ముందు సిల్క్ పెయింటింగ్, చార్‌కోల్ పెయింటింగ్, థర్మాకోల్ పెయింటింగ్, టైల్స్ పెయింటింగ్, అల్యూమినియం ఫాయిల్ వర్క్, పెన్సిల్ స్కెచింగ్, గ్లాస్ పెయింటింగ్, గ్లిటర్, జర్దోసి వర్క్, సాఫ్ట్ టాయిస్ తయారీ, కాలిగ్రఫీ ఇలా అన్ని కళల్లో ప్రావీణ్యం పొందిన తర్వాతే 1998లో ఎగ్ ఆర్ట్ మొదలుపెట్టింది. ఎగ్ ఆర్ట్‌లో నిప్పుకోడి గుడ్డు, బాతులా ఉండే నీటి పక్షి గుడ్డు, టర్కీ కోడి గుడ్డు, గినియా, రియా, ఈమూ, ఫ్యూజన్ ఎగ్, బాతు గుడ్లు, మిక్స్‌డ్ ఎగ్ గుడ్ల షెల్స్‌ను తీసుకొని వాటిపై ఆర్ట్ వేయడం ప్రారంభించింది. పల్లకిలో రాణి, లైట్‌హౌస్, రథం, నిద్రిస్తున్న పాపాయి, షెల్‌లో దాగున్న గడియారం, షెల్‌పై ఇతర పక్షుల బొమ్మలు, జీసస్, హిందు, ముస్లిం, మూలాంశాలకు సంబంధించిన ఫ్యూజన్‌ను తన కళాకృతుల్లో చూడొచ్చు. ఈ ఆర్ట్‌కు సృజన ఎంత అవసరమో ఓర్పు, సహనం అంతే అవసరం. అవి ఫర్హాలో చాలా ఎక్కువ. అందుకే అంతర్జాతీయ ఎగ్ ఆర్టిస్టుల జాబితాలో ఏకైక భారతీయ ఎగ్ ఆర్టిస్ట్‌గా నిలబడగలిగింది.



**హైదరాబాదీనే..**

నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. నవాబు టిపు మొహ్మద్‌ఖాన్ బహదూర్ కుటుంబానికి చెందిన నేను వనితా మహావిద్యాలయంలో చదువుకున్నాను. బీఏ ఇంగ్లీష్ లిటరేచర్ చేశా. మా కుటుంబంలో అందరూ ఆర్టిస్ట్‌లే. వారి నుంచే నాకు ఈ విద్య అబ్బింది. స్కూల్ ఆర్ట్ క్లాసులో చాలా ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. హాలిడేస్‌లో ఆర్ట్స్ ట్రైనింగ్ క్లాసులకు వెళ్లేదాన్ని. ఎగ్ ఆర్ట్ తెలిసినప్పటి నుంచి దాన్ని ప్యాషన్‌గా మార్చుకున్నాను. 20 యేండ్ల నుంచి ఈ ఆర్ట్ మీద సాధన చేస్తూ ప్రయోగాలు చేస్తూనే ఉన్నా. నాకు ముగ్గురు కుమారులు. వారిని దేశం గర్వించేలా తీర్చిదిద్దుతాను.

**భారత సంస్కృతి తలపించేలా..**

హిందూ, ఇస్లామిక్ మూలాంశాలను సృజించడంలో నేను మార్గదర్శకురాలినవడం చాలా సంతోషంగా ఉంది. కాలిగ్రఫీని కూడా ఎగ్‌ఆర్ట్‌లో భాగం చేశా. ఆర్ట్ వేసే ముందు ఎగ్‌షెల్‌ను చాలా జాగ్రత్తగా నేర్పుగా కట్ చేయాలి. ముత్యాలు, పైసలు, స్ఫటికాలు, ఫిలిగ్రీ, వెల్‌వెట్, సాటిన్, గోల్డెన్ లేసులు, రైన్‌స్టోన్, గొలుసులు వీటన్నింటితో అలంకరిస్తాను. డికొపేజ్, ట్రోలింగ్, ఎట్చింగ్, ఎంగ్రేవింగ్, డయింగ్, బీడ్ వర్క్ వంటి టెక్నిక్స్‌ని వాడుతాను. షెల్స్ పగులకుండా వాటి సహజ అందాన్ని పరిరక్షించేందుకు ద్రవరూపంలోని పాలిమర్ ఉపయోగిస్తాను. ఇప్పటివరకు ఎగ్ కళాకృతులతో సోలో ఎగ్జిబిషన్లను ఎగ్‌స్ట్రావాంజా, ఎగ్స్‌ప్రెషన్స్, ఎగ్జోటికా, ఎగ్స్‌లెన్స్, ఎగ్స్‌పీరియన్స్, జద్దా, న్యూఢిల్లీ, యెమన్, షికాగోలలో నిర్వహించా.



**ఆర్టిస్ట్ మాత్రమే కాదు..**

ఫర్హా ఆర్టిస్ట్‌గానే మిగిలిపోవాలనుకోలేదు. పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నది. ఎగ్ ఆర్ట్‌తో వచ్చే డబ్బుని కొంచెం సేవా కార్యక్రమాలకు ఇస్తున్నది. 'హెడ్స్ ఆఫ్ మిషన్ స్పౌసెస్ అసోసియేషన్' (హెచ్‌ఓఎంఎస్‌ఏ)కు 2011-2013 వరకూ అధ్యక్షులుగా ఉన్నారామె. జెద్దాలోని స్వచ్ఛంద సంస్థ మహిళలకు సంబంధించిన 'భారత యాత్రికుల సంక్షేమ వేదిక'కు చీఫ్‌గా ఉంటూ భారత దేశం నుంచి హజ్ యాత్రకు వెళ్లే మహిళలకు వైద్యం, మందులు ఇతర విషయాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ఇస్తుంది. అక్కడ ఉంటున్న దివ్యాంగులైన పిల్లలకు అండగా నిలబడింది. ఇద్దరు మహిళల సాయంతో ఇంటర్నేషనల్ బజార్‌ను నిర్వహించి వచ్చిన డబ్బుని హోప్ సెంటర్‌కు ఇస్తుంది. దాంతో ఇప్పుడు శాశ్వత హోప్ సెంటర్‌గా ఏర్పాటు చేసుకోగలిగింది. దేశంలో నడుస్తున్న పలు స్వచ్ఛంద సంస్థల్లో పాలుపంచుకుంటున్నది ఫర్హా.

... వనజ వనిపెంట

# వంటగది ఇలా.. శుభ్రంగా!



- వంటపాత్రలపై ఉన్న జిడ్డు, మరకలను వదిలించుకోవడానికి తెల్లని వెనిగర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇది వంట పాత్రల అడుగున ఉండే గుడ్డు, వెల్లుల్లి మరకలను తొలిగిస్తుంది.
- వంటగది స్లాబ్‌పై ఉన్న గ్రీజు మరకలను తొలిగించడానికి నిమ్మరసాన్ని స్ప్రే చేయవచ్చు. టీ పాత్రలను శుభ్రం చేయడానికి, చెత్త బుట్టల నుంచి వచ్చే చెడు వాసనను నిర్మూలించడానికి నిమ్మరసాన్ని ఉపయోగించవచ్చు.
- సింక్ నుండి దుర్వాసన వస్తున్నదా? అయితే దీన్ని వదిలించడానికి బేకింగ్ సోడాను వెదజల్లండి.
- బాగా తడిసిన అల్యూమినియం పాత్రల నుంచి తుప్పును వదిలించడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఉప్పు, తెల్లని వెనిగర్‌తో పాత్రలను స్క్రబ్ చేసి శుభ్రపరుచవచ్చు.
- వంటగదిలోని స్టవ్, దాని సందులు మూలాలను శుభ్రం చేయడానికి తడి దూదిని ఉపయోగించవచ్చు.
- జిడ్డు పాత్రలతో పాటు నేలను ద్రాక్షపండుతో శుభ్రపరుచవచ్చు. ఇది పాత్రల నుంచి గ్రీజును తొలిగించడానికి ఒక డిష్ స్క్రబర్‌గా ఉపయోగపడుతుంది.
- మైక్రోవేవ్ నుంచి గాఢమైన వాసనలను తొలిగించాలంటే.. నిమ్మరసం కలిపిన వేడినీటిని పది నిమిషాల పాటు మైక్రోవేవ్‌లో ఉంచాలి. ఇది సిట్రస్ ఫలం వాసనను వదిలిస్తుంది. ఆ తర్వాత పొడిబట్టతో తుడువాలి.

# ఎకోఫ్రెండ్లీ పెన్సిళ్లు





**ప్రపంచవ్యాప్తంగా 20 బిలియన్ పెన్సిల్స్ తయారు చేయడానికి ప్రతీ ఏడాది 8 మిలియన్ చెట్లను నరికివేస్తున్నారట. అలాగే కాగితాలు తయారు చేయాలన్నా ఇదే పరిస్థితి. అవసరం లేని న్యూస్‌పేపరతో పెన్సిల్స్ తయారు చేస్తే ఎలా ఉంటుందనుకున్నారో దంపతులు.**





బెంగళూరుకు చెందిన అక్షత భద్రన్న, రాహుల్ పగడ్ న్యూస్ పేపర్లతో పెన్సిల్స్ తయారు చేస్తున్నారు. వీరు ఇంతకుముందు ఇండోనేషియాలో ఉండేవాళ్లు. ప్రపంచంలోని అత్యంత ప్లాస్టిక్ వినియోగంలో ఇండోనేషియా రెండవ స్థానంలో ఉన్నది. అది తెలుసుకొని వీరు ఇండోనేషియా నుంచి ఇండియాకు తిరిగి వచ్చారు. ఇక్కడ కూడా వాడకం పెరుగుతుందనిపించింది. దాన్ని ఎలాగైనా తగ్గించాలనుకున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి వాటికి సంబంధించిన వీడియోలు చూశారు ఈ దంపతులు. ప్లాస్టిక్ వస్తువులన్నింటినీ ఎకోఫ్రెండ్లీగా మార్చాలని ఓ ఆలోచన చేశారు. ఇంటి చుట్టూ ఉన్న చెత్తని కంపోస్ట్‌గా మార్చారు. ప్లాస్టిక్ టూత్‌బ్రష్‌కు బదులుగా వెదురుతో బ్రష్‌లను తయారుచేశారు. వీరు చేస్తున్న ప్రొడక్ట్స్‌కి 'డోపాల్జీ' అనే పేరుతో ఆన్‌లోనే అమ్మకానికి పెట్టారు. రాహుల్ చేస్తున్న మార్కెటింగ్ ఉద్యోగం విరమించుకొని ఎకో-ఫ్రెండ్లీ ప్రొడక్ట్స్‌పై దృష్టి సారించారు. చైనా నుంచి న్యూస్‌పేపర్స్‌ను పెన్సిల్స్‌గా మార్చే యంత్రాన్ని తీసుకొచ్చారు. న్యూస్ పేపర్లను పెన్సిల్ మాదిరిగా మెషీన్ రోల్ చేస్తుంది. ఇది ఆరడానికి 30 నిమిషాల సమయం తీసుకుంటుంది. 6,000 న్యూస్‌పేపర్లతో 10,000 పెన్సిల్స్‌ని తయారు చేశారు అక్షత, రాహుల్. వీటితో పాటు జాస్మిన్, బంతిపూలు, కొత్తిమీర, ఉల్లిగడ్డ విత్తనాలకు వచ్చే కాగితాలను .. వెడ్డింగ్ కార్డ్, ఇన్విటేషన్ కార్డ్, పోస్ట్‌కార్డ్, విజిటింగ్ కార్డ్‌లు అన్నమాట. ఎకో-ఫ్రెండ్లీ ప్రొడక్ట్స్‌కు ఢిల్లీ, ముంబై, పంచకుల, అమృత్‌సర్ నగరాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయంటున్నది అక్షత. వ్యర్థ టెట్రాప్యాక్స్ నుంచి షార్ప్‌నర్స్‌ను తయారు చేస్తున్నారు.



**అడుగండి చెబుతా**

# నడుము నొప్పికి కారణమేంటి?

**నా వయసు 35 సంవత్సరాలు. నాలుగేళ్లుగా నాకు నడుము దగ్గర నొప్పిగా ఉంటున్నది. ఎడమ వైపు నుంచి కుడి వైపునకు తిరిగేటప్పుడు, ఎక్కువ సేపు కూర్చున్నా, ముందుకు వంగినా నడుము విపరీతంగా నొప్పి పెడుతున్నది. ఇది నడుం నొప్పా? ఎందుకు వస్తున్నది? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలియజేయగలరు.**

**- కె. భవాని,** కామారెడ్డి

మీ శరీర ఎత్తు ఎంతో తెలియజేయలేదు. బరువు కూడా చెప్పలేదు. నా అంచనా ప్రకారం మీరు అధిక బరువు కలిగి ఉంటారనుకుంటున్నా. ఎందుకంటే బరువు అధికంగా ఉన్నవారికే ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. పైగా ఈ సమస్య నాలుగేళ్ల నుంచి ఉందంటున్నారు కాబట్టి పెద్దగా సీరియస్ జబ్బులాంటిదేమీ కాకపోయి ఉండొచ్చు. మీ సమస్య నడుము నొప్పిలాంటిదే. నడుము నొప్పితో పాటు కాళ్లు లాగుతున్నట్లు ఉంటే మాత్రం వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్‌లకు సంబంధించిన సమస్య అయి ఉంటుంది. కేవలం నడుములోనే నొప్పి, అది పక్కలకు తిరుగుతున్నప్పుడు ఎక్కువగా ఉంటుంది అంటున్నారు కాబట్టి దీనిని 'మెకానికల్ బ్యాక్ పెయిన్' అంటారు. అధిక బరువు వల్ల వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్‌లు అరిగి కొంచెం నలిగి దానివల్ల నొప్పి వస్తుండవచ్చు. కాబట్టి స్పెషలిస్ట్‌ను కలిసి పరీక్ష చేయించుకోవడం మేలు. అధిక బరువు కారణం థైరాయిడ్ లోపం, పీసీఓడీ సమస్య అయి ఉండొచ్చు.



**డాక్టర్ ఆనంద్ బాబు**
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్
కేర్‌హాస్పిటల్,
ముషీరాబాద్

# ఈ రసాలతో అందం!



- ప్రతిరోజు తప్పని సరిగా ఎక్కువగా నీరు తాగాలి. అలా తాగడం వల్ల చర్మం పొడిబారిపోకుండా ఎంతో తేజోవంతంగా, అందంగా కనిపిస్తుంది. ముఖంపై మొటిమలు, మచ్చలు తొలిగి చర్మం ఎంతో కాంతివంతంగా కనిపిస్తుంది.
- క్యారెట్‌లో విటమిన్ ఎ, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. కనుక ప్రతిరోజు క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది కంటిచూపును మెరుగుపరుస్తుంది.
- బీట్‌రూట్ జ్యూస్ క్రమం తప్పకుండా తాగడం వల్ల రక్తంలోని ఎర్రరక్తకణాల సంఖ్య పెరుగుతుంది. ఈ జ్యూస్ రక్తంలోని మలినాలను తొలిగిస్తుంది. కిడ్నీలను శుద్ధి చేస్తుంది. దీనిని తరచూ తాగడం వల్ల చర్మ సౌందర్యాన్ని మరింతగా పెంచుకోవచ్చు.
- టమాటాలను జ్యూస్ చేసి ప్రతిరోజు తాగడం వల్ల కూడా ఎంతో ఆకర్షణీయమైన చర్మాన్ని పొందవచ్చు. యాపిల్ జ్యూస్ కూడా శరీరానికి మంచిపోషణను ఇచ్చి చర్మాన్ని అందంగా చేస్తుంది.

నమస్తే తెలంగాణ
యువ
[ కరీంనగర్ ]
బుధవారం 10 జూలై 2019

# గాలితోనే బతికేస్తున్నది!

**ఆమె గాలిని మాత్రమే ఆహారంగా తీసుకుంటున్నది. దాన్నే ఆంగ్లంలో బ్రీతరియనిజం అంటారు. కానీ కొన్ని షరతులకు లోబడాల్సిందే. అవేంటంటే గాలితో పాటు అప్పుడప్పుడు టీ, జ్యూస్‌లు కూడా తాగడం. ద్రవ పదార్థాలు తాత్కాలికంగా మాత్రమే ఆకలి తీరుస్తాయి. అయినా ఆమె హ్యాపీగా బతకడం వెనుక కారణమేంటంటే..**




**30 ఏండ్ల** అదురా స్వస్థలం అమెరికాలోని మిన్నెయాపోలీస్. ఈమె గత 97 రోజులుగా గాలిని మాత్రమే పీలుస్తూ జీవిస్తున్నది. ఫిట్‌నెస్ కోసం ఎన్నో రకాల ఆహారాన్ని ప్రయత్నించి విసిగిపోయింది. చివరికి 'బ్రీతరియనిజం' (గాలిని పీలుస్తూ బతికేయడం) గురించి తెలుసుకుంది. ఇండియాలో యోగా, ధ్యానం చేసేవారు ఎక్కువగా శ్వాసతో శరీరాన్ని అదుపు చేస్తుంటారనే విషయాన్ని తెలుసుకున్న ఆమె దాన్నే డైట్‌గా పాటించడం మొదలు పెట్టింది. ఈమె డైట్ గురించి తెలుసుకున్న వైద్యులు గాలిని పీలుస్తూ బతకడం చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. శరీరానికి తగిన శక్తి లభించాలంటే పోషకాలు అందాలని సూచించారు. ఈ నేపథ్యంలో అదురా అప్పుడప్పుడూ టీ, పండ్ల జ్యూస్‌లను తాగుతూ శరీరం నియంత్రణ కోల్పోకుండా జాగ్రత్త పడుతున్నది. అయితే తన మాదిరిగా ఎవ్వరూ ప్రయత్నించవద్దని, ఫిట్‌నెస్ కోసం కడుపు మాడ్చుకోవద్దని అదురా చెబుతున్నది. తప్పకుండా వైద్యుల సలహా ప్రకారం మాత్రమే డైట్ పాటించాలని ఆమె పేర్కొంటున్నది.

# అభిమానం హైదరాబాద్‌కు రప్పించింది

**అభిమానం సరిహద్దుల్ని దాటి వచ్చేలా చేసింది. అభిమాన నటుడిని చూసేందుకు ఎంత ఖర్చు అయినా పర్లేదు. అంటూ కొందరు జపనీయులు ఇటీవల హైదరాబాద్ బాటపట్టారు. ప్రభాస్ ఇంటి ఎదుట ఫొటోకు ఫోజిచ్చారు జపాన్ పౌరులు.**



**బా**హుబలి సిరీస్‌తో రెబల్ స్టార్ ప్రభాస్ క్రేజ్ మరింత పెరిగింది. కేవలం ఇండియాలోనే కాదు.. విదేశాల్లోనూ ప్రభాస్‌కు ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగిపోయింది. ఇటీవల జపాన్‌కు చెందిన కొంతమంది అమ్మాయిలు హైదరాబాద్‌లోని ప్రభాస్ ఇంటి ఎదుట హడావుడి చేశారు. ఫిల్మ్‌నగర్‌లోని ప్రభాస్ ఇంటి మెయిన్ గేట్ ఎదుట నిలబడి ఫొటోకు ఫోజిచ్చారు. ప్రభాస్ నటించిన సెన్సేషనల్ బాహుబలి సిరీస్‌కు జపాన్‌లో విశేష స్పందన వచ్చింది. ఆ సినిమా విడుదల సమయంలో బాహుబలి టీమ్ స్వయంగా అక్కడకు వెళ్లి మరీ ప్రచార కార్యక్రమాలు చేసింది. ఈ సిరీస్‌తో ప్రభాస్‌కు జపాన్‌లో విపరీతంగా ఫ్యాన్స్ పెరిగిపోయారు. అయితే జపాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఫ్యాన్స్ 'ప్రభాస్‌ను కలిసేందుకు ప్రయత్నించగా ప్రభాస్ షూటింగ్ బిజీలో ఉండి కలవలేకపోయారని అయినా ఆనందంగా ప్రభాస్ ఇంటి ఎదుట ఫొటో దిగామని' ప్రకటించారు. సోషల్ మీడియాలో ఈ ఫొటో బాగా వైరల్ అవుతున్నది. మొత్తానికి అభిమానం సరిహద్దుల్ని దాటించి హైదరాబాద్ బాట పట్టించింది.




# నిశీధి నుంచి నిండు పున్నమి దాక






**అంతా** బాగుంది అనుకున్నప్పుడే జీవితంలో ఏదో ఒకటి జరుగుతుంది. ఆ కుదుపు మరెన్నో కష్టాలకు దారితీస్తుంది. సరిగ్గా ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్నారు 'దొరసాని' చిత్ర దర్శకులు కేవీఆర్ మహేంద్ర. సమస్యలు వెంటాడినట్టే ఆయన్ను ఓ కథ కూడా వెంటాడింది. ఎప్పుడో ఇరవై ఏండ్ల కిందట మొదలైన సంఘర్షణ ఇప్పుడు 'దొరసాని' సినిమాకు ప్రాణం పోసింది. ప్రేమ అనే యూనివర్సల్ కంటెంట్‌కు కొత్త ట్రీట్‌మెంట్ ఇస్తూ చక్కటి సాంకేతిక విలువలతో తీర్చిదిద్దారు. ఈ నెల 12న దొరసాని ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సందర్భంగా కేవీఆర్ మహేంద్ర చెప్పిన దొరసాని సంగతులేంటో.. ఆయన ప్రస్థానమేంటో తెలుసుకుందాం.

**ప్రేమ కోసం** సముద్రాలు ఈదితే ప్రపంచం గుర్తిస్తుంది. ప్రపంచాన్నే జయిస్తే చరిత్ర గుర్తుంచుకుంటుంది. ఇలాంటి ప్రేమకోసం ఓ యువకుడు గడి గోడలను దాటి మేడలోని దొరసానిని ప్రేమిస్తే ఎదుర్కొన్న పరిస్థితులేంటో సహజంగా, వాస్తవికంగా, గాఢంగా చూపించానంటున్నారు కేవీఆర్ మహేంద్ర. ట్రైలర్.. సాంగ్స్ ద్వారా అందరిలో ఆసక్తిని పెంచారు. దొరసాని వెనక కేవీఆర్ ప్రయాణం ఎలాంటిది? ఆయన మాటల్లోనే..

### ఓ ఉదయం.. ఒక పోస్టర్..

వరంగల్ జిల్లా జయగిరి మా ఊరు. మధ్య తరగతి కుటుంబం. అక్కడ థియేటర్‌కు వెళ్లి సినిమా చూసే పరిస్థితులు ఉండేవి కావు. హైదరాబాద్ రావడం అంటే అందరికీ ఒక కల. అది నాకూ ఉండేది. చిన్నప్పుడు ఒక రోజు కమ్యూనిస్టు పార్టీవాళ్లు మా ఊర్లో 'చలో హైదరాబాద్' పోస్టర్ వేస్తే దాన్ని చూశాను. ఎలాగైనా హైదరాబాద్ వెళ్లాలని ఇంట్లో వాళ్లతో ఫైట్ చేశాను. టికెట్ తీసుకొనే అవసరం ఉండదు కాబట్టి ఊర్లో వాళ్లతో కలిసి వెళ్లడానికి అమ్మానాన్న ఒప్పుకున్నారు. అలా వాళ్లతో హైదరాబాద్ వచ్చాను. ఫిల్మ్‌నగర్‌లో హీరోలు, వాళ్ల ఇండ్లు ఉంటాయని వెళ్లాం. గుట్టలలో ఓ షూటింగ్ జరుగుతుంది. దాన్ని చూడగానే సినిమా షూటింగ్ అంటే ఇలా ఉంటుందా? అనిపించింది.

### ఓ సాయంత్రం.. ఒక స్పర్శ..

ఫిల్మ్‌నగర్ గుట్టల్లో ఒక సాయంత్రం. అక్కడ ఓ సినిమా షూటింగ్ చూశాను. అది రాజశేఖర్ నటించిన 'అన్నా' సినిమా. నాకు అద్భుతంగా అనిపించింది. షూటింగ్ అంతా అయిపోయాక హీరో రాజశేఖర్ కారు ఎక్కుతున్నారు. అప్పుడే ఆ గుంపులోంచి నేను ఆయన చేతిని తాకాను. ఆ ఒక స్పర్శ నేను చిత్ర పరిశ్రమలోకి రావడానికి కారణం అయింది. అప్పుడు చాలా చిన్నవాడిని, ఏం చేయాలో తెలియదు. కానీ బలంగా అనుకున్న ఇండస్ట్రీలో ఉండాలని. ఆ మూమెంట్ లేకుండా ఉంటే నా జర్నీ ఉండేది కాదు. నేను దర్శకున్ని అయ్యుండేవాడినీ కాదు. అంత చిన్నప్పుడే నా లైఫ్‌కు బీజం పడింది. ఇంకా అక్కడి నుంచి చదువులు వదిలేసి హైదరాబాద్ వచ్చాను. ఇక్కడికి వచ్చి సినిమాల్లో ప్రయత్నాలు చేస్తూనే చదువు పూర్తి చేశాను. చాలా ప్రయత్నాలు, స్ట్రగుల్స్ తర్వాత 2002లో మొదటి సారి ఒక సినిమాకు పని చేశాను. అది పీపుల్స్ భారతక్క సినిమా. డైరెక్టర్ నాకు పెద్ద సపోర్ట్ ఉండె. అంతా బాగుంటుందని అనుకున్న. కానీ సినిమా రిలీజ్ అయ్యాక మూడు నెలల్లో డైరెక్టర్ చనిపోయారు. అది నాకు పెద్ద లోటును మిగిల్చింది. తర్వాత అనేక ప్రయత్నాలు కొనసాగాయి. పెద్ద అనుభవాలను పొందుతూ ప్రయాణం సాగించాను. నా కలల ప్రయాణం ఓ కొలిక్కి వచ్చే సమయం ఆసన్నమైంది.

### ఒక రాత్రి.. ఓ ఆవిర్భావం

ఆ రోజు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం. హైదరాబాద్ అంతా వెలుగుల జిలుగులతో మెరిసిపోతుంది. ఎక్కడికక్కడా సంబురాలు జరుగుతున్నాయి. ఆ రోజు రాత్రి నేను, నా ఫ్రెండ్ కారులో ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్ పరిసరాల్లో తిరుగుతున్నాం. ఈ వెలుగులకు కారణమైంది ఎవరు? ఇంత పండుగ వాతావరణం వెనుక ఎవరి త్యాగం దాగి ఉంది? ఈ సంబురాలు చేసుకోవడానికి అర్హులు ఎవరు? అనే ప్రశ్నలు వెంటాడాయి. కానీ వాళ్లెవరూ లేరిప్పుడు. వాళ్లు అంటే 'అమరులు'. సినిమా మాధ్యమం ద్వారా దీని గురించి ఏదో చెప్పాలనిపించింది. మరి ఇదంతా సినిమా చేయగలనా? ప్రొడ్యూసర్ దొరుకుతాడా? దొరకడు.. అందుకే షార్ట్ ఫిలిమ్ తీయాలనుకున్నా. తెలంగాణ మూమెంట్ అంటే మనకు తెలుసు. ఆ పోరాటం మనకు తెలుసు.. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు జరుగుతాయి. ఒక సంఘం ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుంది. అట్లా మనం కూడా తెలంగాణలో చేశాం. దీన్నే నేను ప్రపంచానికి తెలియజేయాలనుకున్నాను. నా ప్రయత్నం మొదలు పెట్టాను.






### 14 నిమిషాలు.. ప్రపంచ స్థాయి..

**ఆ** రాత్రి పుట్టిన సంఘర్షణల ఫలితం 'నిశీధి' షార్ట్ ఫిలిమ్. 14 నిమిషాలు బ్లాక్ అండ్ వైట్‌లో తీశాను. ఒక పోరాటంలో అమరుని పాత్ర ఏంటి, ఉద్యమం తాలూకు ఫలితం సమాజంలో ఎలా ఉంటుంది అనేదాన్ని చూపించగలిగాను. ఇది అంతర్జాతీయ వేదిక మీద ప్రదర్శితమైతే తెలంగాణ ఉద్యమ విలువ ప్రపంచానికి తెలుస్తుందనుకున్నాం. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో రెండు లక్షల రూపాయలకు పైగా ఖర్చు పెట్టా. దీని కోసం కూడా చాలా కష్టపడ్డా. ఆర్థిక సమస్యలూ వెంటాడాయి. పోస్ట్ ప్రొడక్షన్ కోసం ఒక దశలో నా ఉంగరాలు కుదువ పెట్టిన సందర్భాలున్నాయి. నిశీధి కోసం పడ్డ కష్టానికి ఫలితంగా 18 దేశాల నుంచి 39 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. చాలా గొప్ప విషయం. ఎన్నో ఈ షార్ట్ ఫిలిమ్ ఫెస్టివల్స్‌లో ఆదరణ పొందింది. తెలంగాణ ప్రభుత్వం సపోర్ట్ చేసింది. ఆ షార్ట్ ఫిలిమ్ చూసి దేశంలో ప్రముఖ ఫిలిమ్ మేకర్ శ్యాం బెనగల్ ప్రశంసిస్తూ మెయిల్ రాశారు. ఈ నిశీధితో వచ్చిన స్పందన నాలో మరింత ఆత్మస్థైర్యాన్ని పెంచింది. నేను ఇంకా సీరియస్ గా పని చేయడానికి కారణం అయింది.

### 42 వెర్షన్లు.. ప్రేక్షకుల మదిలోకి..

నిశీధి తర్వాత నన్ను మరో కథ వెంటాడింది. దాన్ని 42 వెర్షన్లు రాశాను. దానికి పట్టిన కాలం మూడేండ్ల ఎనిమిది నెలలు. ఆ కథే ఈ దొరసాని. ఏంటి ప్రత్యేకత అంటారా? ఇది టీనేజ్ ప్రేమకథే. కానీ చూపించిన విధానం, సెటప్ చేసిన ప్రదేశం కొత్తది. 1987 నాటి పరిస్థితుల్లో ఒక దొర కూతుర్ని ఒక సామన్య యువకుడు ప్రేమిస్తే ఎట్లా ఉంటుంది? అప్పటి తెలంగాణ గ్రామీణ, సామాజిక పరిస్థితులు ఎలాంటివి? అన్నీ చూపించాలి. ఆ వాతావరణాన్ని సృష్టించాలి. ఆ మట్టి పరిమళాన్ని అందించాలి. ఒక దొరల సామ్రాజ్యంలో, గడీల వాతావరణాన్ని చూపించాలి. అందుకు తెలంగాణ అంతా తిరిగాం. 105 ఏండ్ల నుంచి ఉన్న గడీని ఎంచుకున్నాం. ఆ వాతావరణంలో అమ్మాయి ఉంటుంది. బయట ఒక పేద అబ్బాయి ప్రేమలో పడితే ఏం జరుగుతుందో చూపించాం. చాలా సహజంగా, వాస్తవికంగా నిజాయితీగా ఉంటుంది సినిమా.

### కథే ధైర్యాన్నిచ్చింది

డైరెక్టర్‌గా ఇది నా తొలి సినిమా. హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ శివాత్మిక కూడా తొలి పరిచయమే. ఇది చాలెంజింగ్ అంశం. అయినా స్వీకరించాం. నిర్మాతలు చాలా నమ్మకంగా సపోర్ట్ చేశారు. కథ వినగానే సురేశ్ బాబు 'ఓకే' అన్నారు. 'ఈ కథలో మ్యాజిక్ జరుగుతది' అన్నారు. మధుర శ్రీధర్, యశ్ రంగినేని 'ఎలాగైనా ఈ సినిమా చేయాల్సిందే' అన్నారు. ఫుల్ సపోర్ట్ చేశారు. కారణం కథలో బలం. నా మీద నమ్మకం. ఈ కారణలతో ఈ కాస్టింగ్ ఎంపిక జరిగింది. మా ప్రొడ్యూసర్ మధుర శ్రీధర్ శివాత్మిక గురించి చెప్పారు. వాళ్లకు కథ నచ్చడంతో వాళ్లూ ఒప్పుకున్నారు. అప్పటికే ఆనంద్ కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ యాక్టర్ అవ్వాలన్న కోరిక బలంగా ఉంది ఆయనకు. ఆనంద్ , శివాత్మిక జోడీ బాగుంటుందనిపించింది. ఈ కారణంగా ఆనంద్‌ను తీసుకున్నాం. ఇద్దరికీ యాక్టింగ్‌లో, యాస మీద శిక్షణ ఇచ్చాం. షూటింగ్‌లోకి దిగాకా వాళ్లు చాలా ప్రభావితం అయ్యారు. పాత్రల్లో లీనమయ్యారు. బయట కూడా వాళ్లు అలాగే ఉండడాన్ని గమనించాను. అంటే కథ తాలూకు ప్రభావం వాళ్ల మీద అంతగా పడింది. అట్లాగే ఈ సినిమాలో కొత్తవాళ్లకు అవకాశాలు ఇచ్చాం. దాదాపు యాభై నుంచి అరవై మంది కొత్తవాళ్లతో నిర్మించాం.

...✍ వినోద్ మామిడాల
📷 జి. చిన్న యాదగిరిగౌడ్

# ఆఫీస్‌కు హైహీల్స్ వేసుకుని వెళ్లండి..

ఇది వరకు పార్టీలకు, ఫంక్షన్లకు మాత్రమే హై హీల్స్ వేసుకునే వారు. ట్రెండ్ మారింది. ఆఫీస్‌కు కూడా హై హీల్స్ వేసుకుని వెళుతున్నారు. కాస్త ట్రెండీగా, ఫ్యాషన్‌ను ప్రతిబింబించే విధంగా ఉన్న హై హీల్స్ ఇప్పుడు ఎంతో హుందాతనాన్ని తెచ్చిపెడుతున్నాయి.

**హై**హీల్స్ ఎప్పటి నుంచో ఉన్నవే. కానీ ఇటీవల కొన్ని హై హీల్స్ ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. ముఖ్యంగా కార్యాలయాల్లో ఉన్నతాధికారులు(పురుషులు) ఫార్మల్ షూ వేసుకుంటారు. మరి మహిళా అధికారులు ఎందుకు ఫార్మల్ షూ ధరించవద్దు! అవీ పురుషుల షూలను పోలినవే అయి ఎందుకు ఉండవద్దు. అదే కోణంలో ఆలోచించి కొన్ని షూ కంపెనీలు షూలు తయారు చేస్తున్నాయి. ప్రస్తుతం నగరాల్లో మహిళలు హుందాగా కనిపించేందుకు ఫార్మల్ హైహీల్స్ వేసుకుంటున్నారు. వర్షాకాలం రోడ్లపై నిలిచే నీటి ఇబ్బందుల నుంచి కూడా ఈ షూలు రక్షణ కల్పిస్తున్నాయని మహిళలు చెబుతున్నారు. రూ. 5 వందల నుంచి రూ. 2 వేల వరకు ఈ షూలు అందుబాటులో ఉన్నాయి. కొన్ని ప్రముఖ ఆన్‌లైన్ బిజినెస్ సంస్థలు వీటిని 50 శాతం డిస్కౌంట్‌తో కూడా అందిస్తున్నాయి.

# వారానికి మూడ్రోజులు వీకాఫ్‌తో ఉత్తమ ఫలితాలు

**ఇండియాలో ఒక ఉద్యోగి వారానికి ఆరు లేదా అయిదు రోజులు.. రోజుకు ఎనిమిది గంటలు పనిచేయాల్సిందే! నెలకు ఒకటో రెండో సెలవులు. ఇదే చాలామంది ఉద్యోగుల జీవితం. కానీ వారానికి 3 రోజులు వీక్లీఆఫ్ ఇస్తున్నాయి అమెరికా, బ్రిటన్‌లోని కొన్ని కంపెనీలు. ఈ విధానంతో ఆయా కంపెనీల్లో ఉద్యోగుల పనితనం మెరుగుపడిందని ఇటీవల కొందరు యువ ఉద్యోగులపై చేసిన సర్వేలో తేలింది.**



**బ్రి**టన్, అమెరికా సహా 8 దేశాల్లోని 3 వేల మంది యువ ఉద్యోగులపై ఇటీవల 'ఇంటర్నేషనల్ వర్క్ ప్లేస్ గ్రూప్' ఓ సర్వే నిర్వహించింది. ఇందులో 'వారానికి మూడ్రోజులు వీకాఫ్ ఇస్తే ఎలాంటి ఫలితాలు వస్తున్నాయి. ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఎలా ఉంటున్నారు. కంపెనీ, ఆఫీసు సమయాల్లో వ్యక్తిగత వ్యవహారాలపై దృష్టి పెడుతున్నారా' అనే అంశాలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో కొన్ని ఆసక్తికర అంశాలు బయటికి వచ్చాయి. ఉద్యోగులకు ఎక్కువ వీకాఫ్‌లు ఇస్తే వారు తమ సొంత సమస్యల్ని పరిష్కరించుకుని ఆఫీసుకు ఫ్రెష్ మూడ్‌తో వస్తారని తేలింది. వేగంగా తప్పులు, పొరపాట్లు జరగకుండా పనిచేస్తారని సర్వేలో తెలిసింది. మానసిక నిపుణులు సైతం మూడు రోజులు వీకాఫ్ ఇస్తే మంచిదని అంటున్నారు. ఇంటియాలో మెంటల్ స్ట్రెస్ ఎక్కువగా ఉంటుందనీ మూడురోజులు వీకాఫ్ ఉంటే ఉద్యోగుల్లో టెన్షన్లు తగ్గి మానసికంగా ఫిట్‌గా ఉంటారని ఉద్యోగ సంఘాలు సైతం మూడ్రోజుల వీకాఫ్ విధానానికి మద్దతు పలుకుతున్నాయి.

# కఠోర దీక్ష

పోలీస్ ఉద్యోగం సాధించాలంటే కఠిన పరీక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. శిక్షణ సమయంలో అనేక విద్యల్లో ప్రావీణ్యం సంపాదించాల్సి ఉంటుంది. ఒక యువతి ఇటీవల పోలీస్ శిక్షణలో ఇచ్చే అన్ని కఠిన పరీక్షలను అలవోకగా ఎదుర్కొన్న వీడియో చిత్రీకరించింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాద్యమాల్లో వైరల్ అవుతున్నది.



## సుడోకు

డైలీ సుడోకు 86 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 5 | 9 | 3 | 2 | 7 | 1 | 6 | 4 |
| 4 | 2 | 6 | 9 | 1 | 8 | 7 | 5 | 3 |
| 7 | 3 | 1 | 4 | 5 | 6 | 8 | 2 | 9 |
| 9 | 6 | 7 | 8 | 3 | 2 | 5 | 4 | 1 |
| 5 | 8 | 3 | 1 | 6 | 4 | 2 | 9 | 7 |
| 2 | 1 | 4 | 5 | 7 | 9 | 6 | 3 | 8 |
| 3 | 9 | 5 | 2 | 8 | 1 | 4 | 7 | 6 |
| 1 | 7 | 2 | 6 | 4 | 3 | 9 | 8 | 5 |
| 6 | 4 | 8 | 7 | 9 | 5 | 3 | 1 | 2 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -87

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 9 | | 4 | | 3 | | |
| | 7 | | 9 | | | | | 4 |
| 6 | | 3 | | 7 | | | | 2 |
| | | | 7 | 9 | 2 | | 3 | |
| | | | | | | | | |
| | 3 | | 4 | 1 | 8 | | | |
| 2 | | | | 3 | | 9 | | 1 |
| 1 | | | | | 7 | | 4 | |
| | | 4 | | 6 | | 2 | | |

## ట్వీట్




కామ్రేడ్స్.. 11వ తేదీన ఉదయం 11 గంటలకు మా 'డియర్ కామ్రేడ్' ట్రైలర్ రాబోతున్నది. ఇది మీ అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నా. మర్చిపోకండి. సిద్ధంగా ఉండండి!

రష్మికా మందన్న
@iamRashmika



రష్మికను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
5,34,140

## కామన్‌మ్యాన్ వాయిస్

యాక్టింగ్ నేర్చుకొని జూనియర్ ఆర్టిస్ట్ కావాలనుకుంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిస్తే సరిపోతుంది!
– Rajender

మనకు ఇష్టమైన వారు దూరమైతే ప్రపంచమే మరణించినట్లు అనిపిస్తుంది!
– Raju Athikam

పవన్ కల్యాణ్.. ఎన్నికల ముందు తెల్లబట్టలు, తెల్లగడ్డంతో జీవితం మొత్తం సమాజానికే అంకితం అన్నట్టు ఒక బిల్డప్పు ఇచ్చాడు. ఎన్నికలు అయిపోగానే జుట్టుకు రంగు, గడ్డానికి రంగు, జీన్సులు, రంగురంగుల అంగీలతో ఇప్పుడు అన్నీ సమాజ ఉద్ధరణ.. సినిమా ఉద్ధరణ స్పీచులు ఇస్తున్నాడు. ఏమిటయ్యా పీకే నీవల్ల ఉపయోగం?
– Murali Puli

## వైరల్ వీడియో




**పూరీ జగన్నాథ్ తీస్తున్న 'ఇస్మార్ట్ శంకర్'లో బోనాల సాంగ్ పెట్టారా? ఈ బోనాల సీజన్‌లో ఇదే హైలైట్‌గా నిలవబోతుందా? ట్రెండ్స్ ఏం చెప్తున్నాయి? చూడండి.**

Bonalu Song Promo | Ismart Shankar | Ram Pothineni,Nabha Natesh, Lekha Prajapati | Puri Jagannadh
Total views : 15,96,636+
Published on Jul 7, 2019

నమస్తే తెలంగాణ
# సంకేత
[ కరీంనగర్ ]
బుధవారం 10 జూలై 2019
టెక్నాలెడ్జ్ 2.0

## పోయిన ఫోన్‌ను కనిపెట్టవచ్చు!

ఎంతో ఇష్టపడి, వేల రూపాయలు వెచ్చించి మొబైల్ కొంటాం. ఒక్కోసారి మన నుంచి అది మిస్ అవుతుంది. తిరిగి పొందడం కొంత కష్టమే అవుతుంది. పోయిన ఫోన్లు చాలా అరుదుగా కనిపెట్టగలం. ఎవరైనా ఫోన్లు దొంగిలిస్తే




దాన్ని పట్టుకోవడం చాలా కష్టమనే చెప్పాలి. నెట్ వర్క్ ద్వారా కనిపెట్టే అవకాశం ఉన్నా SIM కార్డు తొలగిస్తే పరిస్థితి ఏంటో తెలియదు? కానీ రానున్న రోజుల్లో దీనికి పరిష్కారం దొరకనుంది. పోయిన లేదా దింగతనానికి గురైన ఫోన్లను ట్రేస్ చేయడానికి సెంటర్‌ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ ప్రభుత్వ సంస్థ ట్రాకింగ్ సిస్టమ్‌ను ప్రకటించింది. SIM కార్డు తొలగించినా ఫోన్ కనిపెట్టడం చాలా సులువుగా ఉండేలా ఇది పని చేస్తుంది. ఆగస్టులో ట్రాకింగ్ సిస్టమ్ టెక్నాలజీని లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. దేశంలో ఎక్కడైనా మీ మొబైల్ ఫోన్ దొంగతనానికి గురైనా, పోగొట్టుకున్నా సరే ఈ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా వెంటనే కనిపెట్టవచ్చు.

## ఆన్‌లైన్‌లో తెలుగు టైప్ చేయాలా?

**టెక్ చిట్కాలు**



ఆన్‌లైన్‌లో తెలుగు టైప్ చేయడం చాలామందికి అవసరం అవుతుంది. థర్డ్‌పార్టీ యాప్స్ చాలా అందుబాటులో ఉంటాయి కానీ కీబోర్డ్ స్టయిల్ కొందరికి కఠినంగా అనిపిస్తుంటుంది. అలాంటప్పుడు మొబైల్‌లో 'Just Telugu' యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. సులభంగా ఉంటుంది. అట్లాగే డెస్క్‌టాప్ వాడేవాళ్లయితే ఆన్‌లైన్‌లో తెలుగు టైప్ చేయడానికి telugu.indiatyping.com, khini.org, telugu.changathi.com చక్కటి ఫ్లాట్‌ఫామ్‌లు. అలాగే ఆపిల్ స్టయిల్ కీబోర్డ్ వాడుతూ టైప్ చేయాలంటే ఈ లింక్ ఓపెన్ చేయండి. https://bit.ly/2xIRGvH

**నయామాల్**

## స్యామ్‌సంగ్ ట్యాబ్



**ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ స్యామ్‌సంగ్ కొత్త ట్యాబ్‌ను విడుదల చేసింది. గెలాక్సీ A 8.0 పేరుతో ఇది మార్కెట్‌లో అందుబాటులో ఉంది.**

### A 8.0 ట్యాబ్ ఫీచర్లు

| | | |
|---|---|---|
| డిస్‌ప్లే | : | 8 అంగుళాలు |
| రిజల్యూషన్ | : | 800x1280 పిక్సెల్స్ |
| ప్రాసెసర్ | : | 2జీహెచ్‌జడ్ ఆక్టాకోర్ |
| ర్యామ్ | : | 2 జీబీ |
| స్టోరేజీ | : | 32 జీబీ, 512 వరకూ పెంచుకొనే అవకాశం |
| రియర్ కెమెరా | : | 8 మెగాపిక్సెల్స్ |
| ఫ్రంట్ కెమెరా | : | 2 మెగాపిక్సెల్స్ |
| ఆపరేటింగ్ సిస్టమ్ | : | ఆండ్రాయిడ్ 9 |
| బ్యాటరీ | : | 5100 ఎంఏహెచ్ |

వైఫై, బ్లూటూత్, 4జీ ఫీచర్లు ఉన్నాయి.

## ఆకట్టుకొనేందుకు మరో ఐదు ఫీచర్లు



**వాట్సాప్ తన వినియోగదారులను ఎప్పటికప్పుడూ ఆకర్షిస్తున్నది. ఈ ఏడాది మొదలైనప్పటి నుంచే అనేక ఫీచర్లును జోడించి ఆశ్చర్యపరిచింది. తాజాగా మరి కొన్ని ఫీచర్లను కూడా వాట్సాప్ యాడ్ చేయబోతున్నది.**

1 **హైడ్ మ్యూటెడ్ స్టేటస్ :** ఆండ్రాయిడ్ బీటా 2.19.183 అప్‌డేట్‌లో ఈ ఫీచర్ రానుంది. మామూలుగా కాంటాక్ట్ లిస్టులో ఉన్న వారి స్టేటస్‌లు మనకు కనిపిస్తాయి. అందులో ఎవరివి అవసరం లేదో వారివి మ్యూట్ చేసుకొనే ఫీచర్ ఉంది. కానీ హైడ్ ఆప్షన్ లేదు. ఈ ఫీచర్‌తో హైడ్ కూడా సాధ్యం అవుతుంది.

2 **ఫింగర్ ప్రింట్ లాక్ :** ఆండ్రాయిడ్ ఫోన్లలో యాప్ ఓపెన్ చేయడానికి ఫింగర్ ప్రింట్ అన్‌లాకింగ్ సిస్టమ్ టెస్టింగ్ దశలో ఉంది. ఇది మరింత సెక్యూరిటీ ఇస్తుంది. ఆండ్రాయిడ్ యూజర్ల కోసం Face Unlock ఫీచర్ ను కూడా తీసుకురావాలని చూస్తున్నది వాట్సాప్.

3 **షేర్ వాట్సాప్ స్టేటస్ :** ఈ ఫీచర్ వాట్సాప్ యూజర్లందరికీ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, జీమెయిల్, గూగుల్ ఫొటోల నుంచి యూజర్ల స్టేటస్ ను షేర్ చేసుకోవచ్చు. డేటా షేరింగ్ API ద్వారా iOS, ఆండ్రాయిడ్ డివైజ్ ద్వారా యూజర్ల స్టేటస్‌ను ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు.

4 **ర్యాంకింగ్ ఆఫ్ కాంటాక్ట్స్ :** ఈ ఫీచర్ కూడా త్వరలో యూజర్లకు అందుబాటులోకి రానుంది. ఫేవరెట్ కాంటాక్టు లిస్టును ప్రిపేర్ చేసుకోవచ్చు. అంటే.. ర్యాంకింగ్ ఆఫ్ కాంటాక్టులుగా సెట్ చేసుకోవచ్చు. ఆటోమేటిక్‌గా మీ వాట్సాప్ కాంటాక్టులు టాప్ లిస్టులో కనిపిస్తాయి.

5 **డార్క్ మోడ్ :** ఈ ఫీచర్ గురించి ప్రత్యేకించి యూజర్లకు చెప్పనక్కర్లేదు. ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫాంలో అందుబాటులో ఉంది. త్వరలో వాట్సాప్ లో కూడా డార్క్ మోడ్ ఫీచర్ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ డెవలప్ మెంట్ స్టేజ్ లో ఉంది.

# సెన్సర్ల సందడి

**ఈ మధ్య కొన్ని వీడియోలు చూస్తున్నాం! సూట్‌కేస్‌ను చేతితో పట్టుకోక ముందే అది వెనకాలే వస్తుంది. ఎటు వెళ్తే అటు వెంటనే వెళ్తుంటుంది. మరొకటి ఇలాంటిదే. వేలి సంజ్ఞలతో మౌస్ పాయింటర్ కదులుతుంది. ఆశ్చర్యంగా అనిపిస్తుందా? అదంతా సెన్సర్ల సందడి. ఇలాంటి సెన్సర్ల గాడ్జెట్లే ఇవి..**




### జాయ్‌స్టిక్‌గా..

ప్రజెంటేషన్ కంట్రోల్ చేయడానికీ, వీడియో గేమ్స్ ఆడడానికీ జాయ్‌స్టిక్స్ చాలా అవసరం. ఇంకా డ్రోన్ వాడాలంటే రిమోట్ లేనిదే పని కాదు. ఇలాంటి వాటి అన్నిటినీ కంట్రోల్ చేస్తుంది Myo Armband. పేరులో ఉన్నట్టే దీన్ని మోచేతికి ధరించాల్సి ఉంటుంది. దీని ద్వారా మ్యూజిక్ ప్లేయర్స్, వీడియో గేమ్స్, ప్రజెంటేషన్స్, ప్రొజెక్టర్స్ అన్నిటినీ కంట్రోల్ చేయవచ్చు. ఇది ఉంటే ప్రజెంటేషన్ ఇచ్చేటప్పుడు రిమోట్‌తో పని ఉండదు. దీన్ని ధరించి హ్యాండ్ మూమెంట్స్ ఇస్తే చాలు స్క్రీన్ యాక్సెస్ అవుద్ది. వీడియో గేమ్స్ ఆడేటప్పుడు రిమోట్ లేకుండానే ప్లేయర్‌ను కంట్రోల్ చేయవచ్చు. ప్రధానంగా డ్రోన్‌ను కూడా ఇది ఆపరేట్ చేస్తుంది. చేతి కదలికలను రిసీవ్ చేసుకుని డ్రోన్ మూవ్ అవుతుంది. థల్మిక్ ల్యాబ్స్ అనే కంపెనీ దీన్ని తయారు చేసింది. https://bit.ly/2XzyTxJ



### రింగ్ జీరో

కొన్ని సినిమాల్లో చేతివేలిని చెవి దగ్గర పెట్టుకొని ఫోన్లో మాట్లాడిట్టు మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. అదెలా సాధ్యం అంటారా? Orii smart ring అనే గాడ్జెట్‌ను చేతి వేలికి తగిలించుకోవాలి. అప్పుడు వేలిని కదిలిస్తే చాలు కాల్ అటోమేటిక్‌గా లిఫ్ట్ అవుతుంది. వేలికదలిక వల్ల ఫోన్ యాక్సెస్ అవుతుంది. అలాగే స్మార్ట్ ఫోన్ స్క్రీన్‌ను టచ్ చేయకుండానే ఆపరేట్ చేయాలనుకుంటే Ring ZERO S అనే గాడ్జెట్‌తో సాధ్యం అవుతుంది. ఈ గాడ్జెట్ 12 గంటలు ఆక్టీవ్ మోడ్‌లో ఉంటుంది. 3 రోజుల బ్యాటరీ బ్యాకప్ వస్తుంది. అచ్చం రింగ్‌లాగే దీన్ని చేతి వేలికి తొడుక్కోవాలి. బ్లూటూత్ ఉన్న ఏ స్మార్ట్ ఫోన్‌ను అయినా ఆపరేట్ చేయవచ్చు. ఆప్స్ ఓపెన్ చేయడానికి, మెసేజ్ రాయడానికి ఈ హైస్మార్ట్ గాడ్జెట్ బాగా పనిచేస్తుంది. https://bit.ly/2JoqXLV

### రొబోటిక్ సూట్‌కేట్



ఒకప్పుడు ప్రయాణాలంటే పెద్ద పెద్ద బ్యాగులను మోసుకెళ్లడానికి కష్ట పడాల్సి ఉండేది. వాటికి బదులుగా ట్రాలీ ట్రావెలింగ్ సూట్‌కేస్‌లు వచ్చాయి. చక్రాలు ఉండడంతో పట్టుకొని లాగితే సరిపోతుంది. కానీ దీని కన్నా అడ్వాన్స్‌డ్ ట్రాలీ సూట్‌కేస్‌లు కూడా ఉన్నాయి. అసలు చేతితో పట్టుకోకుండానే అవి మన వెంటే వస్తాయి. మనం ఎటు వెళ్తే అటూ ప్రయాణిస్తాయి. మన వేగంతో సమానంగా మనల్ని అనుసరిస్తాయి. అది ఎలా అంటారా? అవే రొబోటిక్ సూట్‌కేస్‌లు. చాలా నగరాల్లో ఇవి వినియోగంలో ఉన్నాయి. మొబైల్ బ్లూటూత్, వైఫైతో పనిచేస్తాయి. మొబైల్‌కు, ఈ సూట్‌కేస్‌కు ప్రత్యేకమైన సెన్సర్ల సిస్టమ్ ఉంటుంది. ఈ హ్యాండ్స్ ఫ్రీ రోబొటిక్ సూట్ కేస్ గంటకు 10.9 కిమీల వేగంతో ప్రయాణిస్తుంది. దీనికి జీపీఎస్ కూడా ఉంటుంది. దీంతో దొంగలు ఎత్తుకెళ్లినా, కనిపించకుండా పోయినా ఇట్టే పట్టేయొచ్చు. ఈ సూట్‌కేస్ ద్వారా మొబైల్‌ను కూడా చార్జ్ చేసుకోవచ్చు. సుమారు నాలుగు గంటలపాటు చార్జింగ్ ఇస్తుంది. దీని ప్రారంభ విలువ రూ.26వేలు ఉంటుంది. వీడియో చూడాలంటే ఈ లింక్‌లోకి వెళ్లండి. https://bit.ly/2qZ58Yc



### సింగిల్‌క్యూ..

సాధారణంగా టీవీనో, ఏసీనో కంట్రోల్ చేయాలంటే రిమోట్ కచ్చితంగా ఉండాల్సిందే. కానీ సింగిల్‌క్యూ singlecue సెన్సర్ గాడ్జెట్ ఉందనుకోండి ఏ రిమోట్ అవసరం లేదు. రిమోట్ లేకుండా టీవీని ఆక్సెస్ చేయొచ్చు. చేతి సంజ్ఞలతో ఛానల్ మార్చడం, వాల్యూమ్ అడ్జస్ట్ చేయడం ఈ గాడ్జెట్ పని. టీవీ, డీవీడీ, సెటప్ బాక్స్ తో పాటు స్మార్ట్ హోమ్ గాడ్జెట్లనూ దీంతో కంట్రోల్ చేయొచ్చు. ఐఆర్ రిమోట్ కంట్రోల్ డివైజ్లకు. వైఫై ఉన్న డివైజ్లకు ఇది సపోర్ట్ చేస్తుంది. దీనితో ఒకే సారీ మల్టిపుల్ డివైజ్లను వేలి సైగలతోనియంత్రించవచ్చు. https://bit.ly/1uBlDlF




### కీ బోర్డు అక్కర్లేదు..

కంప్యూటర్ ఆపరేట్ చేయాలంటే కీబోర్డు తప్పనిసరి, మౌస్ లేకపోతే పనవ్వదు. కీబోర్డు, మౌసుల్లో కార్డ్‌లెస్, హోలోగ్రామ్ కీబోర్డులు ఉన్నాయి. ఇప్పుడు వాటితో పని లేదంటున్నది జెస్ట్ సెన్సర్ కీ బోర్డు. ఈ గాడ్జెట్ ఉంటే మనం గాల్లో టైప్ చేసినా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుంది. నాలుగు వేళ్లకు తగిలించుకునే రింగులు, అరచేతిపై అమర్చుకుని పట్టీలతో కూడిన జెస్టో యాక్సెలరోమీటర్లు, గైరో స్కోపులు, మాగెటో మీటర్లు ఇలా బోలెడు సెన్సర్ ఆబ్జెక్టు ఈ గాడ్జెట్‌లో ఉన్నాయి. మన వేలి కదలికలను బట్టి అక్షరాలను అంచనా వేసి కమాండ్‌ను కంప్యూటర్‌కు అందిస్తుంది. స్మార్ట్ ఫోన్లో మాదిరిగా ప్రిడిక్టివ్ టెక్స్ట్ టెక్నాలజీ కూడా ఇందులో ఉంది. మౌస్ బటన్‌ను డబుల్ క్లిక్ చేసినట్టు, లేదా కీబోర్డ్ షార్ట్‌కట్ల తీరులో ఒక బటన్ ప్రెస్ చేసినప్పుడు నిర్దిష్టమైన పని జరిగేట్టు కూడా పని చేస్తుంది. బ్లూటూత్ ఉన్న ఏ డివైజ్‌కు అయినా జెస్ట్ కనెక్ట్ అవుతుంది. ఈ కీబోర్డ్ ఎలా పని చేస్తుందో చూడాలంటే క్లిక్ చేయండి : https://bit.ly/30osRBS

### ఎయిర్ సెల్ఫీ



సెల్ఫీల క్రేజ్ మాములుగా లేదు.ఈ క్రేజ్‌కు తగ్గట్టుగానే సెల్ఫీల కోసం ఎన్నో గాడ్జెట్లు వస్తున్నాయి. అందులో భాగంగానే ఇప్పుడు మైక్రోడ్రోన్ ఎయిర్ సెల్ఫీ మార్కెట్లోకొచ్చింది. ఇది కేవలం సెల్ఫీల కోసమే రూపొందిన గాడ్జెట్. 66 అడుగుల ఎత్తువరకు ఎగిరే ఈ మైక్రో డ్రోన్ బరువు కేవలం 52గ్రాములు. చక్కగా జేబులో పెట్టుకుని వెళ్లిపోయే ఈ డివైజ్ ఐఫోన్ 6, 6ఎస్, 7,7ఎస్ ,హువావి పి9 సహా అనేక ఆండ్రాయిడ్ ఫోన్లతో వినియోగించవచ్చు. ఎయిర్ సెల్ఫీ యాప్‌తో దీన్ని ఆపరేట్ చేయవచ్చు.

... వినో..

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## బార్క్‌లో స్టయిఫండరీ ట్రెయినీలు

**కల్పకంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీకి చెందిన బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్టయిఫండరీ ట్రెయినీ, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



- మొత్తం పోస్టులు: 47 (స్టయిఫండరీ ట్రెయినీ-43, టెక్నీషియన్-4)

**విభాగాల వారీగా ఖాళీలు**

- స్టయిఫండరీ ట్రెయినీ-43 ఖాళీలు (జనరల్-19, ఓబీసీ-15, ఎస్టీ-6, ఈడబ్ల్యూఎస్-3)
- **విభాగాలవారీగా ఖాళీలు:** ప్లాంట్ ఆపరేటర్-7, ల్యాబొరేటరీ అసిస్టెంట్-4, ఫిట్టర్-12, వెల్డర్ -2, టర్నర్-1, ఎలక్ట్రీషియన్-4, ఇన్‌స్టుమెంట్ మెకానిక్-8, ఎలక్ట్రానిక్ మెకానిక్-4, ఏసీ మెకానిక్-1
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి (సైన్స్ అండ్ మ్యాథ్స్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్‌సీవీటీ/ఎన్‌సీవీటీ నుంచి సంబంధిత ఐటీఐ ట్రేడ్‌లో ఉత్తీర్ణత. ప్లాంట్ ఆపరేటర్‌కు సైన్స్‌లో ఇంటర్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత, నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.
- **ట్రెయినింగ్ పీరియడ్:** రెండేండ్లు
- **వయస్సు:** 2019 ఆగస్టు 7 నాటికి 18 నుంచి 22 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** ఏడాదికి రూ.10,500/-, రెండో ఏడాదికి రూ. 12,500/- స్టయిఫండ్ చెల్లిస్తారు. ట్రెయినింగ్ పూర్తయిన తర్వాత టెక్నీషియన్ బీ/సీగా ఉద్యోగం ఇస్తారు. ఈ సమయంలో పేస్కేల్ రూ. 21,700/ 25,500 లభిస్తుంది.
- టెక్నీషియన్ (బాయిలర్ ఆపరేటర్/పెయింటర్)-4 ఖాళీలు
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతితోపాటు బాయిలర్ అటెండెంట్ సర్టిఫికెట్ ఉండాలి. టెక్నీషియన్ పెయింటర్‌కు పదోతరగతి (సైన్స్&మ్యాథ్స్)తోపాటు సంబంధిత ఐటీఐ ట్రేడ్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 ఆగస్టు 7 నాటికి 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పేస్కేల్:** రూ.25,500/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ.100/- ఎస్సీ/ఎస్సీ/పీహెచ్‌సీలకు ఎలాంటి ఫీజు లేదు.
- **ఎంపిక:** ఆబ్జెక్టివ్ రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్ ద్వారా
- స్టయిఫండరీ ట్రెయినీ పోస్టులకు ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది. మొదటిది ప్రిలిమినరీ (మ్యాథమెటిక్స్, సైన్స్, జనరల్ అవేర్‌నెస్) రెండోది అడ్వాన్స్‌డ్ (సంబంధిత ట్రేడ్ టెస్ట్), మూడోది-స్కిల్ టెస్ట్.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** https://recruit.barc.gov.in

## సీఆర్ఐఎస్‌లో ఇంజినీర్లు

**న్యూఢిల్లీలోని రైల్వే మంత్రిత్వశాఖకు చెందిన స్వయంప్రతిపత్తి హోదా కలిగిన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (సీఆర్ఐఎస్) ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- **మొత్తం పోస్టులు:** 50
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, నాలుగేండ్ల బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణత. గేట్ -2019 స్కోర్ కార్డ్ ఉండాలి. 22 -27 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** గేట్ స్కోర్-2019 ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.cris.org.in

## పీజీఐఎంఈఆర్‌లో

**చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ & రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- మొత్తం పోస్టులు: 39
- పోస్టుల వివరాలు: అకౌంట్స్ ఆఫీసర్, ట్యూటర్/క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, మెడికల్ సోషల్ వర్కర్, అసిస్టెంట్ (ఎన్ఎస్), పర్సనల్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, టెక్నికల్ అసిస్టెంట్/టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, అప్పర్ డివిజన్ క్లర్క్, క్యాషియర్, స్టెనోగ్రాఫర్, లోయర్ డివిజన్ క్లర్క్.
- **అర్హత:** పీజీఐఎంఈఆర్ నిబంధనలను అనుసరించి అర్హత, వయస్సు, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.pgimer.edu.in

## సీపీసీబీలో 42 ఉద్యోగాలు

**న్యూఢిల్లీలోని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కన్సల్టెంట్ తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- మొత్తం పోస్టులు: 42
- విభాగాలవారీగా ఖాళీలు: రిసెర్చ్ అసోసియేట్-1, కన్సల్టెంట్(ఏ)-6, కన్సల్టెంట్(బీ)-9, కన్సల్టెంట్(ఏ/బీ)-23, కన్సల్టెంట్(బీ) ఫైనాన్స్-2, కన్సల్టెంట్ (బీ) అడ్మినిస్ట్రేషన్-1




- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ లేదా బ్యాచిలర్ డిగ్రీ, ఎంకాం, సీఏ, ఎంబీఏ (హెచ్ఆర్), డిగ్రీ+హెచ్ఆర్‌లో పీజీ డిప్లొమా ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రిసెర్చ్ అసోసియేట్‌కు రూ. 40,000, కన్సల్టెంట్ (ఏ)కు రూ. 60,000/- మిగతా పోస్టులకు రూ. 80,000/- చెల్లిస్తారు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 27
- **వెబ్‌సైట్** :www.cpcb.nic.in

## ఐబీపీఎస్‌లో ప్రోగ్రామర్లు

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) ప్రోగ్రామర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

**పోస్టులు-ఖాళీలు:**

- అనలిస్ట్ ప్రోగ్రామర్ (లినక్స్)-2, అనలిస్ట్ ప్రోగ్రామర్ (విండోస్)-1, రిసెర్చ్ అసోసియేట్-2.
- **జీతభత్యాలు:** అనలిస్ట్ ప్రోగ్రామర్లకు ఏడాదికి రూ. 7,56,440/-, రిసెర్చ్ అసోసియేట్లకు ఏడాదికి రూ.9,36,020/-
- **అర్హతలు:** ప్రోగ్రామర్ పోస్టులకు బీఈ/బీటెక్ లేదా ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత రంగంలో ఐదేండ్ల అనుభవం ఉండాలి.
- రిసెర్చ్ అసోసియేట్ పోస్టులకు పీజీలో సైకాలజీ/ఎడ్యుకేషన్ లేదా మేనేజ్‌మెంట్ (హెచ్ఆర్)లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 20
- **పరీక్ష తేదీలు:** ఆగస్టు మొదటివారంలో
- **వెబ్‌సైట్:** https://www.ibps.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 10 జూలై 2019



నాగార్జున, రకుల్‌ప్రీత్‌సింగ్

# మన్మథుడి అవంతిక

నాగార్జున కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మన్మథుడు-2'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. నాగార్జున, జెమిని కిరణ్ నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆగస్ట్ 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్ పాత్ర తాలూకు టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. అవంతికగా రెండు భిన్న పార్శ్వాల్లో ఆమె టీజర్‌లో సందడి చేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'పెళ్లి వయసు దాటిపోయిన ఓ బ్రహ్మచారి కథ ఇది. అవంతిక అనే అందాలభామతో ఆయన ప్రేమాయణం ఏంటన్నది ఆసక్తికరంగా ఉంటుంది. నవ మన్మథుడి లీలలు ప్రేక్షకులకు చక్కటి వినోదాన్ని పంచుతాయి. చైతన్ భరద్వాజ్ సంగీతాన్నందించిన ఈ చిత్ర గీతాల్ని త్వరలో విడుదల చేస్తాం' అన్నారు. లక్ష్మి, వెన్నెల కిషోర్, రావు రమేష్, ఝాన్సీ, దేవదర్శిని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎం.సుకుమార్, సంభాషణలు: కిట్టు విస్సాప్రగడ, రాహుల్ రవీంద్రన్, స్క్రీన్‌ప్లే: రాహుల్ రవీంద్రన్, సత్యానంద్, నిర్మాణ సంస్థలు: మనం ఎంటర్‌ప్రైజెస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, వయాకామ్ 18స్టూడియోస్, దర్శకత్వం: రాహుల్ రవీంద్రన్.

# సిగ్గుని పొగరనుకుంటున్నారు!

**'సినిమా ఎంత ఆలస్యంగా విడుదలైనా ఫర్లేదు కానీ ఫలితం మాత్రం బాగుండాలి' అని అన్నారు నాగశౌర్య. 'ఛలో' సినిమాతో కెరీర్‌లో పెద్ద విజయాన్ని అందుకున్న ఆయన కథ, పాత్రల ఎంపికలో ప్రస్తుతం కొత్తదనానికి ప్రాముఖ్యత నిస్తున్నారు. సమంత ప్రధాన పాత్రలో నటించిన 'ఓ బేబీ' చిత్రంలో అతిథి పాత్రలో నటించారు నాగశౌర్య. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా మంగళ వారం హైదరాబాద్‌లో సినిమా విశేషాలతో పాటు తన కెరీర్ గురించి నాగశౌర్య పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..**



నాగశౌర్య

**'ఓ బేబీ' సినిమాను అంగీకరించడానికి కారణం ఏమిటి?**

• కథ విన్నప్పుడు నా పాత్ర నిడివి తక్కువగా ఉందనిపించింది. కానీ చిత్రీకరణ మొదలైన తర్వాత పెద్ద రోల్ అయింది. నందినిరెడ్డిపై ఉన్న నమ్మకంతో అతిథి పాత్ర అయినా సినిమాను అంగీకరించాను. 'మురారి' సినిమాలో నటి లక్ష్మి అభినయం నన్ను ఆకట్టుకుంది. ఆమెతో కలిసి నటించవొచ్చనే అనిపించి సినిమా చేశాను. కానీ లక్ష్మితో నా కాంబినేషన్‌లో ఒక్క సీన్ ఉండదు.

**రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడానికి మీరు ఇబ్బంది పడ్డారని సమంత ప్రచార వేడుకల్లో అన్నారు?**

• నాకు సిగ్గెక్కువ. దానిని అందరూ పొగరని అనుకుంటారు. నేను నటించే సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాలు ఎక్కువగా ఉండకుండా జాగ్రత్తపడతాను. కథకు అవసరముంటేనే అలాంటి సీన్స్‌లో నటిస్తాను.

**సినిమా విజయాన్ని సాధిస్తుందని ముందే ఊహించారా?**

• అన్ని తరాలకు కనెక్ట్ అయ్యే కథ ఇది. కుటుంబ అనుబంధాల నేపథ్యంలో వాస్తవికతను ప్రతిబింబించే సన్నివేశాలు నేటి సినిమాల్లో అరుదుగా కనిపిస్తుంటాయి. ఈ సినిమాలో అలాంటి హృద్యమైన సీన్స్ చాలా ఉన్నాయి. సినిమా విజయం మీద నా నమ్మకం నిజమవ్వడం ఆనందంగా ఉంది. నా కంటే ఎక్కువగా సమంత ఈ సినిమాను ప్రేమించారు.

**అతిథి పాత్ర చేయడం వల కెరీర్‌కు ఇబ్బందులు ఎదురవుతాయని అనుకున్నారా?**

• అలాంటి భయాలేవి నాకు లేవు. హిట్ సినిమాలో నేనూ ఓ భాగమవ్వాలని అంగీకరించాను. భవిష్యత్తులో నాకు నచ్చిన నటుల సినిమాల్లో అతిథి పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

**ఈ సినిమాకు మీరు అందుకున్న బెస్ట్ కాంప్లిమెంట్?**

• అతిథి పాత్రను నేను అంగీకరిస్తానో లేదో అనే ఆలోచనతో కథ చెప్పడానికి దర్శకురాలు నందినిరెడ్డి సంశయించారు. మా అమ్మకు ఈ కథ చాలా నచ్చింది. ఇలాంటి మంచి పాత్రల్లో నేను నటిస్తే బాగుంటుందని అమ్మ బలవంత పెట్టడంతో ఎమోషన్స్‌ను పక్కనపెట్టి సినిమాలో నటించాను. అమ్మకు ఈ సినిమా చాలా నచ్చింది. ఇందులో నా లుక్ బాగుందని ప్రశంసించింది.

**సమంతతో తొలిసారి పనిచేయడం ఎలా ఉంది?**

• పెద్ద హీరోయిన్‌తో పనిచేస్తున్నాననే ఫీలింగ్ ఏ రోజు కలగ లేదు. సినిమాలోని ఓ సన్నివేశంలో పొరపాటున విస్కీని సమంతపై ఉమ్మివేసే సందర్భం ఉంటుంది. అందులో నటించడానికి భయపడ్డాను. సమంతపై కాకుండా పక్కన ఉమ్మివేశాను. నటనలో ఇలాంటివన్నీ సహజమేనని సమంత చెప్పారు. తొలి టేక్ నేను సరిగా చేయకపోతే సమంతనే రెండో టేక్ అడిగి మరి ఆ సన్నివేశాన్ని పూర్తిచేసింది.

**ప్రస్తుతం నటిస్తున్న సినిమా విశేషాలేమిటి?**

• సొంత నిర్మాణ సంస్థ ఐరా క్రియేషన్స్‌లో 'అశ్వత్థామ' అనే సినిమా చేస్తున్నాను. ప్రస్తుతం మూడో షెడ్యూల్ జరుగుతున్నది. అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫలానా అమ్మాయి ఫలానా అబ్బాయి' సినిమాలో నటిస్తున్నాను. రెండు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఇందులో 7 భిన్న పాత్రల్లో కనిపిస్తాను. అలాగే దర్శకుడు సంతోష్ జాగర్లపూడితో పార్థు అనే సినిమా చేయబోతున్నాను. త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానుంది.

**'అశ్వత్థామ' చిత్రీకరణలో గాయపడ్డారు కదా. ఆ ప్రమాదం ఎలా జరిగింది. డూప్ లేకుండా రిస్కీ ఫైట్స్ చేయాలని ఎందుకనిపించింది.**

• ప్రస్తుతం ప్రేక్షకులు సినిమాలు చూసే తీరు మారిపోయింది. యాక్షన్ సన్నివేశాల్లో హీరోలే నటిస్తున్నారా? డూప్‌తో తెరకెక్కిస్తున్నారా అన్నది సులభంగా గ్రహిస్తున్నారు. ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడానికి రిస్క్ తీసుకొని నటించాను. కానీ అనుకోకుండా గాయమైంది.






'డియర్ కామ్రేడ్' చిత్రంలో విజయ్ దేవరకొండ

**విప్లవాత్మక చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు ఆర్. నారాయణమూర్తి. దాదాపు మూడున్నర దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో సిల్వర్ జూబ్లీ చిత్రాల్ని అందించారు. తను నమ్మిన సిద్ధాంతానికి అనుగుణంగా సామాజిక చైతన్యాన్ని కలిగించే ఇతివృత్తాల్ని ఎంచుకుంటూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారాయన. తాజాగా స్వీయ దర్శకత్వంలో ఆర్. నారాయణమూర్తి నటిస్తూ తెరకెక్కించిన చిత్రం 'మార్కెట్లో ప్రజాస్వామ్యం' ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళ వారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు.**



ఆర్. నారాయణమూర్తి

# నా పంథాను మార్చుకోను!

మార్కెట్లో ప్రజాస్వామ్యం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా కాదు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. అలాంటి భారతదేశంలో ప్రస్తుతం నోటు కోసం ఓటుని అమ్ముకుంటున్నారు. నాయకులు అనే వాళ్లు ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సింది పోయి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. తమ మనుగడ కోసం ఓటర్లకు తాయిలాలు అలవాటు చేస్తున్నారు. అది చాలా తప్పు. ప్రజలు కూడా నేతలు ఇచ్చే తాయిలాలకు అలవాటుపడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు.

**ఢిల్లీ నుంచి గల్లీ దాకా..**

నేటి రాజకీయ వ్యవస్థతో ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఫిరాయింపులు అధికం అయిపోయాయి. ఓ నియోజక వర్గం గురించి తెలియని వ్యాపారస్థుడు ఎక్కడో వ్యాపారం చేసుకుంటూ ఎన్నికల్లో నిలబడుతున్నాడు. ఓటుకు డబ్బులు పంచుతున్నాడు. అవసరమైతే అధిష్ఠానానికి కూడా టిక్కెట్టు కోసం డబ్బు మూటలు విసురుతున్నారు. కోట్లు పెట్టి సీట్లు కొంటున్నారు. నేటి సమకాలీన రాజకీయాల్ని ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలనే పాయింట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాను. నాయకులు పార్టీల మీద తమకున్న కక్షని మాత్రమే చూస్తున్నారు. ప్రజలు ఇచ్చిన హామీల్ని మరిచి జంపింగ్‌లను, అయా రాం గయారామ్‌లను ప్రోత్సహిస్తున్నారు. ఇది తప్పని చెప్పే ప్రయత్నమే 'మార్కెట్లో ప్రజాస్వామ్యం'.

**లీడర్ వర్సెస్ క్యాడర్..**

లీడర్ వర్సెస్ క్యాడర్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ఎన్నికల వేళ ప్రజలు అడిగిన డిమాండ్స్‌ని నెరవేర్చడం కోసం నాయకురాలు తనని నమ్ముకున్న క్యాడర్ కోసం బాండ్ పేపర్లపై సంతకాలు చేస్తుంది. దాంతో ఆ నాయకురాలు అనూహ్య మెజారిటీతో విజయం సాధిస్తుంది. అయితే గెలిచిన తరువాత మాట తప్పుతుంది. ఆ దశలో తను నమ్మిన అనుచరుడు అంజిని ముఖ్యమంత్రిని చేస్తుంది. ఆ తరువాత ఏం జరిగింది? అంజి ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాడు అన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం.

**నా పంథాని మార్చాలని..**

నటుడిగా, దర్శకుడిగా ఎన్నో విజయాలు చూశాను. ఎన్నో సిల్వర్ జూబ్లీ హిట్‌లు సొంతం చేసుకున్నాను. నా సినిమా చూడాలని ఎడ్ల బండ్లపై జనాలు థియేటర్లకు వచ్చిన రోజులున్నాయి. అలాంటి దశను చూసిన నేను గత కొంత కాలంగా ఎదురీదుతున్నాను. నేను మంచి నటుడినని, నా పంథాని మార్చాలని చాలా మంది ప్రయత్నించారు. పూరీ జగన్నాథ్ 'టెంపర్' చిత్రంలో నాకోసం మంచి వేషం రాశారు. నన్ను నటించమని కోరితే ఆయన ఇచ్చి ఆఫర్‌ని సున్నితంగా తిరస్కరించాను. ఆ తరువాత దిల్‌రాజు 'శతమానం భవతి' చిత్రంలో మంచి వేషం వుంది మీరే నటించాలన్నారు. ఇలా చాలా మంది ఇచ్చిన అవకాశాల్ని తిరస్కరించాను. అలాంటి పాత్రలు చేస్తే నాకున్న గుర్తింపును కోల్పోతాను. ఆ భయంతోనే నాపై అభిమానంతో నన్ను వెతుక్కుంటూ వచ్చిన అవకాశాల్ని వదులుకున్నాను. అలా అని నేను సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్‌ని అని చెప్పడం లేదు. ఇన్నేళ్ల ప్రయాణంలో నేనో మార్కుని సృష్టించుకున్నాను. చివరి వరకు దాన్నే అనుసరించాలనుకున్నాను.

**'నన్ను హీరోను, అన్నయ్యను దర్శకుడిని చేస్తానని నాన్న ఎప్పుడూ చెబుతుండేవారు. ఆయన చెప్పిన మాటల్ని మేము ఫాలో అవుతున్నాం' అని అన్నారు మేఘాంశ్. దివంగత నటుడు శ్రీహరి తనయుడు మేఘాంశ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'రాజ్‌దూత్'. అర్జున్, కార్తిక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎం.ఎల్.వి సత్యనారాయణ నిర్మించారు. ఈ నెల 12న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళ వారం హైదరాబాద్‌లో మేఘాంశ్ పాత్రికేయులతో ముచ్చటించారు.**

# అమ్మ భయపడేది



మేఘాంశ్

రాజ్‌దూత్ బైక్ నేపథ్యంలో సాగే కథ ఇది. ఓ యువకుడు బైక్ కోసం ఎందుకు అన్వేషిస్తున్నాడన్నది ఆకట్టుకుంటుంది. భిన్నమైన కమర్షియల్ సినిమాగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. కుటుంబ బంధాలు, ప్రేమ, వినోదం సమపాళ్లలో ఉంటాయి. నా వయసుకు సరిపోయే మంచి కథ కావడంతో అరంగేట్రానికి ఈ సినిమాను ఎంచుకున్నాను. హుషారు, అల్లరితనం మేళవింపుతో కూడిన పాత్రలో కనిపిస్తాను. సుధీర్‌వర్మ సినిమాలకు రచనా విభాగంలో పనిచేసిన అర్జున్-కార్తీక్ వినూత్నంగా సినిమాను తెరకెక్కించారు. ఇద్దరు దర్శకులు కావడంతో వారి మధ్య అభిప్రాయభేదాలు వస్తే సినిమా ఆగిపోతుందనే భయం ఎప్పుడూ ఉండేది. కానీ ఒకే మాట మీద ఉంటూ చిత్రాన్ని పూర్తిచేశారు. తొలి సినిమా అంచనాలు, ఒత్తిడుల నుంచి దూరంగా ఉండటానికే ఎలాంటి హడావుడి లేకుండా షూటింగ్ పూర్తి చేశాం. కొన్ని సన్నివేశాల్ని నలభై ఐదు డిగ్రీల వేడిని భరిస్తూ ఎండల్లో కష్టపడి పూర్తిచేశాను.

• **బీబీఏ మూడో ఏడాది...**

చిన్నప్పటి నుంచి సినిమా తప్ప నాకు మరో ప్రపంచం తెలియదు. ప్రస్తుతం బీబీఏ మూడో ఏడాది చదువుతున్నాను. చదువును కొనసాగిస్తూనే ఈ సినిమాలో నటించాను.. నేను హీరోగా నటిస్తుండటం చూసి అమ్మ గర్వపడినా ఫలితం ఎలా ఉంటుందోనని భయపడేది. సినిమా చూసి నచ్చిందని చెప్పింది. అమ్మ సెట్స్‌లోకి వచ్చినప్పుడు తన ముందు నటించడానికి నేను చాలా టెన్షన్ పడ్డాను. ఈ సినిమాను అంగీకరించిన తర్వాత నటనలో నెల రోజుల పాటు శిక్షణ తీసుకున్నాను. అలాగే స్కూల్‌లో నాటికలు వేసిన అనుభవం ఉపయోగపడింది.

• **అన్నయ్య దర్శకత్వంలో..**

నాన్న దూరమైన తర్వాత మూడు సంవత్సరాల పాటు ఇండస్ట్రీకి దూరమయ్యాం. అమ్మ యోగక్షేమాలు చూసుకుంటూ ఉండిపోయాం. అయినా ఇండస్ట్రీలోని చాలా మంది నన్ను ప్రోత్సహించడం ఆనందంగా ఉంది. భద్రాచలం, కింగ్, ఢీ, మగధీరతో పాటు నాన్న నటించిన అన్ని సినిమాలు ఇష్టమే. నాన్న ఉంటే నా తొలి సినిమా ఇంకా పెద్ద స్థాయిలో ఉండేది. అయినా నాన్న లేని లోటును అమ్మ తీర్చుతున్నది. నిరంతరం మాలో ధైర్యాన్ని నింపుతూ ముందుకు నడిపిస్తున్నది. నాన్న పోలికలు ఎక్కువగా అన్నయ్యలో కనిపిస్తాయి. నేనూ అమ్మలా ఉంటానని అందరూ చెబుతుంటారు. అన్నయ్య ప్రస్తుతం దర్శకత్వంలో మెళకువలను నేర్చుకుంటున్నారు.

## సస్పెన్స్ థ్రిల్లర్ 'దర్పణం'



రాజ్ కందుకూరి, రామకృష్ణ

తనిష్క్‌రెడ్డి, ఎలక్సియన్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'దర్పణం'. రామకృష్ణ వెంప దర్శకుడు. క్రాంతి కిరణ్ వెల్లంకి నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమాలోని లిరికల్ సాంగ్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సాంగ్ చాలా బాగుంది. సిద్ధార్థ్ అద్భుతమైన స్వరాల్ని అందించాడు. వినూత్నమైన కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. అనుక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తుంది. కథానుగుణంగా టైటిల్ పెట్టాం. నటీనటులందరూ చక్కటి అభినయాన్ని కనబరిచారు' అన్నారు. 'థ్రిల్లర్ చిత్రాల్లో పూర్తి విభిన్న చిత్రమిది. కథ, కథనాలు నవ్యరీతిలో ఉంటాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెలలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: సిద్ధార్థ్, దర్శకుడు: రామకృష్ణ.

## జూనియర్ లవ్‌స్టోరీ



ఆయుష్, షేక్‌గౌస్, పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు

వ్యాంకిష్ మీడియా పతాకంపై ఆయుష్, షిరిన్, ప్రమోదిని, మణిచందన ముఖ్యతారలుగా రవికుమార్ పొన్నగంటి దర్శకత్వంలో షేక్ గౌస్ నిర్మిస్తున్న చిత్రం 'ఏయ్ జూనియర్'. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను తెలంగాణ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ' మా చిత్ర ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించిన పోచారం శ్రీనివాసరెడ్డికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పూర్తిగా యువతను ఆకట్టుకునే అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాల మెప్పు పొందే ఉద్వేగాలు కూడా వున్నాయి. వచ్చే వారంలో టీజర్‌ను విడుదల చేసి, ఆగస్టు మొదటివారంలో పాటలను, అదే నెల చివరివారంలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'కాలేజ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న చక్కటి టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అసభ్యతకు తావు లేకుండా కుటుంబం మొత్తం కలిసి చూసేలా ఈ చిత్రం వుంటుంది' అని తెలియజేశారు. మున్ని, అనిత, డా.మండవ శ్రీనివాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అమ్మపండు, సహ నిర్మాతలు: చేపూరి చంద్రకాంత్, పులిషేరి ప్రణదీప్, సమర్పణ: సబీనా.